సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 330

సోమవారం 20-2-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి. దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'



**జడేజా సెవెన్‌స్టార్**

జడేజా స్పిన్ మ్యాజిక్. రెండో టెస్టులోనూ ఆస్ట్రేలియాపై భారత్ గెలుపు -12లో



**వైద్యం నిశ్చింతగా...**

నగదు రహిత మెడికల్ క్లెయిమ్‌లపై ప్రత్యేక కథనం -13లో



**కొంత సమయమివ్వండి**

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మళ్లీ విచారణకు హాజరయ్యేందుకు సమయం కావాలని మనీశ్ సిసోడియా సీబీఐకి లేఖ రాశారు.

వివరాలు 6లో ▸



**ద.కొరియా సైనిక విన్యాసాలు**

ఉత్తర కొరియా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం నేపథ్యంలో ద.కొరియా, అమెరికా సంయుక్త సైనిక విన్యాసాలు ప్రారంభించాయి.

వివరాలు 6లో ▸



**2 వేల కోట్లతో గుర్తు కొనేశారు**

శివసేన పార్టీ పేరు, గుర్తు కొనుగోలు వెనుక రూ.2,000 కోట్ల డీల్ చోటుచేసుకుందని సంజయ్ రౌత్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



**డ్రోన్, హెరాయిన్ లభ్యం**

భారత్– పాక్ అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంలో బీఎస్ఎఫ్ ఒక డ్రోన్‌ను, హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది.

వివరాలు 6లో ▸

# ఇంటికి హక్కు.. ఖజానాకు కిక్కు!

**ఇళ్ల క్రమబద్ధీకరణ, పేదలకు ఇంటి స్థలాల పంపిణీపై నేడు కేబినెట్ సబ్ కమిటీ భేటీ**

- రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ లేని ఇళ్లకు టైటిల్ ఇచ్చే యోచనలో ప్రభుత్వం
- ఇదే సమయంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుకునేలా ప్రణాళిక
- డాక్యుమెంట్లు లేని ఇళ్ల వివరాలను 12 కేటగిరీల్లో సేకరించిన అధికారులు
- క్రమబద్ధీకరణ ఫీజు గజం లెక్కనా, గంపగుత్తగానా అన్న దానిపై కేబినెట్ భేటీలో నిర్ణయం?
- ప్రభుత్వ ఆదాయ వనరుల పెంపుపైనా నేడు మంత్రివర్గ ఉప సంఘం ప్రత్యేక భేటీ
- ఒకేరోజు రెండు ముఖ్యమైన అంశాలపై సమావేశాలు.. కీలక నిర్ణయాలు వెలువడవచ్చనే చర్చ




సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు లేని ఇళ్లు, నిర్మాణాలను క్రమబద్ధీకరించడంతోపాటు.. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు ఇళ్లు, నిర్మాణాలను ఎలా క్రమబద్ధీకరించాలి, ఇందుకోసం ఎలాంటి విధానాన్ని అనుసరించాలన్న దానిపై వారం రోజులుగా కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే సేకరించిన వివరాలను పరిశీలించేందుకు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తదితరులతో కూడిన మంత్రివర్గ ఉప సంఘం (కేబినెట్ సబ్ కమిటీ) సోమవారం సమావేశం కానుంది. ఇళ్లు, నిర్మాణాల క్రమబద్ధీకరణతోపాటు ఈ హక్కుల కల్పన ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుకునే దిశగా చేపట్టాల్సిన చర్యలపై ఈ భేటీలో చర్చించనున్నట్టు తెలిసింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయం పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై ఆదాయార్జన శాఖల అధికారులతోనూ సోమవారమే కేబినెట్ సబ్ కమిటీ విడిగా సమావేశం కానుంది. రెండు కీలక అంశాలపై ఒకేరోజు సబ్ కమిటీ భేటీలు జరుగుతుండటంతో


మిగతా 2వ పేజీలో ▶

**ఆదాయ వనరుల పెంపుపైనా నజర్**

సోమవారమే మరో ప్రధాన అంశంపై రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయ వనరుల పెంపుపై కేబినెట్ సబ్‌కమిటీ భేటీ కానుంది. పన్నుల ఆదాయం, పన్నేతర ఆదాయం పెంపునకు మార్గాలపై ఆర్థిక, జీఎస్టీ, రిజిస్ట్రేషన్లు, మైనింగ్ తదితర శాఖల అధికారులతో ప్రత్యేకంగా చర్చించనుంది. ఇందులో ప్రభుత్వ భూముల వేలం, విలువైన అసైన్డ్ భూముల సేకరణ, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్, దిల్ వంటి సంస్థల చేతుల్లో ఉన్న ఆస్తుల అమ్మకాలు తదితర అంశాలను పరిశీలించి.. ఆదాయం పెంచుకునే మార్గాలపై ప్రభుత్వానికి సిఫార్సులు చేయనుంది.

**12.5 లక్షలు!**

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేని ఇళ్లు, నిర్మాణాల సంఖ్య



హైదరాబాద్‌లో ఆదివారం ఎమ్మెల్యే సాయన్న భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి తలసాని

# సాయన్న ఇకలేరు

**గుండెపోటుతో ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే**

**ముఖ్యమంత్రి కేసీఆర్, పలువురు ప్రముఖుల సంతాపం..**

**కంటోన్మెంట్, ముషీరాబాద్‌లో విషాదఛాయలు.. నేడు అంత్యక్రియలు**

కంటోన్మెంట్/సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జి. సాయన్న (72) కన్నుమూశారు. గురువారం సాయంత్రం గుండెపోటుతో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చేరిన ఆయన.. ఆదివారం మధ్యాహ్నం మరోసారి గుండెపోటుకు గురయ్యారు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య గీత, ముగ్గురు కుమార్తెలు నమ్రత, నివేదిత, లాస్య నందిత ఉన్నారు. సాయన్న మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మంత్రులు టి.హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, చామకూర మల్లారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, నేతలు, టీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు అశోక్‌నగర్‌లోని సాయన్న నివాసంలో

మిగతా 2వ పేజీలో ▶

**కంటోన్మెంట్‌కు ఉప ఎన్నిక లేనట్టే!** 2లో

## న్యూస్‌రీల్

**అంటువ్యాధుల సన్నద్ధతపై హైదరాబాద్‌లో కేంద్రం**

SERUM INSTITUTE OF INDIA

సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇన్ఫెక్షియస్ డిసీజెస్, ప్యాండెమిక్ ప్రిపేర్డ్‌నెస్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు కానుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కేంద్రంలో దీన్ని నెలకొల్పనున్నట్లు ప్రకటించింది.

- వివరాలు 2లో▶


**తలసరి విద్యుత్‌లో 5వ స్థానం**



వార్షిక తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఐదో స్థానంలో నిలిచింది. 3,137 యూనిట్లతో గోవా అగ్రస్థానంలో ఉండగా, 2,200 యూనిట్లతో పంజాబ్, 2,131 యూనిట్లతో హరియాణా, 2,048 యూనిట్లతో గుజరాత్ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

- వివరాలు 2లో▶

**టీఎఫ్‌పీసీ అధ్యక్షునిగా దామోదర్ ప్రసాద్**



తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ నూతన అధ్యక్షునిగా కేఎల్ దామోదర్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన టీఎఫ్‌పీసీ ఎన్నికల్లో ప్రత్యర్థి పి.కిరణ్‌పై 24 ఓట్ల తేడాతో గెలుపొందారు.

- వివరాలు 11లో▶



**అనుమతులు వచ్చినా జాప్యమే..!**

- గురుకులాల్లో 11 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నుంచి ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్
- సొసైటీల వారీగా ఇండెంట్ల సమర్పణ కూడా పూర్తి.. అయినా ఒక్క నోటిఫికేషన్ ఇవ్వని నియామకాల బోర్డు
- ఎదురుచూస్తున్న లక్షలాది మంది అభ్యర్థులు



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ తీవ్రంగా జాప్యమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అన్ని రకాల అనుమతులు జారీ అయి నెలలు కావస్తున్నా గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) నోటిఫికేషన్ల ఊసెత్తడం లేదు. మొత్తం 11 వేల ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేయగా.. ఇందులో 9,096 పోస్టులకు 8 నెలల క్రితమే.. మరో 2వేల పోస్టులకు నెలరోజుల క్రితం అనుమతులు వచ్చాయి.

**ఉద్యోగ జాతరలో భాగంగా..**

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో దాదాపు 80వేల ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రభుత్వం గతేడాది యుద్ధ ప్రాతిపదిక చర్యలు మొదలుపెట్టింది. అందులో ఇప్పటికే 60వేలకుపైగా ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో టీఎస్‌పీఎస్సీ దాదాపు 20వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వగా.. రాష్ట్ర స్థాయి పోలీసు నియామకాల బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) దాదాపు 18 వేల పోలీస్

మిగతా 5వ పేజీలో ▶

**మీకెందుకు ఓటెయ్యాలి..?**

- 'ఎమ్మెల్సీ'ప్రచారం కోసం వెళ్తున్న అభ్యర్థులను నిలదీస్తున్న టీచర్లు.. బదిలీలు, ప్రమోషన్ల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి ఏదని ప్రశ్న
- 317 జీవో, భాషా పండిట్‌ల అంశాలపైనా ఆగ్రహం
- సంఘాల నేతలకూ చేదు అనుభవం
- వేడెక్కుతున్న 'టీచర్ ఎమ్మెల్సీ'ఎన్నికల వాతావరణం

సాక్షి, హైదరాబాద్: 'మహబూబ్‌నగర్– హైదరాబాద్– రంగారెడ్డి'ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నిక దగ్గరపడుతున్న కొద్దీ అభ్యర్థుల్లో ఆందోళన పెరుగుతోంది. విద్యాశాఖలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో.. ఓటర్లను ఆకట్టుకోవడం తలనొప్పిగా మారుతోంది. బదిలీలు, పదోన్నతులు పూర్తవకపోవడం, 317 జీవో ద్వారా టీచర్లు ఇష్టంలేని ప్రాంతాల్లో పనిచేయాల్సి రావడం, భాషా పండితుల వివాదం వంటివి ఎమ్మెల్సీ ఎన్నికపై ప్రభావం చూపుతున్నాయి. ఉపాధ్యాయులకు ఫలానా మేలు చేశామని నేతలు బలంగా చెప్పుకొని ఓట్లు

మిగతా 3వ పేజీలో ▶



మీ 'సామాజిక' ముఖచిత్రం..

**బాగుందా!?**

ఒకప్పుడు ఒక వ్యక్తి గురించి తెలుసుకోవాలంటే స్నేహితులు, చుట్టాలను, చుట్టు పక్కల వాళ్లను అడిగి తెలుసుకొనేవాళ్లు. స్కూల్, కాలేజీల్లో ఇచ్చే కండక్ట్ సర్టిఫికెట్లను చూసేవాళ్లు. పెళ్లంటే అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాల గురించి వాకబు చేసేవారు. కానీ ఇప్పుడు సాంకేతిక యుగంలో నిమిషాల్లోనే మన ప్రవర్తనను అంచనా వేస్తున్నారు. దీన్నే సోషల్ ప్రొఫైలింగ్ అంటారు.

- వివరాలు 2లో▶

**మజ్లిస్‌ను తరిమికొడతాం.. రామరాజ్యాన్ని స్థాపిస్తాం**



**పాతబస్తీ మనదే... తెలంగాణ మనదే...**

- బరాబర్ సెక్రటేరియట్ డోమ్‌లను కూల్చి వేస్తాం...
- కేసీఆర్... మరో రాజామాన్‌సింగ్
- కార్వాన్ శోభాయాత్ర సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

- వివరాలు 3లో▶



ఇదండీ సంగతి



ఆచరణ సాధ్యం కాని పనుల గురించి ఎందుకు సార్.. మాట్లాడటం!!



ఆదివారం తారకరత్న భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న చిరంజీవి

**తారకరత్నకు ప్రముఖుల నివాళి** 3లో

- సినీ నటుడు నందమూరి తారకరత్న పార్థివదేహాన్ని ఆదివారం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామంలోని స్వగృహానికి తరలించారు. ఆయన భౌతిక కాయానికి పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు.

**ఉమ్మడి ఖమ్మంలో పాగా వేద్దాం!**

**మంత్రి పువ్వాడ, ఎంపీలు, ఎమ్మెల్యేల భేటీలో తీర్మానం**

- ఉమ్మడి జిల్లాలో తొమ్మిదేళ్ల అభివృద్ధిని ప్రచారం చేద్దాం.. నియోజకవర్గాల వారీగా సమావేశాలు చేపడదాం
- నేతలంతా ఏకతాటిపై ఉండాలని నిర్ణయం
- పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట కేడర్ వెళ్లకుండా చూడాలనే చర్చ

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో అన్ని సీట్లను కైవసం చేసుకోవడంపై బీఆర్ఎస్ దృష్టి పెట్టింది. జిల్లా పరిధిలో చేసిన అభివృద్ధిని ప్రచారం చేయడం, నేతలందరినీ ఏకతాటిపై ఉంచడం, విస్తృతంగా సమావేశాలు నిర్వహించి పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపడం వంటి చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ముఖ్యంగా

మిగతా 3వ పేజీలో ▶

## క్లుప్తంగా...

### 25న ముంబైకి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
'ఇండియాస్ ఆఫ్ ఇండియా–2023'కు హాజరు



సాక్షి, హైదరాబాద్‌: ఓ జాతీయ టీవీ చానెల్ నిర్వహించే 'ఇండియాస్ ఆఫ్ ఇండియా–2023'లో పాల్గొనేందుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈనెల 25న ముంబైలో పర్యటించనున్నారు. ఈ సదస్సులో '2024 ఎన్నికలు–విపక్షాల వ్యూహం'అనే అంశంపై కవిత తన అభిప్రాయాలను పంచుకుంటారు. చర్చా వేదికలో కవితతో పాటు శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది, తృణమూల్ ఎంపీ సుస్మితాదేవ్, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్‌చద్దా పాల్గొంటారు. బీఆర్‌ఎస్ పార్టీ జాతీయ ఎజెండా, దేశాభివృద్ధిపై సీఎం కేసీఆర్ ఆలోచనలను ఈ వేదిక ద్వారా పంచుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, దళితబంధు, రైతుబీమా వంటి పథకాల గురించి కవిత ఈ సదస్సులో వివరించనున్నారు.

### బీసీ జనాభా లెక్కలు వెల్లడించాలి
రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్



సాక్షి, హైదరాబాద్‌: దేశ జనాభాలో వెనుకబడిన కులాలకు సంబంధించిన గణాంకాలు వెల్లడించాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేయాలంటే జనాభా గణాంకాలపై స్పష్టత రావాలన్నారు. 2011 జనగణనలో భాగంగా బీసీల జనాభా ఎంతో స్పష్టమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు కృష్ణమోహన్ ఆదివారం ప్రధాని నరేంద్రమోదీకి బహిరంగ లేఖ రాశారు. కులగణన అనేది కేంద్ర పరిధిలోని అంశమని, అందుకే రాష్ట్రాల వారీగా కులాల వారీ జనాభా వివరాలను వెల్లడిస్తే ఆ మేరకు సంక్షేమ ఫలాలను అందించవచ్చని కృష్ణమోహన్ పేర్కొన్నారు.

### బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి
ప్రధాని మోదీకి ఎంపీ ఆర్.కృష్ణయ్య లేఖ



సాక్షి, హైదరాబాద్‌: వెనుకబడిన తరగతుల కోసం కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు కేవలం 27 శాతం రిజర్వేషన్లు దక్కడంతో తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు దక్కాలని, బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని కృష్ణయ్య కోరారు. ప్రత్యేక శాఖ ద్వారా బీసీలకు సంక్షేమ కార్యక్రమాలను విస్తృతం చేయాలని, బడ్జెట్లో బీసీల కోసం రూ.2 లక్షల కోట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

### మార్చి 15న రెండు రాష్ట్రాల సరిహద్దుల దిగ్బంధం
మందకృష్ణ మాదిగ వెల్లడి



నయీంనగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిరసనగా మార్చి 15న రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దులను దిగ్బంధిస్తామని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎమ్మెస్పీ) జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. ఆదివారం హనుమకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్, విజయవాడ నగరాలను కూడా ముట్టడిస్తామని, ఇందుకు పూర్తి బాధ్యత ఇరు రాష్ట్రాల బీజేపీ శాఖలదేనని పేర్కొన్నారు. సరిహద్దులపై ఎక్కడికక్కడ బైఠాయింపులు చేస్తామన్నారు. ప్రజలను సమాయత్తం చేయడానికి ఎంఎస్ఎఫ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి రాజధానులను చేరుకోడానికి మహాసంగ్రామ యాత్ర ఊరూరా మొదలవుతుందని వెల్లడించారు. ఎంఎస్పీ ఆధ్వర్యంలో మార్చి 20న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని మందకృష్ణ ప్రకటించారు. బీజేపీకి లోకసభ, రాజ్యసభలో పూర్తి మెజారిటీ ఉండి కూడా ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టకుండా మాదిగలను మోసం చేస్తోందని అని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

### నటుడు నరేష్ క్యారవాన్‌పై దాడి
పోలీసులకు పీఏ ఫిర్యాదు

గచ్చిబౌలి (హైదరాబాద్): నటుడు నరేష్ ఇంటి ముందు పార్క్ చేసిన క్యారవాన్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని ఆయన పీఏ ఆదివారం గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనలో క్యారవాన్ ముందు అద్దం ధ్వంసమైందని ఆయన పేర్కొన్నారు. గతంలోను నరేష్ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడటంపై ఫిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు. నరేష్ పీఏ ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలంటే.. కోర్టు అనుమతి తీసుకోవలసి ఉంటుందని గచ్చిబౌలి సీఐ సురేష్ స్పష్టం చేశారు.


---

→ సుదీప్ బీటెక్ పూర్తి చేశాడు. అమెరికాలోని ఓ యూనివర్సిటీలో ఎంఎస్ సీటు వచ్చింది. వీసా కోసం నిరీక్షిస్తుండగా వీసా రిజెక్ట్ అని మెసేజ్ వచ్చింది..అన్నీ సక్రమంగానే ఉన్నా వీసా ఎందుకు రిజెక్ట్ అయ్యిందో సుదీప్‌కు అర్థంకాలేదు.

→ ఉన్నత విద్యావంతురాలైన శ్రీవిద్యకు మాట్రిమొనీ వెబ్‌సైట్‌లో ఓ ఎన్ఆర్ఐ సంబంధం రావడంతో ఆమె తండ్రి ఉబ్బితబ్బిబయ్యాడు. కానీ అంతలోనే 'మీ సంబంధం వద్దని మా అబ్బాయి అంటున్నాడు' అని పెళ్లికొడుకు తండ్రి. కారణం చెప్పకుండానే ఫోన్ కట్ చేశాడు.

→ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న వినీష్‌కు మరో కంపెనీలో మంచి పొజిషన్, జీతం పెంపుతో ఆఫర్ వచ్చింది. దేశాల్లోని ఆన్‌సైట్ ప్రాజెక్టుకు ఎంపికయ్యాడు. కానీ వారం తర్వాత ఆఫర్ లెటర్ రిజెక్ట్ అయినట్లు అతనికి ఈ–మెయిల్ వచ్చింది.

సుదీప్‌కు వీసా రాకపోవడానికి... శ్రీవిద్య పెళ్లి సంబంధం చెడిపోవడానికి... వినీష్ జాబ్ ఆఫర్ రిజెక్ట్ కావడానికి కారణం ఒక్కటే ...వారి సోషల్ ప్రొఫైల్ బాగోలేకపోవడం. ఆకతాయి చేష్టలతో ఆన్‌లైన్‌లో వారు పెట్టిన కామెంట్లు, ఫొటోలు, వీడియోలు, ఇతర పోస్టులు ఇప్పుడు వారి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశాయి. సోషల్ ప్రొఫైలింగ్‌తో వారంతా చిక్కుల్లో పడ్డారు.



# మీ 'సామాజిక' ముఖచిత్రం.. బాగుందా!?

## సోషల్ ప్రొఫైలింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం



పెళ్లి, ఉద్యోగం, విదేశీ ప్రయాణం వంటి అంశాల్లో తప్పనిసరవుతున్న సోషల్ మీడియా తనిఖీ

పోస్టులు, కామెంట్ల ఆధారంగా మన ప్రవర్తనను అంచనా వేస్తున్న సంస్థలు

సాక్షి, హైదరాబాద్‌: ఒకప్పుడు ఒక వ్యక్తి గురించి తెలుసుకోవాలంటే స్నేహితులు, చుట్టాలను, చుట్టుపక్కల వాళ్లను అడిగి తెలుసుకొనేవాళ్లు. స్కూల్, కాలేజీల్లో ఇచ్చే కాండక్ట్ సర్టిఫికెట్లను చూసేవాళ్లు. పెళ్లంటే అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాల గురించి వాకబు చేసేవారు. కానీ ఇప్పుడు సాంకేతిక యుగంలో నిమిషాల్లోనే మన ప్రవర్తనను అంచనా వేస్తున్నారు. దీన్నే సోషల్ ప్రొఫైలింగ్ అంటారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్, టెలిగ్రామ్ ఇలా అనేక సోషల్ మీడియా ఖాతాల ద్వారా మనం నిత్యం ఏదో ఒక సమాచారం పంచుకుంటూనే ఉంటాం. అందులో ఒక వ్యక్తి పెట్టే కామెంట్లు, చేసే పోస్టులు, ఫొటోలు పంచుకునే భావాలను అంచనా వేసి ఆ వ్యక్తి గురించి అంచనా వేయడమే సోషల్ ప్రొఫైలింగ్.

**విద్యార్థులు హద్దు దాటితే కష్టమే..**

సోషల్ మీడియా యాప్‌లలో యువత, విద్యార్థులు గంటల తరబడి చాటింగ్‌లు, మీటింగ్‌లలో కొందరు హద్దు దాటుతున్నారు. ఎదుటి వారిని కించపర్చేలా వ్యాఖ్యలు పోస్టు చేస్తున్నారు. ఇంకొందరు తోటి విద్యార్థులను సైబర్ బుల్లీయింగ్ (తప్పుడు వ్యాఖ్యలతో వేధించడం) చేస్తున్నారు. మరికొందరు రాజకీయపరమైన వ్యాఖ్యలు, మతపరమైన వివాదాస్పద కామెంట్లు పెడుతున్నారు. ఇవే చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. యూకే, కెనడా, అమెరికా లేదా ఇతర దేశాలకు వెళ్లాలనుకొనే వారి సోషల్ మీడియా ఖాతాలను ఆయా దేశాల ఎంబసీలు పరిశీలించి వీసాల జారీలో వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటాయన్న విషయాన్ని మరుస్తున్నారు.

**ఉద్యోగులకు జాగ్రత్త తప్పదు..**

ప్రభుత్వ లేదా ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సైతం సోషల్ మీడియా వాడకంలో సంయమనం పాటించకపోతే చిక్కులు తప్పవు. మతం, ప్రాంతం, కులాన్ని కించపర్చేలా పోస్టులు పెడితే అవి కెరీర్‌పరంగా ఎదిగేందుకు అడ్డంకిగా మారొచ్చు. ఇటీవలే కేంద్ర ఆర్థిక శాఖలో పనిచేసే ఓ టైపిస్ట్ కొంత బడ్జెట్ సమాచారాన్ని సోషల్ మీడియాలో పెట్టాడన్న కారణంతో అతన్ని వెంటనే సస్పెండ్ చేశారు.

**డిజిటల్ ఫుట్‌ప్రింట్ మనమే ఇస్తున్నాం..**



సోషల్ మీడియాలో మన వ్యక్తిగత వివరాలను, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు, స్నేహితులు ఎవరు, ఎక్కడికి తరచూ వెళుతుంటాం తదితర అంశాలను నిత్యం షేర్ చేస్తున్నాం. సోషల్ ప్రొఫైలింగ్‌కు కారణమయ్యే ఈ సమాచారాన్నే డిజిటల్ ఫుట్ ప్రింట్స్ ఆన్ సోషల్ మీడియా అని అంటారు.

**హనీట్రాప్‌లలో చిక్కే ప్రమాదం...**

ఏదైనా కంపెనీ లేదా కీలక ప్రభుత్వరంగ సంస్థల్లోని కొందరు ఉద్యోగులను హనీట్రాప్ (వలపు వల) ద్వారా అధీనంలోకి తెచ్చుకొని సమాచారం రాబట్టేందుకు సైతం వారి సోషల్ ప్రొఫైలింగే కీలకం అవుతోంది. సదరు వ్యక్తి బలహీనతలు గుర్తించి ట్రాప్ చేస్తారు. ఉదాహరణకు ఎవరైనా హీరోయిన్ గురించి ఎక్కువ ప్రస్తావన, లైక్, కామెంట్లు ఉన్నట్లయితే ఆ బలహీనతనే ఎరగా వేసి హనీట్రాప్ చేసే ప్రమాదం ఉంటుంది.



**వివరాలు ఇవ్వకపోవడం ఉత్తమం..**

ప్రస్తుత కాలంలో సోషల్ మీడియాకు దూరంగా ఉండటం సాధ్యం కాని పరిస్థితి. సోషల్ మీడియాలో మన సమాచారాన్ని వీలైనంత తక్కువగా ఉండేలా చూసుకోవాలి. వ్యక్తిగత, కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలను సాధ్యమైనంత వరకు పెట్టకూడదు. కుల, మత, ప్రాంత, రాజకీయపరమైన పోస్టులేవీ పెట్టకపోవడం ఉత్తమం. యువత ఈ విషయాన్ని గుర్తిస్తేనే వారు భవిష్యత్తులో చిక్కుల్లో పడకుండా ఉంటారు.

– ప్రసాద్ పాటిబండ్ల, సైబర్ ఇంటెలిజెన్స్ నిపుణుడు, ఢిల్లీ


ఆస్ట్రా టెక్నాలజీ సొల్యూషన్స్ అనే సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సోషల్ మీడియా యాప్‌లు వాడుతున్న యూజర్ల సంఖ్య ఇలా..

| ఫేస్‌బుక్ | షేర్‌చాట్ | లింక్డ్‌ఇన్ | వాట్సాప్ | స్నాప్‌చాట్ | ట్విట్టర్ |
|---|---|---|---|---|---|
| 293 | 117 | 83 | 48.7 | 33.2 | 23.7 |

| ఇన్‌స్టాగ్రామ్ | టెలిగ్రామ్ | మోజ్ | పింటెరెస్ట్ |
|---|---|---|---|
| 23 | 21.4 | 16 | 11.4 |

(అంకెలు కోట్లలో)

---



# తలసరి 'విద్యుత్'లో 5వ స్థానం

**తెలంగాణలో ఒక్కొక్కరు నగటున 2,012 యూనిట్ల వాడకం**

- తలసరి వ్యవసాయ విద్యుత్ వినియోగంలో రాష్ట్రమే టాప్.. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ 2020–21 నివేదికలో వెల్లడి

**1,241** రాష్ట్రంలో విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన వారు

**వ్యవసాయ విద్యుత్‌లో టాప్**

- రాష్ట్రాల్లో వివిధ కేటగిరీల వారీగా తలసరి విద్యుత్ వినియోగాన్ని పరిశీలిస్తే.. 592.24 యూనిట్ల తలసరి వ్యవసాయ విద్యుత్ వినియోగంతో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది.
- గృహ కేటగిరీలో 813.94 యూనిట్ల తలసరి వినియోగంతో గోవా అగ్రస్థానంలో ఉండగా.. 340.62 యూనిట్లతో తెలంగాణ 5వ స్థానంలో ఉంది.
- వాణిజ్య కేటగిరీలో 273.11 యూనిట్లతో గోవా అగ్రస్థానంలో.. 128.81 యూనిట్లతో తెలంగాణ రెండో స్థానంలో నిలిచాయి.
- హెచ్‌టీ కేటగిరీ కింద పారిశ్రామిక విద్యుత్ వినియోగంలో 1,163.99 యూనిట్లతో గోవా ప్రథమ స్థానంలో ఉండగా.. తెలంగాణ 299.19 యూనిట్లతో పదో స్థానంలో ఉంది.

సాక్షి, హైదరాబాద్‌: వార్షిక తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఐదో స్థానంలో నిలిచింది. 3,137 యూనిట్లతో గోవా అగ్రస్థానంలో ఉండగా, 2,200 యూనిట్లతో పంజాబ్, 2,131 యూనిట్లతో హరియాణా, 2,048 యూనిట్లతో గుజరాత్ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. తెలంగాణలో తలసరి విద్యుత్ వినియోగం 2,012 యూనిట్లుగా ఉంది. 2019–20లో భారతదేశ తలసరి విద్యుత్ వినియోగం 1,208 యూనిట్లుకాగా.. 2020–21లో 1,161 యూనిట్లకు తగ్గిపోయింది. 2020–21 సంవత్సరానికి సంబంధించిన లెక్కలతో.. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) తాజాగా విడుదల చేసిన 'అఖిల భారత విద్యుత్ గణాంకాలు–2022'నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది. రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాలను సైతం పరిగణనలోకి తీసుకుంటే.. 10,478 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగంతో దాద్రానగర్ హవేలీ తొలిస్థానంలో, 5,473 యూనిట్లతో డామన్ డయ్యూ రెండో స్థానంలో నిలిచాయి. ఈ జాబితాలో తెలంగాణ 9వ స్థానంలో నిలిచింది.

**కరెంటు మరణాలు ఎక్కువ**

విద్యుదుత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థలన్నింటిలోనూ కలిపి విద్యుత్ ప్రమాదాల్లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2020–21లో రాష్ట్రంలో 4,676 ప్రమాదాలు చోటుచేసుకోగా, కర్ణాటకలో 2,935, రాజస్థాన్‌లో 2,726 ప్రమాదాలు జరిగాయి. ఇక రాష్ట్రంలో జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో 1,241 మంది మృతిచెందగా.. 219 మంది క్షతగాత్రులయ్యారు. 1,062 మరణాలతో మధ్యప్రదేశ్, 1,038 మరణాలతో మహారాష్ట్ర రెండు, మూడో స్థానాల్లో నిలిచాయి. విద్యుత్ ప్రమాదాలతో దేశంలో మొత్తంగా 9,021 మంది ప్రాణాలు కోల్పోగా, 3,750 మంది క్షతగాత్రులయ్యారు. విద్యుత్ ప్రమాదాల్లో మృతిచెందిన పశువుల సంఖ్య తెలంగాణలో (2,876 పశువులు) ఎక్కువగా ఉంది. మొత్తం ప్రమాదాల సంఖ్యలో మనుషులు, పశువుల మరణాలు/గాయాలు పాలైన ఘటనలు ఉన్నాయి.

---

# సాయన్న ఇకలేరు..

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

**కుటుంబసభ్యులను ఓదార్చిన కేసీఆర్**

సాయన్న మరణం పట్ల సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. సాయన్న చేసిన ప్రజా సేవను, ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబసభ్యులను ఓదార్చారు.

**సాయన్న మృతి పార్టీకి తీరని లోటు: కేటీఆర్**

సాయన్న కన్నుమూతపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఆయన మృతి కుటుంబసభ్యులకే గాకుండా, పార్టీకి, కంటోన్మెంట్ ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు.

**పలువురు నేతల సంతాపం**

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తదితరులు సంతాపం ప్రకటించారు.

**నాలుగేళ్లుగా అస్వస్థతతో..**

సాయన్న 2018లో గెలిచిన నాటి నుంచే అస్వస్థతకు గురయ్యారు. ఆ ఎన్నికల్లో ముమ్మర ప్రచారంలో పాల్గొన్నారు. షుగర్ లెవల్స్ పెరుగుతూ తరచూ అస్వస్థతకు గురైనప్పటికీ పట్టించుకోకుండా పాదయాత్రలు చేశారు. దీంతో ఆరోగ్యం దెబ్బతిన్నది. డిసెంబర్ 14న జరిగిన ఓట్ల లెక్కింపు అనంతరం అక్కడే అస్వస్థతకు గురయ్యారు. వారం రోజుల పాటు చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జి అయ్యారు. అయితే ఎడమ కాలు కొంత భాగం తొలగించాల్సి రావడంతో కృత్రిమ కాలుతోనే మళ్లీ నియోజకవర్గంలో బిజీ అయ్యారు. కానీ మధ్యమధ్యలో అనారోగ్యానికి గురవుతుండేవారు. ఈ నెల 16వ తేదీ ఉదయం ప్రగతిభవన్‌కు వెళ్లి మంత్రి కేటీఆర్‌ను కలిసి వచ్చారు. తర్వాత కార్ఖానాలోని తన కార్యాలయంలో సందర్శకులతో ఉత్సాహంగా మాట్లాడారు. అయితే ఆ రోజు సాయంత్రమే ఛాతీ నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన యశోద ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయం వైద్యులు పరీక్షలు నిర్వహిస్తుండగానే మరోసారి గుండెపోటుకు గురయ్యారు. ఐసీసీయూలో చికిత్స అందిస్తున్న క్రమంలోనే కన్నుమూశారు. అప్పటికే ఆస్పత్రికి చేరుకున్న నేతలు, కార్యకర్తలు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. సాయన్న మరణ వార్తతో కంటోన్మెంట్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన అంత్యక్రియలు మారేడుపల్లిలోని స్మశానవాటికలో సోమవారం జరగనున్నాయి.



సాయన్న మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి హరీశ్‌రావు తదితరులు

**బ్యాంకు ఉద్యోగం వదులుకుని రాజకీయాల్లోకి..**

నిజామాబాద్ జిల్లా వల్వపూర్‌కు చెందిన సాయన్న ఆ గ్రామం నుంచి డిగ్రీ పూర్తి చేసిన తొలి ముగ్గురిలో ఒకరిగా నిలిచారు. 1978లో బ్యాంకులో ఉద్యోగిగా చేరారు.1986లో తొలిసారిగా దోమలగూడ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఆ తర్వాత ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1994లో తొలిసారిగా నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కంటోన్మెంట్ నుంచి పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించిన సాయన్న, ఆ తర్వాత 1999, 2004, 2014, 2018 ఎన్నికల్లోనూ గెలుపొందారు. అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా నాయకుడిగా ఎదిగారు. 2014లో టీఆర్ఎస్‌లో చేరారు.

---

## అంటువ్యాధులు, మహమ్మారుల సన్నద్ధతపై
# హైదరాబాద్‌లో ప్రత్యేక కేంద్రం

- ఐఐపీఎంలో ఏర్పాటు చేస్తామన్న సీరం ఇన్‌స్టిట్యూట్
- స్వాగతించిన ఐటీ, పరిశ్రమల మంత్రి కేటీ రామారావు

సాక్షి, హైదరాబాద్‌: ప్రముఖ టీకాల తయారీ సంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా హైదరాబాద్‌లో అంటువ్యాధులు, మహమ్మారుల సన్నద్ధతపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)ను ఏర్పాటు చేయనుంది. నగరంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (ఐఐపీఎం) ఆవరణలో ఈ కేంద్రాన్ని డాక్టర్ సైరస్ పూనావాలా పేరిట నెలకొల్పనుంది. ఈ మేరకు సీరమ్ సంస్థ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్‌లో వర్చువల్‌గా జరిగిన ఒక కార్యక్రమంలో సీరం ఇన్‌స్టిట్యూట్ ఈ మేరకు ప్రకటించింది. ప్రజారోగ్య అత్యవసర సమయాల్లో సమాచారం, వనరులు, సాయం అందించేందుకు దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ప్రజారోగ్యంపై చైతన్యం, అంటువ్యాధుల వ్యాప్తిపై స్పందించేలా దీన్ని తీర్చిదిద్దనుంది. పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ దేశవ్యాప్తంగా స్థాపించిన ఐదు సంస్థలలో ఇదొకటి. గతేడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సమావేశాల సందర్భంగా సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈఓ అదర్ పూనావాలాతో రాష్ట్ర ఐటీ పరిశ్రమల మంత్రి కేటీఆర్ సీవోఈ ఏర్పాటుపై చర్చించారు. ఆదివారం వర్చువల్ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితికి సీవోఈ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రపంచంలోనే వ్యాక్సిన్ రాజధానిగా పరిగణించబడే హైదరాబాద్ నగరానికి అతిపెద్ద వ్యాక్సిన్ తయారీదారు సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీవోఈని నెలకొల్పుతుండటాన్ని ఆయన స్వాగతించారు. ఐఐపీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాధుల నివారణ, మహమ్మారి ముప్పులను అంచనా వేయడానికి, నివారించడానికి, తగ్గించడానికి సీవోఈ సహాయపడుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ ప్రభుత్వ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి ఎం. నాగప్పన్ పాల్గొన్నారు.

# టీఏజీకి జర్మన్ ఎక్సలెన్సీ అవార్డు

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ జర్మన్ (టీఏజీ)కు ఇండో జర్మన్ ఎక్సలెన్సీ అవార్డు దక్కింది. కోవిడ్–19 సంక్షోభ పరిస్థితుల్లో జర్మన్‌లోని భారతీయ విద్యార్థుల వైద్య సదుపాయాల కోసం టీఏజీ చేసిన కృషికి ఈ అవార్డు లభించింది. బ్రెమెన్ పట్టణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో టీఏజీ అధ్యక్షుడు డాక్టర్ రఘు చలిగంటి ఈ అవార్డును బ్రెమెన్ సిటీ మేయర్, సెనేటర్ డాక్టర్ మైక్ స్కేఫర్ నుంచి అందుకున్నారు.

# కంటోన్మెంట్‌కు ఉప ఎన్నిక లేనట్టే!

- 'ఆరు నెలల లోపు ఎన్నికలు' నిబంధన వర్తించదు
- ప్రస్తుత అసెంబ్లీ కాలపరిమితి ఏడాది లోపు ముగియనుండటమే కారణం



సాక్షి, హైదరాబాద్‌: సాయన్న మరణంతో ఖాళీ అయిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక జరిగే అవకాశాలు లేవు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఏడాది సమయం కూడా లేకపోవడమే దీనికి కారణం. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 151ఏ నిబంధన ప్రకారం.. ఎమ్మెల్యే స్థానం ఖాళీ అయితే ఆరు నెలల్లోగా ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, చనిపోయిన/రాజీనామా చేసిన/అనర్హత వేటు పడిన సభ్యుడి పదవీ కాలం ఏడాదిలోపే ఉంటే ఈ నిబంధన వర్తించదు. శాసనసభ గడువు వచ్చే డిసెంబర్ 11తో ముగియనుంది. అంటే మరో 10 నెలలే మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్థానానికి ఉప ఎన్నికలు జరిగే అవకాశం లేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) కార్యాలయ వర్గాలు తెలిపాయి.

---

# ఇంటికి హక్కు.. ఖజానాకు కిక్కు!

▶ మొదటి పేజీ తరువాయి

కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ప్రభుత్వ స్థలాల నుంచి సాదాబైనామాల దాకా..**

ఈ నెల 13న జరిగిన కేబినెట్ సబ్ కమిటీ భేటీలో రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు లేని ఇళ్లు, నిర్మాణాలను క్రమబద్ధీకరించడంతోపాటు.. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీపై చర్చించారు. దీనికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయి నుంచి వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇంటి పన్ను రశీదులు లేని ఇళ్లు, నిర్మాణాల వివరాలను మొత్తం 12 కేటగిరీల్లో రెవెన్యూ శాఖ సేకరించింది. ఇందులో ప్రభుత్వ స్థలాలు, సాంఘిక సంక్షేమశాఖ సేకరించిన భూములు, సీలింగ్ భూములు, ఆబాదీ/గ్రామ కంఠం, దేవాదాయ, వక్ఫ్, శిఖం/ఎఫ్‌టీఎల్, పలు శాఖలకు కేటాయించిన ప్రభుత్వ స్థలాలు, పలు సంస్థలు, వ్యక్తులకు ప్రభుత్వం లీజుకిచ్చిన భూములు, నోటరీలు మాత్రమే ఉన్న భూములు, సాదాబైనామా లావాదేవీలు జరిగిన భూములు, ఇతర కేటగిరీల స్థలాలు ఉన్నాయి. ఈ కేటగిరీల్లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లతోపాటు గ్రామాల నుంచీ వివరాలను పంపాలని రెవెన్యూ ఉన్నతాధికారులు నిర్దేశిత ఫార్మాట్ పంపగా.. తహసీల్దార్లు ఆ వివరాలను సేకరించి అందజేశారు.



**ఒక్కో డివిజన్‌లో 17వేల దాకా...**

కొన్నిరోజులుగా రెవెన్యూ యంత్రాంగం సేకరించిన వివరాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేని ఇళ్లు, నిర్మాణాలు 12.5 లక్షల వరకు ఉన్నట్టు తేల్చారు. రెవెన్యూ డివిజన్ల వారీగా పరిశీలిస్తే.. ఒక్కో రెవెన్యూ డివిజన్‌లో 15వేల నుంచి 17 వేల వరకు ఇలాంటి నిర్మాణాలు ఉంటాయని క్షేత్రస్థాయి రెవెన్యూ యంత్రాంగం అంచనా వేసింది. మొత్తంగా 60శాతానికి పైగా నిర్మాణాలు గ్రామ కంఠాలు, ఆబాదీ భూముల్లోనే ఉన్నాయని.. అలా ఉన్నవాటి సంఖ్య ఏడున్నర లక్షల వరకు ఉంటుందని సమాచారం. ఇక గ్రామాలు, పట్టణాల్లో కలిపి ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు, ఇతర నిర్మాణాలు కలిపి మరో రెండున్నర లక్షలు (16–20 శాతం) ఉండవచ్చని.. మిగిలిన కేటగిరీల్లో మరో 2–3 లక్షల వరకు రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు లేని ఇళ్లు, నిర్మాణాలు ఉన్నాయని అంచనా. ప్రస్తుతానికి తమ దగ్గర ఉన్న సమాచారం మేరకు ఈ లెక్కలు వేశామని.. సమగ్రంగా పరిశీలన చేస్తే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. గత సోమవారం జరిగిన కేబినెట్ సబ్ కమిటీ భేటీలో ఈ డేటా సేకరణకు నిర్ణయం తీసుకున్నారని.. ఈ వారం రోజుల్లో 20 జిల్లాల నుంచే పూర్తి సమాచారం వచ్చిందని, మరికొన్ని జిల్లాల నుంచి అందాల్సి ఉందని అంటున్నాయి.

**రెగ్యులరైజ్ చేసేదెలా?**

దశాబ్దాల తరబడి నివాసం ఉంటున్న ఇళ్లు, ఇతర నిర్మాణాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేకుంటే.. వాటిని క్రమబద్ధీకరించడం ఎలాగన్న దానిపై సోమవారం జరిగే కేబినెట్ సబ్ కమిటీ భేటీలో చర్చించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రమబద్ధీకరించాల్సిన ఇళ్లు, నిర్మాణాలు ఎన్ని ఉంటాయి? వాటిని క్రమబద్ధీకరించేందుకు ఉన్న అవకాశాలేమిటన్న వివరాలను ఇప్పటికే సేకరించినట్టు తెలిసింది. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులతో చర్చించనున్న కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు సమాచారం. అయితే జీవో 58, 59 (పట్టణాల్లోని ప్రభుత్వ స్థలాల్లో కట్టుకున్న నివాసాల క్రమబద్ధీకరణ) మాదిరిగా స్థలాల ప్రభుత్వ విలువ ఆధారంగా సీలింగ్ నిర్ణయించి.. చదరపు గజాల లెక్కన ఫీజు వసూలు చేయాలా? లేక ప్రతి ఇల్లు/ నిర్మాణానికి గ్రామాలు/పట్టణాల వారీగా గంపగుత్తగా రుసుము నిర్ణయించాలా? అన్న దానిపైనా చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. సాదాబైనామాలు, నోటరీ (జీహెచ్ఎంసీ పరిధిలో) భూముల విషయంలోనూ క్రమబద్ధీకరణకు అవకాశాలను పరిశీలించనున్నట్టు సమాచారం. ఈ అంశాలపై సబ్ కమిటీ నిర్ణయాలను సిఫార్సుల రూపంలో ప్రభుత్వానికి అందించనున్నట్టు తెలిసింది. ప్రభుత్వం ఆ సిఫార్సులను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుందని అధికార వర్గాలు చెప్తున్నాయి. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా వ్యక్తిగతంగా దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని.. క్రమబద్ధీకరణ కటాఫ్ తేదీని, దరఖాస్తు గడువును త్వరలో ప్రకటించవచ్చని అంటున్నాయి.

**బూమరాంగ్ అవుతుందా?**

ప్రభుత్వ స్థలాలు, గ్రామ కంఠాలు, ఇతర భూముల్లోని ఇళ్లు, నిర్మాణాల క్రమబద్ధీకరణ అంశం బూమరాంగ్ అవుతుందా అనే చర్చ కూడా ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది. గతంలో పట్టణాలు, గ్రామాల్లోని ఓపెన్ ప్లాట్లు, నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ పథకాలను ప్రకటించింది. రూ.1,000 చెల్లించి వ్యక్తిగతంగా దరఖాస్తులు చేసుకోవాలని.. తర్వాత నిర్దేశిత ఫీజు చెల్లించి స్థలాలు, భవనాలను క్రమబద్ధీకరించుకోవచ్చని పేర్కొంది. ప్రభుత్వ ప్రకటనతో లక్షల్లో దరఖాస్తులు వచ్చినా.. తమ భూములు, భవనాలపై ప్రభుత్వానికి మళ్లీ ఫీజు ఎందుకు చెల్లించాలని ప్రజల నుంచి ప్రతికూల అభిప్రాయం వ్యక్తమైంది. ఈ క్రమంలో ఆ దరఖాస్తులను ఎటూ తేల్చకుండా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఇప్పుడు మళ్లీ ఇళ్లు, నిర్మాణాల క్రమబద్ధీకరణ చేపడితే.. ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోననే చర్చ జరుగుతోంది. ప్రజల్లో వ్యతిరేకత రాకుండా క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయడానికి, అదే సమయంలో ఆదాయం సమకూర్చుకోవడానికి గల అవకాశాలపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించనున్నట్టు తెలిసింది.

## క్లుప్తంగా...

### ద్రోహులకు దేశభక్తే ఆఖరి రక్ష

**బీజేపీ మద్దతుదారులకు కేటీఆర్ పంచ్**



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, వారి మద్దతుదారులపై ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు తనదైన శైలిలో పరోక్ష విమర్శలు చేశారు. అదానీ కుంభకోణం, హిండెన్‌బర్గ్ నివేదికల నేపథ్యంలో బిలియనీర్ జార్జ్ సోరోస్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ చేస్తున్న విమర్శలపై కేటీఆర్ ట్విట్టర్ వేదికగా పంచులు విసిరారు. 'అదానీ కుంభకోణం గురించి, హిండెన్‌బర్గ్ నివేదిక గురించి కనీస ప్రస్తావన చేసే దమ్ము లేదు కానీ, బిలియనీర్ జార్జ్ సోరోస్ వ్యాఖ్యలు చేయగానే.. వారి గురువును కాపాడుకునేందుకు చాలా ఆతృత కనబరుస్తున్నారు. వాళ్లది ఎంత దౌర్భాగ్యం..! వాళ్లు ఎంత బుద్ధి తక్కువ మనుషులు..!' అని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ కామెంట్స్‌కు అనుబంధంగా.. 'ఈ వ్యాఖ్యలు ఎవరి గురించో చెప్పుకోండి..?' అంటూ 'పేట్రియాటిజమ్ ఈజ్ ద లాస్ట్ రెఫ్యూజీ ఆఫ్ ద స్కౌండ్రల్ (ద్రోహులకు దేశభక్తే ఆఖరి రక్ష)' అనే శామ్యూల్ జాక్సన్ సూక్తిని జతచేశారు.

### మెదక్ ఘటనపై సిట్ ఏర్పాటు చేయాలి

**మాజీ మంత్రి షబ్బీర్ అలీ**

సాక్షి, హైదరాబాద్: మెదక్ పోలీసుల దెబ్బలకు తాళలేక మృతి చెందాడని అనుమానిస్తోన్న ఖదీర్ కేసు విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. ఈ కేసుతో సంబంధముందని భావిస్తున్న పోలీసులపై హత్య కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని, మృతుని కుటుంబానికి రూ.50లక్షల పరిహారాన్ని చెల్లించాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ విషయంలో హోం మంత్రి మహమూద్ అలీ ఎందుకు నోరెత్తడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఖదీర్‌ది కస్టోడియల్ మృతి అని ఎందుకు నిర్ధారించడం లేదని, కేసీఆర్ పాలనలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు.

### ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డికి జాతీయ మహిళా కమిషన్ నోటీసులు

**గవర్నర్ వ్యాఖ్యల నేపథ్యంలో విచారణకు ఆదేశం**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి జాతీయ మహిళా కమిషన్ ఈనెల 14న నోటీసులు పంపింది. ఈనెల 21న ఉదయం 11.30 గంటలకు జరగనున్న విచారణకు స్వయంగా హాజరు కావాలని నోటీసులో పేర్కొంది. సుమోటోగా ఈ ఘటనపై చర్యలు చేపట్టింది. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఇటీవల నిర్వహించిన ఓ కార్యక్రమంలో కౌశిక్‌రెడ్డి గవర్నర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా తన సీటు కింద పెట్టుకుని కూర్చుంటారా? ఇదేనా రాజ్యాంగం? అని వ్యాఖ్యలు చేశారు.

### ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు

**మాజీ ఎంపీ, సీపీఐ నేత అజీజ్ పాషా**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎప్పుడైనా ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని...15 రోజుల నుంచి 2 నెలల లోపు ఎప్పుడైనా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రభుత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉందని సీపీఐ పార్టీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్ పాషా వ్యాఖ్యలు చేశారు. అప్పటిలోగా ముస్లింలు తమ సమస్యల పరిష్కారానికి పెద్దఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ అబిడ్స్‌లో ఆదివారం అఖిల భారత ముస్లిం మైనారిటీ ఆర్గనైజేషన్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతం అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో 75 వేల ఎకరాలు ఉన్న వక్ఫ్ భూములలో 80% ఆక్రమణకు గురైయ్యాయని తెలిపారు. హిందువులకు ఉన్న ఎండోమెంట్ తరహాలో ...వక్ఫ్ బోర్డును కమిషనరేట్ చేసి జ్యుడిషియల్ పవర్స్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మధ్యతరగతి లుక్ ఈస్ట్

## సొంతిళ్ల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీలోని ఈస్ట్‌జోన్‌వైపే మొగ్గు

- వెస్ట్‌జోన్ కంటే భూముల ధరలు తక్కువగా ఉండటం వల్లే..
- ప్రయాణ సదుపాయాలు, ఐటీ సహా వివిధ సంస్థలు ఉండటం కూడా కారణం
- భవిష్యత్తులో ఇంకా డిమాండ్ పెరుగుతుందనే అంచనాలు
- ఏడాదిలో జీహెచ్ఎంసీ అనుమతినిచ్చిన నివాస గృహాలు ఈ జోన్‌లోనే అత్యధికం

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరంలో ఎప్పటినుంచో వెస్ట్‌జోన్‌కే ఎంతో డిమాండ్ ఉంది. పలు ఐటీ సంస్థలతోపాటు అక్కడి సదుపాయాల వల్ల ప్రజలు అటువైపే స్థిరనివాసాలకు మొగ్గుచూపేవారు. అయితే గత రెండేళ్లుగా మధ్యతరగతి ప్రజలు ఈస్ట్ జోన్‌లో ఇళ్లు కట్టుకొనేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఈ జోన్‌కు దగ్గర్లో పలు ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నందున పిల్లల చదువుల కోసం నగరానికి వచ్చేవారు, దాదాపు రెండు గంటల ప్రయాణ సమయం పట్టే ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు, ఈస్ట్‌జోన్‌లోని సంస్థల్లో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులు ఇక్కడ స్థిరనివాసం ఏర్పరచుకుంటున్నారు. ఏడాదికాలంలో జీహెచ్ఎంసీ జారీ చేసిన భవన నిర్మాణ అనుమతులు సైతం ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. వెస్ట్‌జోన్‌తో పోలిస్తే భూముల ధరలు తక్కువ ఉండటమే ప్రధాన కారణం. అలాగే ఇటీవల పలు ఫ్లైఓవర్లు అందుబాటులోకి రావడంతోపాటు యాదాద్రి, వరంగల్, నల్లగొండ, విజయవాడలకు వెళ్లే హైవేలు, మెట్రో సదుపాయం ఉండటంతో నివాస గృహాలకు ఎక్కువ మంది ఈ ప్రాంతాన్ని ఎంచుకుంటున్నారు. మున్సిపల్ మంత్రి కేటీఆర్ లుక్ ఈస్ట్.. నినాదం కూడా పలువురిని ఆకట్టుకుంటోంది. ఏడాది కాలంలో జీహెచ్ఎంసీలోని 30 సర్కిళ్లలో 11 వేల భవన నిర్మాణాలకు అనుమతులివ్వగా ఈస్ట్‌జోన్‌లోని హయత్‌నగర్ సర్కిల్‌లోనే అత్యధికంగా 1,722 ఉన్నాయి. ఈ జోన్‌లోని ఉప్పల్, కాప్రా సర్కిళ్లలో అత్యధిక భవనాలకు అనుమతులిచ్చారు. ఐదంతస్తుల వరకు నివాస భవనాల్లోనూ దాదాపు 2 వేల భవనాలకు అనుమతులివ్వగా ఈస్ట్ జోన్‌లోనే అత్యధికంగా 600 వరకు ఉన్నాయి.



**వెస్ట్, ఈస్ట్ జోన్లలో ధరల వ్యత్యాసమిలా..** రిజిస్ట్రేషన్ శాఖ ధరల మేరకు వెస్ట్‌జోన్‌లో భూముల ధరలు చదరపు గజానికి రూ. 19 వేల నుంచి రూ. 45 వేల వరకు ఉండగా ఈస్ట్‌జోన్‌లో రూ. 7 వేల నుంచి రూ. 33 వేల వరకు ఉన్నాయి.

| ఉదాహరణకు వెస్ట్‌జోన్‌లో.. | | ఈస్ట్‌జోన్‌లో.. | |
|---|---|---|---|
| చందానగర్ విలేజ్ | : రూ. 19,000 | హయత్‌నగర్ ఖల్సా | : రూ. 7,100 |
| కొండాపూర్ | : రూ. 26,700 | సాగర్ ఎన్‌క్లేవ్ ఇన్‌సైడ్ | : రూ.16,200 |
| బొటానికల్ గార్డెన్-ఓల్డ్ బాంబే రోడ్ | : రూ. 44,900 | బైరామల్‌గూడ క్రాస్‌రోడ్ | : రూ. 32,200 |
| మదీనాగూడ ఎన్‌హెచ్ రోడ్ | : రూ. 44,900 | ఎన్ హెచ్9-విజయవాడ | : రూ. 27,600 |
| నానక్‌రామ్‌గూడ దగ్గర్లో | : రూ. 44,900 | హుడా కాలనీ | : రూ. 24,700 |

నోట్: ఇవి ప్రభుత్వ ధరలు కాగా, బహిరంగ మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి 3-4 రెట్లు ఎక్కువగా పలుకుతుండటం తెలిసిందే.

గత సంవత్సరం జనవరి నుంచి డిసెంబర్ వరకు 600 చదరపు గజాల్లోపు స్థలంలో సర్కిల్ స్థాయిలో గ్రౌండ్+2 అంతస్తుల వరకు జీహెచ్ఎంసీ జారీ చేసిన భవన నిర్మాణ అనుమతులు ఈస్ట్, వెస్ట్ జోన్లలో ఇలా ఉన్నాయి...

| ఈస్ట్ జోన్‌లో.. | | వెస్ట్ జోన్‌లో.. | |
|---|---|---|---|
| హయత్‌నగర్ | 1,722 | శేరిలింగంపల్లి | 338 |
| కాప్రా | 1,444 | చందానగర్ | 229 |
| ఉప్పల్ | 371 | ఆర్‌సీ పురం, పటాన్‌చెరు | 378 |
| ఎల్బీనగర్ | 511 | యూసుఫ్‌గూడ | 37 |
| సరూర్‌నగర్ | 300 | | |
| మొత్తం | 4,348 | మొత్తం | 982 |

**జోనల్ స్థాయిలో అనుమతి పొందిన భవనాలు**
(గ్రౌండ్+ 3 నుంచి 5 అంతస్తుల వరకు) జోన్లవారీగా..

| జోన్ | భవనాలు |
|---|---|
| ఎల్బీనగర్ | 595 |
| కూకట్‌పల్లి | 487 |
| శేరిలింగంపల్లి | 474 |
| ఖైరతాబాద్ | 234 |
| సికింద్రాబాద్ | 152 |
| చార్మినార్ | 132 |
| మొత్తం | 2,074 |



**అన్ని వైపులా సదుపాయాలు..**
ఒకేవైపు అభివృద్ధి వల్ల ఆ ప్రాంతంపై ఒత్తిడి పెరుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నగరం నలువైపులా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. తూర్పు, పశ్చిమ జోన్లే కాదు.. పాత బస్తీ ఉన్న సౌత్‌జోన్‌లోనూ అన్ని సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది.
– జీహెచ్‌ఎంసీ అధికారి

**అందుబాటులో ధరలు..**
ఈస్ట్‌జోన్‌లో భూముల ధరలు మధ్యతరగతి వారికి అందుబాటులో ఉన్నాయి. హైక్లాస్ భవనాలైనా ఎస్ఎఫ్‌టీకి రూ. 5వేల లోపే లభిస్తున్నాయి.
– శ్రీనివాస్‌రెడ్డి, బిల్డర్, ఉప్పల్

**సదుపాయాలు బాగున్నాయి**
ఇళ్లు నివాసయోగ్యంగా ఉండటంతోపాటు ఇక్కడి నుంచి ఏ ప్రాంతంవైపు వెళ్లాలన్నా సౌకర్యాలు బాగుండటంతో ఇటీవలే ఇల్లు కట్టుకున్నాం.
– బాలచందర్, ఉప్పల్

**రవాణా సౌకర్యాలున్నాయి**
ఎల్బీనగర్ ప్రాంతం తెలంగాణలోని పలు జిల్లాలతోపాటు ఏపీవాసులకు ముఖద్వారంగా ఉంది. మెట్రో అనుసంధానంతోపాటు ఫ్లైఓవర్ల వల్ల ట్రాఫిక్ సమస్యల్లేవు. రాబోయే రోజుల్లో ఎల్బీనగర్ మరో గచ్చిబౌలిలా మారొచ్చు.
– స్వప్నారెడ్డి, గృహిణి, సహారా ఎస్టేట్స్ కాలనీ, మన్సూరాబాద్



శంకర్‌మఠ్ మార్కెట్ రోడ్డులోని నాలా పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

# హైదరాబాద్ అంటే హైటెక్ సిటీయే కాదు

- నగరంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలి
- బడ్జెట్‌లో నగరాభివృద్ధికి రూ. 30 కోట్లే కేటాయించడం దురదృష్టకరం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు... నల్లకుంటలో నాలా పనుల పరిశీలన

నల్లకుంట (హైదరాబాద్): ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ రోడ్లు, బంగళాలను చూపించి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశామనుకోవడం సరికాదని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి చురకలు అంటించారు. హైదరాబాద్ అంటే హైటెక్ సిటీ ఒక్కటే కాదని, అంబర్‌పేట, గోలీపుర, పాతబస్తీ, సికింద్రాబాద్ లాంటి ప్రాంతాల్లోని బస్తీలన్నీ కలిస్తేనే హైదరాబాద్ అన్నారు. జీహెచ్ఎంసీకి సరిపడా నిధులు కేటాయించి హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ, జలమండలిలో నిధుల లేమితో బస్తీల్లో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని ఆయన ఆరోపించారు. నల్లకుంట శంకర్‌మఠ్ మార్కెట్ రోడ్డులో కొంతకాలంగా జరుగుతున్న అండర్‌గ్రౌండ్ బాక్స్ నాలా నిర్మాణ పనులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు.

**నగరం నుంచి ప్రభుత్వం భారీ ఆదాయం పొందుతున్నా...**

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో మూడో వంతు జనాభా హైదరాబాద్‌లోనే ఉందని చెప్పారు. నగరం నుంచి ప్రభుత్వానికి రూ. కోట్లలో ఆదాయం వస్తున్నప్పటికీ తాజా బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి కేవలం రూ. 30 కోట్లే కేటాయించడం దురదృష్టకరమన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి నగరాభివృద్ధికి నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు.

**నాలా పనులు వేగవంతం చేయాలి...**

పాత నల్లకుంట రామాలయం వీధి, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా మీదుగా హుస్సేన్ సాగర్ నాలాకు అనుసంధానిస్తూ గతంలో నిర్మించిన అండర్‌గ్రౌండ్ నాలా ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో 7–8 ఏళ్లుగా వర్షాకాలంలో ఆయా ప్రాంతాలు వరద ముంపునకు గురవుతున్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న ఆ సమయంలో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యామ్నాయంగా ప్రధాన రహదారి గుండా అండర్‌గ్రౌండ్ నాలా నిర్మించాలని జీహెచ్ఎంసీకి సూచించానన్నారు. మార్కెట్ రోడ్డులో కొనసాగుతున్న నాలా పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు జీహెచ్ఎంసీ నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. చిన్న కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ. 1,200 కోట్లు పెండింగ్‌లో ఉండటం దురదృష్టకరమన్నారు. కాగా, కేంద్ర మంత్రి పర్యటనపై బీజేపీ నేతలు తమకు కనీస సమాచారం ఇవ్వలేదని.. ఇచ్చి ఉంటే సమస్యలు చెప్పుకొనే వాళ్లమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.

# మజ్లిస్‌ను తరిమికొడతాం.. రామరాజ్యాన్ని స్థాపిస్తాం

- పాతబస్తీ మనదే... తెలంగాణ మనదే
- బరాబర్ సెక్రటేరియట్ డోమ్‌లను కూల్చి వేస్తాం
- కార్వాన్ శోభాయాత్ర సభలో బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



శోభాయాత్రలో ఖడ్గం చూపిస్తున్న బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్/జియాగూడ: తెలంగాణలో మజ్లిస్‌ను తరిమికొడతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భాగ్యనగర్ ప్రజలంతా ఈ మేరకు పోరాడాలని పిలుపునిచ్చారు. 15 నిమిషాల టైమిస్తే హిందువులను నరికి చంపుతామంటే ఊరుకుందామా? వీపంతా సాఫ్ చేయాలని వ్యాఖ్యానించారు. రాబోయే 8 నెలలపాటు ఉద్యోగాలను, వ్యాపారాలను పక్కనపెట్టి యువకులంతా కష్టపడితే తెలంగాణలో రామ రాజ్యాన్ని తీసుకొచ్చే బాధ్యత బీజేపీ తీసుకుంటుందని చెప్పారు. ఒవైసీ కళ్లల్లో ఆనందం చూసేందుకు.. కలశం, మామిడితోరణాలతో తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా ఉన్న సచివాలయాన్ని కూల్చేసి కొత్త భవనం పేరుతో డోమ్‌లను నిర్మించారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే సచివాలయ డోమ్‌లను కూల్చి తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా మార్పులు చేస్తామని ప్రకటించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం కార్వాన్‌లో శివాజీ మహారాజ్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభా యాత్రలో బండి సంజయ్ మాట్లాడారు. 'భాగ్యనగర్ యువకులారా.... హిందువుల దమ్మేందో చూపించే రోజు వచ్చింది. 12 శాతం ఓట్లున్న పార్టీ తెలంగాణలో 7 సీట్లు గెలిస్తే... మరి 80% ఓట్లున్న వాళ్లు ఎన్ని సీట్లు గెలవాలి?' అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ఔరంగజేబు ఆస్థానంలోని రాజా మాన్ సింగ్ టైపని విమర్శించారు.

**మజ్లిస్ పార్టీ 119 స్థానాల్లోనూ పోటీ చేయాలి**

నువ్వు మొగోడివైతే.. తెలంగాణలో 119 స్థానాల్లో పోటీ చేయ్... నీకు డిపాజిట్లు రాకుండా చేస్తానని మజ్లిస్ పార్టీ నేతలను ఉద్దేశించి బండి సంజయ్ సవాల్ విసిరారు. పాతబస్తీకి రావాలంటే నా పర్మిషన్ తీసుకోవాలంటూ ఒవైసీ సవాల్ చేస్తే అన్నీ మూసుకుని ఫాంహౌజ్‌లో పడుకున్న వ్యక్తి కేసీఆర్ అని ఎద్దేవా చేశారు.

**అలాగైతే బొట్టు కూడా పెట్టుకోలేం**

'హిందూ దేవుళ్లను, సనాతన ధర్మాన్ని విమర్శిస్తుంటే ఊరుకుందామా? కుహనా శక్తులు రెచ్చిపోతుంటే మౌనంగా ఉందామా? ఇట్లానే ఉంటే మీరు బొట్టు కూడా పెట్టుకోలేరు. గొల్లకొండ (గోల్కొండ) కోటపై కాషాయ జెండాను రెపరెపలాడిద్దాం.. శివాజీ స్ఫూర్తితో తెలంగాణలో హిందువుల దమ్మేందో చూపిద్దాం' అని బండి పిలుపు నిచ్చారు.

# తారకరత్నకు ప్రముఖుల నివాళి





తారకరత్నకు నివాళులర్పిస్తున్న విజయ సాయిరెడ్డి, బాలకృష్ణ, చంద్రబాబు



విషణ్ణవదనంతో జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్

శంకర్‌పల్లి: సినీ నటుడు నందమూరి తారకరత్నకు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తారకరత్న శనివారం రాత్రి తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. కాగా ఆయన పార్థివదేహాన్ని ఆదివారం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామంలోని స్వగృహానికి తరలించారు. ఉదయం 8 గంటలకు మోకిలకు చేరుకోగానే బాబాయ్ బాలకృష్ణ ఇతర కుటుంబ సభ్యులు, అభిమానులు బోరున విలపించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ దంపతులు, వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, సినీ నటులు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్, మోహన్‌బాబు, రాజేంద్రప్రసాద్, మురళీమోహన్, అలీ, శ్రీకాంత్, జీవిత రాజశేఖర్ దంపతులు, శివబాలాజీ, తనీశ్, రవిబాబు, దర్శకుడు రాఘవేంద్రరావు, నిర్మాత అశ్వనీదత్, ఏపీకి చెందిన రాజకీయ నేతలు కొడాలి నాని, దేవినేని ఉమ,, పరిటాల సునీత, ఆమె తనయుడు పరిటాల శ్రీరామ్ తదితరులు తారకరత్న భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. టీటీడీపీ నేతలు కాసాని జ్ఞానేశ్వర్, కంభంపాటి రామ్మోహన్‌రావు, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, కేఎస్.రత్నం వైఎస్సార్‌టీపీ అధినేత వైఎస్ షర్మిల తదితరులు కూడా నివాళులర్పించారు. తారకరత్న సతీమణి అలేఖ్య రెడ్డికి సమీప బంధువు అయిన ఎంపీ విజయసాయిరెడ్డి ఉదయం నుంచి అక్కడే ఉండి ఏర్పాట్లను పరిశీలించారు.

**తారకరత్న మృతికి ప్రధాని మోదీ సంతాపం**

సాక్షి, న్యూఢిల్లీ: తారకరత్న అకాల మరణం పట్ల ప్రధాని మోదీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ''నందమూరి తారకరత్న అకాల మృతి బాధాకరం. సినిమా, వినోద ప్రపంచంలో తనకంటూ ఒక ముద్ర వేసుకున్నారు. ఈ విషాద సమయంలో నా ఆలోచనలు తారకరత్న కుటుంబసభ్యులు, అభిమానులతో ఉన్నాయి. ఓంశాంతి'' అని ప్రధాని మోదీ ఆదివారం ట్వీట్ చేశారు.

# మీకెందుకు ఓటెయ్యాలి..?

▶ మొదటి పేజీ తరువాయి

అడిగే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. అభ్యర్థులు ఎక్కడికెళ్లినా.. ఓటెందుకు వేయాలని, సమస్యలు ఏం పరిష్కరించారని నిలదీస్తున్న పరిస్థితి ఎదురవుతోందని ఉపాధ్యాయ సంఘాల నేతలు చెప్తున్నారు. దీనికి తగిన సమాధానం చెప్పలేని పరిస్థితి ఉందంటున్నారు. టీచర్ల అసంతృప్తికి ప్రభుత్వ నిర్ణయాలే కారణమని వివరించేందుకు అనుకూల సంఘాలు ముందుకురాని పరిస్థితి.

**సంఘాల నేతలతో కలసి వెళ్తే..**

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి దిగిన అభ్యర్థులను ఏదో ఒక సంఘం బలపరుస్తోంది. వారి మద్దతుతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు వెళ్లాల్సి వస్తోంది. ఏళ్ల తరబడి బదిలీలు, పదోన్నతులు జరగలేదు. ఎన్నికల ముందు షెడ్యూల్ ఇచ్చినా రోజుకో వివాదం వెంటాడుతోంది. వేసవి సెలవుల వరకు ఈ ప్రక్రియ ముందుకు సాగేట్టు కన్పించడం లేదు. కొంతమందిని రాజకీయ పైరవీలతో బదిలీలు చేశారు. ఏ ఉపాధ్యాయ సంఘం కూడా ఈ పైరవీ బదిలీలను వ్యతిరేకించిన దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో సంఘాల నేతలపై టీచర్లు ఆగ్రహంతో ఉన్నారు. మరోవైపు కోర్టు వివాదాల నేపథ్యంలో బదిలీలు, పదోన్నతులకు నోచుకోని భాషా పండితుల్లో సంఘాల పట్ల తీవ్ర అసంతృప్తి ఉంది. స్పౌజ్‌లు, నాన్-స్పౌజ్, 317 జీవో ద్వారా బదిలీ అయిన టీచర్లు సంఘాల నేతలను నిలదీసేందుకు ఇదే అవకాశంగా భావిస్తున్నారు.

**రకరకాల హామీలు ఇస్తున్నా..**

పోటీ తీవ్రత ఎక్కువగా ఉండటంతో టీచర్ ఓటర్లను ఆకట్టుకోవడానికి అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల నాటికే బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ తెప్పించిన ఘనత తమదేనని ప్రభుత్వ సానుకూల టీచర్ సంఘాలు చెప్తున్నాయి. తాము మద్దతిస్తున్న అభ్యర్థులను గెలిపిస్తే ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తమదని అంటున్నాయి. ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ రావడానికి తమ పోరాటాలే కారణమని, సమస్య పరిష్కారంలో తామే ముందుంటున్నామని మరికొన్ని సంఘాలు ఓటర్లకు వివరిస్తున్నాయి. స్వతంత్రంగా పోటీ చేస్తున్న అభ్యర్థులు మాత్రం.. ప్రభుత్వంపై, సంఘాలపై టీచర్లలో నెలకొన్న అసంతృప్తి తమకు కలసివస్తుందని భావిస్తున్నారు.

**పోటీ ఎక్కువగానే..**

'మహబూబ్‌నగర్- హైదరాబాద్ - రంగారెడ్డి 'టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో 29,501 ఓట్లు ఉన్నాయి. ఇందులో 15,425 పురుష, 14,074 మహిళా టీచర్లు ఉన్నారు. ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ మొదలైంది. సోమవారం నుంచి పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలువురి పేర్లను ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించాయి. టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థిగా పాపన్నగారి మాణిక్ డ్డి, పీఆర్టీయూ టీఎస్ నుంచి గుర్రం చెన్నకేశవరెడ్డి, ఎస్టీయూ టీఎస్ నుంచి బి.భుజంగరావు, పీఆర్టీయూ తెలంగాణ నుంచి కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, టీపీటీఎఫ్ నుంచి వినయబాబు, బీజేపీ మద్దతులో ఏవీఎన్ రెడ్డి, జీటీఏ నుంచి కాసం ప్రభాకర్, ఎల్బీ జీటీఏ నుంచి ఎస్.రవీందర్, బీసీటీఏ నుంచి విజయకుమార్, టీయూటీఎఫ్ నుంచి మల్లారెడ్డి పోటీ చేస్తున్నారు. సాంకేతిక విద్యా సంస్థల్లోని అధ్యాపక ఓట్లనే నమ్ముకుని బరిలోకి దిగిన స్వతంత్ర అభ్యర్థిగా అయినేని సంతోష్ కుమార్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ మద్దతుతో గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి బరిలోకి దిగుతున్నా.. సమర్థించే సంఘాలు కన్పించడం లేదు.

# ఉమ్మడి ఖమ్మంలో పాగా వేద్దాం!

▶ మొదటి పేజీ తరువాయి

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా గత తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రచారం చేయాలని, ఇందుకోసం వచ్చే పదిహేను రోజుల్లో నియోజకవర్గాలవారీగా సమావేశాలు నిర్వహించాలని తీర్మానించింది. ఈ మేరకు ఆదివారం రాత్రి ఖమ్మంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంత్రి పువ్వాడ, ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఇటీవల ఉమ్మడి జిల్లాలో చేసిన పర్యటన, ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. త్వరలోనే ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల సదస్సు నిర్వహించాలని.. మాజీ ఎంపీ పొంగులేటి వెంట కేడర్ వెళ్లకుండా బ్రేక్ వేయాలనే అంశాలపైనా చర్చించినట్టు తెలిసింది.

**సీఎం హామీలు ప్రచారం చేసేలా..**


సీఎం కేసీఆర్ గతనెల 12న భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో నూతన కలెక్టరేట్, పార్టీ జిల్లా కార్యాలయాలను ప్రారంభించారు. పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీలకు రూ.40 కోట్ల చొప్పున, మణుగూరు, ఇల్లెందు మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున, 481 గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున నిధులు ఇస్తున్నట్టు ప్రకటించారు. ఇక గత నెల 18న ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ తొలి బహిరంగ సభలో.. ఖమ్మం కార్పొరేషన్‌కు రూ.50 కోట్లు, సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీలకు రూ.30 కోట్ల చొప్పున, తల్లాడ, కల్లూరు, నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీలకు రూ.10 కోట్ల చొప్పున.. 589 పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున నిధులు ఇస్తున్నట్టు కేసీఆర్ ప్రకటించారు. ఖమ్మంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నియోజకవర్గవ్యాప్తంగా 15 రోజుల పాటు విస్తృతంగా పర్యటించాలని సమావేశంలో నిర్ణయించారు.

**నేతలంతా కలిసి ముందుకు..**

బీఆర్ఎస్ ఆవిర్భావ సభ విజయవంతం నేపథ్యంలో ఈ ఊపును కొనసాగించి అన్ని నియోజకవర్గాల్లో పాగా వేయాలని పార్టీ ఉమ్మడి జిల్లా నాయకత్వం భావిస్తోంది. అన్ని నియోజకవర్గాల్లో గత తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి, సీఎం ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలు చర్చించినట్టు తెలిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ ఎమ్మెల్యేలు, నేతలంతా నియోజకవర్గాల్లో కలిసి తిరగాలని తీర్మానించినట్టు సమాచారం.

**కేడర్ కారు దిగకుండా..**

బీఆర్ఎస్‌లో ప్రాధాన్యత లభించడం లేదన్న అసంతృప్తిలో ఉన్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల తిరుగుబావుటా ఎగురవేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి.. పార్టీపై, సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేశారు. పొంగులేటి బాటలో నడిచిన వైరా మున్సిపల్ చైర్మన్ సుతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మరికొందరు నేతలపై బీఆర్ఎస్ వేటు వేసింది. ఈ నేపథ్యంలో మిగతా నియోజకవర్గాల్లో కూడా పొంగులేటి వెంట వెళ్లిన నేతలపై చర్యలు తీసుకోవాలని తాజా సమావేశంలో తీర్మానించినట్టు సమాచారం. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మండలాల వారీగా ముఖ్య నేతలతో టచ్‌లో ఉండి నిత్యం పార్టీ కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇక ఇల్లెందు మున్సిపాలిటీలో అవిశ్వాసం, మరికొన్ని స్థానిక అంశాలు ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. ఈ భేటీలో ఖమ్మం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోతు హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, కందాల ఉపేందర్‌రెడ్డి, లావుడ్యా రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.



నాకు తెలిసినది ప్రతిదీ, నాకు ప్రేమ వల్లే తెలిసింది.
- లియో టాల్‌స్టాయ్



సాక్షి

సోమవారం, ఫిబ్రవరి, 20

# భాషలను కాపాడుకోవాలి

'భాష మన ఆలోచనలకు వాహకం మాత్రమే కాదు, మన ఆలోచనా సరళికి దోహదపడే గొప్ప పరికరం కూడా' అన్నాడు బ్రిటిష్ ఆవిష్కర్త హంఫ్రీ డేవీ. ప్రస్తుత ప్రపంచంలో దాదాపు ఐదువేలకు పైగా భాషలు వాడుకలో ఉన్నాయి. వాటిలో మూడోవంతు కేవలం ఆఫ్రికా ఖండంలోనే మనుగడలో ఉన్నాయి. తాజా అంచనాల ప్రకారం ప్రపంచంలో దాదాపు మూడువేలకు పైగా భాషలు అంతరించిపోయే పరిస్థితుల్లో ఉన్నాయి. మన దేశంలోనే 192 భాషలు కొన ఊపిరితో కొనసాగుతున్నాయి.

ప్రపంచంలోనే అత్యధిక భాషలు వాడుకలో ఉన్న దేశాల్లో మన దేశానిది రెండో స్థానం. మన దేశంలో ఇప్పుడు 780 భాషలు మనుగడలో ఉన్నాయి. పాపువా న్యూగినీ విస్తీర్ణంలోను, జనాభాలోను చిన్న దేశమే అయినా, అక్కడ ఏకంగా 840 భాషలు మనుగడలో ఉన్నాయి. మన రాజ్యాంగం ఇరవైరెండు భాషలను గుర్తించింది. ప్రస్తుత ప్రపంచంలో రకరకాల భాషా కుటుంబాలకు చెందిన భాషలు మనుగడలో ఉన్నాయి. వాటిలో కొన్ని బలంగా ఉనికి చాటుకోగలుగుతున్నాయి. ఇంకొన్ని, క్రమంగా మరుగునపడే స్థితికి చేరుకుంటున్నాయి. భాష పుట్టుక గురించిన కచ్చితమైన వాస్తవాలు చరిత్రలో నమోదు కాలేదు. సమూహాలు సమూహాలుగా విడిపోయిన భాషా కుటుంబాలన్నీ ఒకే మూలభాష నుంచి విడివడిపోయినవనీ, ఒక్కో భాషా కుటుంబం నుంచి వేర్వేరు భాషలు పుట్టాయనీ భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. అన్ని భాషలకు మూలమైన తొలి భాష ఎప్పుడు ఎలా పుట్టిందో, ఎప్పుడు ఎలా అంతరించిపోయిందో చెప్పడానికి సరైన ఆధారాల్లేవు. మానవ సమూహాలు మనుగడ కోసం నేల నలు చెరగులా విస్తరించిన క్రమంలో ఏర్పడిన వేర్వేరు భాషా కుటుంబాల నుంచి పుట్టుకొచ్చిన భాషల గురించిన సమాచారం మాత్రమే మనకు తెలుసు.

'తన సొంత భాషను ప్రేమించని వాడు జంతువు కన్నా, దుర్గంధం వెదజల్లే చేప కన్నా నీచమైన వాడు' అన్నాడు ఫిలిప్పీనో రచయిత జోస్ రిజాల్. పుట్టి పెరిగిన నేలను, తొలి పలుకులు నేర్పిన మాతృభాషను ప్రేమించని వాళ్లు అరుదు. మాతృభాషల మనుగడ కోసం ప్రజలు రాజకీయ ఉద్యమాలు, ఆందోళనలు సాగించిన సందర్భాలు ఉన్నాయి. బంగ్లాదేశ్ ఇదివరకు తూర్పు పాకిస్తాన్‌గా ఉన్నకాలంలో అక్కడి ప్రజలపై బలవంతంగా ఉర్దూను రుద్దే ప్రయత్నాలు జరిగాయి. మిగిలిన జనాల కంటే భాషాభిమానం కాస్త ఎక్కువ మోతాదులో ఉన్న బెంగాలీలు దీనికి వ్యతిరేకంగా తిరగబడ్డారు. తమ భాషకు గుర్తింపు కోసం పోరాటం సాగించారు. వారు తమ భాషకు గుర్తింపునే కాదు, స్వతంత్ర దేశాన్ని కూడా సాధించుకున్నారు. బెంగాలీలు తమ భాష కోసం పోరాటం ప్రారంభించిన ఫిబ్రవరి 21వ తేదీని 'యూనెస్కో' అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు మాట్లాడుకునే భాషలన్నింటి సంరక్షణ, పరిరక్షణలే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ ధ్యేయమని ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 2007 మే 16న ప్రకటించింది. భాషల సంరక్షణ, పరిరక్షణల బాధ్యతను ఐక్యరాజ్య సమితి నెరవేర్చలేదు. ఆ బాధ్యతను నెరవేర్చాల్సింది వివిధ దేశాల ప్రభుత్వాలే!

ఒక భాషలో మాట్లాడేవారు ఎవరూ లేనప్పుడు ఆ భాష అంతరించిపోతుంది. ఒక భాష అంతరిస్తే, ఆ భాషకు చెందిన సంస్కృతీ సాహిత్యాలు కూడా అంతరించిపోతాయి. వలస రాజ్యాలు మొదలైన తర్వాత ప్రపంచంలో చాలా భాషలే అంతరించిపోయాయి. 'ఒక జాతిని అంతమొందించాలంటే, ఆ జాతి మాట్లాడే భాషను అంతమొందించాలి' అనే నానుడి ఉంది. ఖండాంతరాలకు పాకి వలస రాజ్యాలను స్థాపించుకున్న పాలకులు చాలావరకు చేసిన పని ఇదే! ఇంగ్లిష్, ఫ్రెంచ్, స్పానిష్, డచ్, పోర్చుగీస్ తదితర యూరోపియన్ వలస రాజ్యాల్లో వందలాది స్థానిక భాషలు కనుమరుగైపోయాయి. వలస రాజ్యాల కాలంలో బలవంతులైన పాలకుల భాషలకు విపరీతంగా ప్రాబల్యం పెరిగింది. ఉపాధి కోసం పాలకుల భాషలను నేర్చుకోవడం జనాలకు అనివార్యంగా మారింది. తమ తమ మాతృభాషలను కాపాడుకోవడం పెను సవాలుగా మారింది. రెండు మూడు తరాలు గడిచే సరికి చాలా భాషలు కొడిగట్టిపోయాయి. ఉదాహరణకు చెప్పుకోవాలంటే, యూరోపియన్ వలస పాలకుల దెబ్బకు గడచిన నాలుగు శతాబ్దాల్లో కేవలం ఉత్తర అమెరికాలోనే దాదాపు రెండువందలకు పైగా స్థానిక భాషలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి.

ఒక భాష అంతరించిపోతే, ఆ భాషకు చెందిన సంస్కృతి అంతరించిపోతుంది. ఆ భాషలో నిక్షిప్తమైన జ్ఞానసంపద కనుమరుగైపోతుంది. ఒక్కొక్కసారి ఒక నాగరికత సైతం అంతరించిపోయే ప్రమాదం ఉంటుంది. అంతేకాదు, ఆ భాషా సంస్కృతులకు చరిత్రతో లంకె తెగి పోతుంది. ఒకటికి మించిన భాషలను నేర్చుకోవడం, ఒక భాష నుంచి మరొక భాషకు సాహితీ సంపదను ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా భాషలు చిరకాలం మనుగడ సాగించగలుగుతాయి. 'నా భాష పరిమితులంటే, నా ప్రపంచం పరిమితులే' అన్నాడు ఆస్ట్రియన్ తత్త్వవేత్త లుడ్విగ్ విట్గెన్‌స్టీన్. ఒకటికి మించిన భాషలు తెలిసి ఉన్నప్పుడు లేదా ఒకటికి మించిన భాషల్లోని సాహిత్యం మన భాషలోనే మనకు అందుబాటులో ఉండటం జరిగినప్పుడు మన పరిమితులు తొలగి, మన ప్రపంచం మరింతగా విస్తరిస్తుంది. బహుశా ఇందుకే కాబోలు 'ఇంకో భాష తెలిసి ఉండటమంటే, రెండో ఆత్మను కలిగి ఉండటమే' అన్నాడు రోమన్ చక్రవర్తి షాలమేన్. మనం మన చరిత్రను కాపాడుకోవాలంటే, మన భాషలను కాపాడుకోవడమే మార్గం.

# ఏ విధిరాత వైపు పయనిస్తున్నాం?

కామెంట్



కరణ్ థాపర్

**భారత చరిత్రపై తాజాగా వచ్చిన 'ఎ న్యూ హిస్టరీ ఆఫ్ ఇండియా' ఆర్యన్ల మూలాల గురించి సరికొత్త వ్యాఖ్యానాన్ని అందజేసింది. ఆర్యన్లు భారత్ మూలాలను కలిగి ఉన్నారనే వాదనను ఖండిస్తూ, వీరు మధ్యాసియా నుంచి వచ్చినవారని చెబుతోంది. భారత ముస్లిం పాలకులందరూ మతమార్పిడి పట్ల ఉత్సుకత కలిగి ఉన్న ఉద్రేకపరులు అని విశ్వసించేందుకు ఎలాంటి ఆధారమూ లేదని తేల్చి చెబుతోంది. ఔరంగజేబును పవిత్ర ముస్లింగా పేర్కొంటూనే, అత్యధిక హిందువులను ఉన్నత పదవుల్లో నియమించడానికి అది అడ్డురాలేదని పేర్కొంటోంది. ప్రస్తుతం మెజారిటీ వర్గ ఆధిపత్యం దిశగా దేశం పయనిస్తోందని కూడా పుస్తకం అభిప్రాయపడింది.**

ఎట్టకేలకు, 450 కోట్ల సంవత్సరాల క్రితం భౌగోళిక కాలం ప్రారంభమైన నాటి నుంచి నేటి నరేంద్ర మోదీ వరకు భారత చరిత్రను ఒకే సంపుటిలో వివరించిన పుస్తకం ఇప్పుడు వచ్చింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, దీన్ని రాసిన ముగ్గురు రచయితలు– రుద్రాంక్షు ముఖర్జీ, శోభిత పంజా, టోబీ సిన్ క్లెయిర్– పుస్తకాన్ని 'ఎ న్యూ హిస్టరీ ఆఫ్ ఇండియా'(భారతదేశ కొత్త చరిత్ర) అని చెబుతున్నారు. వారు ఈ విశేషణం ఎందుకు ఉపయోగించారో నాకైతే తెలీదు కానీ ఈ పుస్తకంలోని విషయాలు, చేసిన వ్యాఖ్యలు నన్ను కట్టిపడేశాయి.

ఉదాహరణకు, ఇది మీకు తెలుసా? "హరప్పా నగరాల్లోని ఇళ్లు లేదా సమాధులు సంపద ఆడంబరానికి సంబంధించిన ఎలాంటి చిహ్నాలనూ ప్రదర్శించేవి కావు.... రాజమందిరం అని గుర్తించే ఎలాంటి భవనాలు లేవు... అలాగే ఈజిప్టు, చైనా, లేక మెసొపొటేమియాలో కనిపించినట్లు భారీ సమాధులు లేదా భవంతులు లేదా పాలకుల విగ్రహాలు కనబడవు." కాబట్టి ఇవి పాక్షిక సామ్యవాద గణతంత్రాలా?

ఆర్యుల గురించి రచయితలు ఇలా చెబుతారు. "మధ్య ఆసియా నుంచి ఉత్తర భారతానికి వలస వచ్చారు, స్థానిక ప్రజలతో కలిసిపోయారు, క్రమంగా వారిని తమలో కలుపుకున్నారు... మరోలా చెప్పాలంటే, ఆర్యన్లు ఉత్తర భారతదేశాన్ని ఆక్రమించలేదు, ద్రవిడియన్లను దక్షిణాభిముఖంగా తరమలేదు." ఇది కచ్చితంగా వివాదాస్పదమైంది. ఆర్యన్లు భారత్‌లోనే జన్మించినవాళ్లనే వాదనను ఇది ఖండిస్తుంది.

ఆర్య సంస్కృతికి సంబంధించి, ఈ పుస్తక రచయితలకు నిర్దిష్టమైన అభిప్రాయం ఉంది. "ఇది తరచుగా భారతీయ సంప్రదాయం, సమాజానికి సంబంధించినదిగా చూడబడుతోంది" అని నొక్కి చెబుతూనే, దాన్ని "కులీనమైనది, ఇంకా అనితరమైనది" అని వర్ణిస్తారు. "ఇది ఉత్తర భారత జనాభాలోని విస్తృతమైన వర్గాలను స్పష్టంగా విస్మరించింది. అలాగే భారత ద్వీపకల్పం (వింధ్యకు ఆవలి భూమి)లో నివసిస్తున్న మొత్తం జనాభాను దూరం పెట్టేసింది." పైగా "కులవ్యవస్థ పునాదులు" రుగ్వేద కాలంలోనే ఉన్నాయని వీరు చెబుతున్నారు. ఇది మోహన్ భాగవత్ అభిప్రాయానికి కచ్చితంగా భిన్నమైనదే.

ఇప్పుడు నన్ను ఔరంగజేబు వైపు దృష్టి మళ్లించనివ్వండి. ఆయనపై ఈ పుస్తక రచయితల అభిప్రాయం ప్రస్తుత మన కేంద్ర



ప్రభుత్వం కంటే ఆడ్రే ట్రూష్కే(అమెరికా చరిత్రకారిణి) అభిప్రాయాలకు దగ్గరగా ఉంటోంది. "ఔరంగజేబు పవిత్రమైన, పరి శుద్ధమైన ముస్లిం" అని వీరు పేర్కొంటున్నారు. "కానీ ఆయన మతోన్మాది కాదు" అంటున్నారు. దీనికి సాక్ష్యంగా, ఔరంగజేబు వ్యక్తిగత మత దృక్పథం అధిక సంఖ్యలో హిందూ మునసబుదార్లను నియమించకుండా ఆయనను అడ్డుకోలేదని వీరు పేర్కొంటున్నారు. "షాజహాన్ పాలనలో 1,000 జాత్(ర్యాంకు) లేదా అంతకు మించిన ర్యాంకు కలిగిన మునసబుదారుల్లో హిందువులు 22 శాతంగా ఉండేవారు. ఔరంగజేబు హయాంలో ఈ సంఖ్య 32 శాతానికి పెరిగింది."

విస్తృతమైన ముస్లిం పాలనలో అంటే 13వ శతాబ్ది నాటి సుల్తాన్‌ల నుంచి మొఘలుల అంతం వరకు చూస్తే ఈ కాలాన్ని 1,200 సంవత్సరాల బానిసత్వ సంవత్సరాలుగా పరిగణిస్తుంటారు. కానీ ఈ పుస్తకం మాత్రం దీనికి విరుద్ధమైన దృక్పథాన్ని కలిగి ఉంది. "ముస్లింలందరూ లేక ముస్లిం పాలకులందరూ మతమార్పిడి పట్ల ఉత్సుకత కలిగి ఉన్న ఇస్లామిక్ ఉద్రేకపరులు, ఉత్సాహవంతులు అని విశ్వసించేందుకు ఎలాంటి ఆధారమూ లేదు. ముస్లిం పాలకులు పెద్ద సంఖ్యలో ముస్లిమేతరులను ఉద్యోగాల్లో నియమించారు, వారికి అత్యున్నత పదవులను కూడా కట్టబెట్టారన్న వాస్తవాన్ని బట్టే ముస్లిం పాలకులందరూ మతమార్పిడి ఉన్మాదులు కారని తెలుస్తోంది" అని ఈ పుస్తకం తేల్చి చెబుతోంది.

ఇస్లాం పాలకుల హయాంలో కళలు, నిర్మాణ కళ, సంస్కృతి, మతం వంటి అంశాల్లో జరిగిన అభివృద్ధి గురించి పుస్తకం చర్చించింది. భక్తి సంప్రదాయం, సూఫీతత్వం మధ్య ఈ పుస్తకం గుర్తించిన లంకెలను చూసి నేను నిరుత్తరుడినయ్యాను. "ఇస్లాంతో సన్నిహిత సంబంధం, ఇస్లాం రాకముందు భారత్‌లో ఉనికిలో ఉన్న భక్తిరూపాల వల్ల భక్తి ఉద్యమం పురుడు పోసుకుందని చెబితే అది మరీ అతిశయోక్తి కాజాలదు... భక్తి మార్మిక సంప్రదాయాలు, సూఫిజం మధ్య గొప్ప అతివ్యాప్తి, కలయిక ఉంది."

ఈ పుస్తకంలోని అత్యంత ఆసక్తికరమైన విషయాలు కొన్ని దాని అపురూపమైన వివరాల్లో ఉన్నాయి. "వ్యభిచారులపై పన్ను విధించాలి" అని కౌటిల్యుడు విశ్వసించాడు. అది చాలా ప్రగతిశీలమైందని నేను చెబుతాను. "అశోకుడు తన సోదరులను చంపేశాడు. ఉన్న వారిలో మొత్తం 97 మందిని చంపేశాడు." అంటే కళింగులకు చాలా కాలం క్రితమే ఆయన ఈ చంపడంలో మునిగివున్నాడు. అలాగే సిపాయిల తిరుగుబాటు "1857 మే 10న అపరాహ్న వేళ... దాదాపు 5 గంటల సమయంలో" మొదలైంది. అయితే అది మీరట్ కంటోన్మెంట్‌లో సాయంత్రం తేనీటికి కచ్చితంగా అంతరాయం కలిగించివుంటుంది.

మన ప్రస్తుత ప్రధానికి సంబంధించి ఈ పుస్తకం రెండు అభిప్రాయాలను కలిగివుంది. "నరేంద్ర మోదీ తాను చేసిన అన్ని వాగ్దానాలను ఇంకా నెరవేర్చలేదు" అని చెబుతూనే, "ఆయన ఒక కొత్త విశ్వాసాన్ని, ఉల్లాసాన్ని తీసుకొచ్చారు" అని పొదుపుగా జోడించింది. అయితే ఆ తర్వాత, ఈ పుస్తకం "మోదీ నాయకత్వంలో మెజారిటీ వర్గ ఆధిపత్యం, మైనారిటీల పట్ల తీవ్ర అసహనం, అసమ్మతి వైపుగా ఒక సహజ ప్రవృత్తి బలపడిపోయింది. ఈ మెజారిటీ వైపు మలుపు మన సమాజాన్ని వేర్పాటుతత్వంతో విభజించివేసింది" అని అభిప్రాయపడింది.

చివరగా, ఈ పుస్తకం చివరి వాక్యాన్ని చాలా తెలివిగా, కాకపోతే జిత్తులమారితనంతో రూపొందించారు. "మార్పు, మథనానికి సంబంధించిన లోతైన, ప్రాథమిక ప్రవాహాలు భారత్‌ను ఒక కొత్త విధి రాత (ట్రిస్ట్ విత్ డెస్టినీ) వైపు లాగుతున్నాయి." ఒక విరుద్ధమైన ఫలితాన్ని ముందుచూపుతో సూచిస్తూ, నెహ్రూ సుప్రసిద్ధ వాక్యాన్ని ఇక్కడ చమత్కారంగా ఉపయోగించారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

## తప్పు పురుషులది



హిందు, ముస్లిం, సిక్కు... వివాహితులు, బాయ్‌ఫ్రెండ్, సహజీవనం... అందరూ ఒక ముఖ్య విషయం వదిలేస్తున్నారు. ఎందుకు అందరూ ఇంకో మతాన్నీ, జీవన పరిస్థితుల్నీ వేరేదానితో పోల్చి నిందిస్తున్నారు? ఇది చేస్తున్నది మగవాళ్లు! మంచాల కింద శరీరాలను దాయడం, ఫ్రిడ్జుల్లో శరీరాం గాల్ని దాయడం! అమ్మాయి కాదంటే వాళ్లకు కోపం వస్తోంది.

- హనా మొహిసిన్ ఖాన్, పైలట్

## మోసపు వాదనలు



అమెరికా ముఖ్య వైద్య సలహాదారు ఆంతోనీ ఫౌచీ మనతో ఎలా ఆడుకున్నాడు! కోవిడ్‌కు సహజమైన రోగనిరోధకత అనేది ఉండదని చెప్పాడు. మళ్లీ ఇప్పుడు వాళ్లు తమ కథనాన్ని మార్చుకుంటున్నారు. స్వప్రయోజనాల కోసం మాలాంటివాళ్ల నోళ్లు మూయిస్తూ వీళ్లంతా సైన్సును, నా పవిత్ర వైద్య రంగాన్ని ఎలా వికటింపజేశారో చూస్తే నిజంగా అసహ్యం పుడుతుంది.

- అఫ్షైన్ ఇమ్రానీ, కార్డియాలజిస్ట్

## చంపా రాజ్యం



వియత్నాంకు ప్రాచీన పేరు చంపా. వియత్నాంలో దొరికిన గుప్తుల పూర్వపు బ్రాహ్మీ లిపిలో రాసిన సంస్కృత శాసనంలో వియత్నాం రాజు మరుడికి సంబంధించిన ప్రస్తావన ఉంది. ఆగ్నేయాసియాలో దొరికిన అత్యంత ప్రాచీన సంస్కృత శాసనం ఇది.

- వేద్‌వీర్ ఆర్య, చరిత్రకారుడు

## గొప్ప పని



కర్ణాటకలోని బండిపూర్ టైగర్ రిజర్వు సమీపంలో ఒక ఆడ ఏనుగు విద్యుద్ఘాతానికి గురైంది. అటవీ అధికారులు, వెటెరినరీస్ దానికి చికిత్స ఇప్పించి, చివరకు తన కాళ్ల మీద నిలబడేలా చేశారు. అది అగ్నిపరీక్ష. ఇలాంటి గొప్ప పని చేసినందుకు మొత్తం బృందానికి హేట్సాఫ్.

- రమేశ్ పాండే, ఐఎఫ్ఎస్ అధికారి

## అదే ముఖ్యం



మనిషికి జీవితంలో ఉండాల్సిన నిజమైన సంపద, మనశ్శాంతి మాత్రమే. అదే నిజం.

- వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

## ఎప్పుడు మాట్లాడాలి?



ఇది సమయం కాదా? మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న హింస గురించి మాట్లాడటానికి? లేదా మనం దీన్ని వదిలేసి సాగిపోదామా, అది మన ఇంట్లోకి వచ్చేదాకా వేచిచూద్దామా?

- గుత్తా జ్వాలా, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

# ఒక తరం కీలక నేత

బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు అండదండలుగా నిలిచిన నిజమైన నాయకులలో నల్లగొండ జిల్లాకు చెందిన దివంగత చకిలం శ్రీనివాసరావు ముందు వరసలో నిలుస్తారు. సమితి ప్రెసిడెంట్‌గా, శాసన సభ్యుడిగా, లోక్‌సభ సభ్యుడిగా, డీసీసీబీ అధ్యక్షుడిగా పలు పదవులను చేపట్టిన చకిలంకు సర్దార్ అని బిరుదునిచ్చి ఇప్పటికీ అదే పేరుతో జిల్లా ప్రజలు గౌరవంగా గుర్తు చేసుకుంటున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దాదాపు 1970 దశకం నుండి ఆయన మరణించేంత వరకు మూడు దశాబ్దాలపాటు తిరుగులేని నాయకుడిగా జిల్లా రాజకీయాలన్నీ తన చుట్టే తిరిగేలా చేసుకున్న రాజకీయ దురంధరుడు చకిలం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వర్గాల పోరుకు నిదర్శనమైన కాంగ్రెస్ పార్టీ షరా మామూలుగానే నల్గొండలోను చకిలం వర్గం, చకిలం వ్యతిరేక వర్గాలుగా విడిపోయి ఉండేది. అదే సమయంలో జిల్లాలో అత్యంత బలంగా ఉన్న వామపక్షాలను ఎదుర్కొని, ఎన్నో ప్రతికూల పరిస్థితుల నడుమ జిల్లాలోని ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశారు. సహజంగానే ఇరు పార్టీల మధ్య ఉన్న సైద్ధాంతిక భేదాలు, సొంత పార్టీలో వ్యతిరేక వర్గం సహాయ నిరాకరణ నేపథ్యంలో కార్యకర్తలకు పెద్దగా నిలిచారు. జిల్లాలోని చిన్న కుగ్రామంలోనూ తన అభిమానులను సంపాయించుకున్న నాయకుడు చకిలం శ్రీనివాస రావు. వీరి అనంతరం ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ప్రజాదరణ పొందినవారు ఎవరూ లేరంటే అతిశయోక్తి కాదు.



చకిలం శ్రీనివాసరావు

తాను నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న రెండున్నర దశాబ్దాలలో వచ్చిన ప్రతీ ఎన్నికల్లో జిల్లాలో బలంగా ఉన్న అగ్ర వర్గాలను కాదని... జనరల్ స్థానాల్లో బలహీన వర్గాలకు చెందిన వారికి సీట్లు ఇచ్చిన ఏకైక నాయకుడు ఆయన. అందుకే, శ్రీనివాసరావు అనంతరం అంతటి దీటైన నాయకుడు ఇప్పటివరకు రాలేదని చెప్పవచ్చు. జిల్లా రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర వహించిన చకిలంకు కనీసం ఇల్లు కూడా లేకపోవడం ఆయన నిజాయితీకి అద్దం పడుతుంది.

1972లో నల్లగొండ నియోజకవర్గం నుండి, 1983లో మిర్యాలగూడ నుండి శాసన సభ్యుడిగా ఉన్నారు. 1989లో లోక్ సభకు నల్లగొండ నియోజకవర్గం నుండి పోటీ చేసి సీపీఐ అభ్యర్థి ధర్మ భిక్షంపై గెలుపొందారు. 1991 నుండి 1996 వరకు జిల్లా సెంట్రల్ బ్యాంకు చైర్మన్ గా ఉన్నారు. 1996 జూలై రెండవ తేదీన గుండెపోటుతో అకాల మరణం చెందారు. మృతి చెంది 25 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ పేద ప్రజల గుండెల్లో కొలువై ఉన్నారు చకిలం. ఆయనకు ఘన నివాళులు!

- కన్నెకంటి వెంకటరమణ
వ్యాసకర్త జాయింట్ డైరెక్టర్, తెలంగాణ సమాచార శాఖ
(నేడు చకిలం శ్రీనివాసరావు శత జయంతి)

# కొనుక్కోగలిగే గౌరవాలు

ఈ మధ్య కొన్ని జాతీయ, అంతర్జాతీయ 'సంస్థల' పేరుతో కొన్ని అవార్డులు ప్రదానం అవుతున్నాయి. యాభై వేల నుంచి ఐదు లక్షలు పెట్టుకోగలిగితే మీకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తారు. ఆ సర్టిఫికెట్‌ని మీ ఇంటి వద్దకే డెలివరీ చేసుకోవచ్చు. ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో ఉన్నాయని చెప్పుకొనే వందల 'విశ్వవిద్యాలయాలు' దేశంలో నకిలీ డాక్టర్ ఆఫ్ లిటరేచర్(డి.లిట్) సర్టిఫికేట్‌లను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ గ్రహీతలలో విద్యాశాఖ సీనియర్ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవా సంస్థలలో పనిచేసే వారు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు... తమ పేరు ముందు 'డాక్టర్'ను ఇష్టపడే చాలా మంది ఉన్నారు.

ఈ కల్పిత విశ్వవిద్యాలయాలు ప్రజలను ఆకర్షించడానికి పాఠశాలలు, కళాశాలలు, జిల్లా విద్యా, శిక్షణా సంస్థల కార్యాలయాలకు ఈమెయిల్స్ పంపి, స్వయంగా సంప్రదించి, గౌరవ డాక్టరేట్ల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించి, మరుసటి రోజు దానిని వివిధ పత్రికలలో ప్రచురితం చేస్తుంటాయి. ఈమధ్య కాలంలో స్థిర వ్యాపారాలలో ఖాతాదారులకు కుచ్చుటోపీ పెట్టిన వారికి, చిట్‌ఫండ్ కంపెనీలు పెట్టి డబ్బు ఇవ్వకుండా ఎగనామం పెట్టిన వారికి, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు పెట్టి బోర్డు తిప్పేసిన వారికి కూడా ఉత్తమ వ్యాపారవేత్తల అవార్డు ఇచ్చి సత్కరిస్తున్నారు. మరి కొన్ని నకిలీ విశ్వవిద్యాలయాలు, సంస్థలు బోధనలో ఉన్న ప్రొఫెసర్లకు సందేశాలు పంపుతుంటాయి. ప్లాట్‌ఫారమ్‌లో, రీసర్చ్ సైట్‌లో మీ పరిశోధనను గుర్తించాము; మీరు సమాజానికి అందించిన సహకారం కోసం మేము మీ కృషిని అభినందిస్తున్నాము; మీరు వెయ్యి డాలర్లు పంపితే మీకు ఆన్‌లైన్ ద్వారా ఒక మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తాం అంటాయి.



ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ సైంటిఫిక్ నెట్‌వర్క్ అవార్డ్స్ అనేది సరికొత్త అవార్డు సంస్థ. మీరు అవార్డుకు ఎంపికయ్యారని సూచిస్తూ వారు స్పామ్ మెయిల్‌లను పంపుతారు. తిరుచిరాపల్లి, హోసూర్, బీజాపూర్, గుల్బర్గా, బెల్గామ్, హుబ్లీ, ధార్వాడ్, మైసూర్ నగరాలలో కొన్ని స్టార్ హోటల్స్ అద్దెకు తీసుకుని వేడుకలు జరుపుతుంటారు. 120 అమెరికా డాలర్ల రుసుమును చెల్లించిన తర్వాత అవార్డును తీసుకోవచ్చు. ఇంటర్నేషనల్ రీసెర్చ్ రత్న అవార్డులు ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ రీసెర్చ్ అండర్ లిటరల్ యాక్సెస్ నుండి మీకు మీరే సైన్ అప్ చేసి, రుసుము చెల్లించడం ద్వారా పొందగలిగే మరొక అవార్డు. సంవత్సర ఉత్తమ పరిశోధకుడు, సంవత్సర ఉత్తమ శాస్త్రవేత్త, సంవత్సర ఉత్తమ ప్రొఫెసర్... ఇలా ఉంటాయి అవార్డులు. ఇది భారతదేశంలోని సంస్థ. పొందేది చక్కని ఫ్రేమ్డ్ సర్టిఫికెట్ మరియు మెడల్. డబ్బు చెల్లించే వారు చెన్నై, బెంగుళూరు లేదా ఖాట్మండులోని స్టార్ హోటళ్లలో జరిగే స్నాతకోత్సవ వేడుకకు హాజరుకావాలని మొదటగా కోరుతారు. ఈ కార్యక్రమానికి డిమాండ్ లేని ప్రముఖ వ్యక్తులు హాజరవుతుంటారు. ఇండియన్ వర్చువల్ యూనివర్సిటీ; యూనివర్సల్ తమిళ విశ్వవిద్యాలయం, చెన్నై; కింగ్స్ యూనివర్సిటీ, యూఎస్‌ఏ; అంతర్జాతీయ శాంతి విశ్వవిద్యాలయం, జర్మనీ; అంతర్జాతీయ తమిళ విశ్వవిద్యాలయం; యూనివర్సిటీ ఆఫ్ ఆసియా, ఖాట్మండు, నేపాల్... ఇలా వాణిజ్యంలో నిమగ్నమైన కొన్ని సంస్థలు ఇలాంటి పురస్కారాల ఉత్సవాలు జరుపుతుంటాయి. వాటిలో చాలా వరకు భవనాలు, ఇతర సౌకర్యాలు కల్పిత చిత్రాలతో తయరైనవి. చాలామంది సినీ ప్రముఖులు, బిగ్ బాస్ విజేతలు మొదలుకొని చిన్న సంస్థలలో పనిచేసేవారు, ప్రజాసంఘాల నాయకులు సైతం రుసుము చెల్లించి ఎందుకూ పనికిరాని పత్రాలు, మెమెంటోలు కొనుక్కుంటున్నారు.

ఒక బాధిత నటుడు రాయల్ అమెరికన్ యూనివర్సిటీకి డి.లిట్ కోసం డబ్బులు చెల్లించారు. వెబ్‌సైట్ ప్రకారం విశ్వవిద్యాలయం యునైటెడ్ స్టేట్స్‌లోని డెలావేర్ స్టేట్‌లో ఉంది. అక్కడ స్టేట్ లైబ్రరీ అధికారులతో జరిపిన విచారణలో, అమెరికాలోని గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు, కళాశాలలు చివర '.ఇడియు'తో వెబ్ చిరునామాను కలిగి ఉన్నాయని తేలింది. కాబట్టి ఇది కల్పిత విశ్వవిద్యాలయంగా కనిపిస్తుందని పోలీసులు తేల్చి చెప్పారు. డెలావేర్‌లో భౌతికంగా ఈ పేరుతో విశ్వవిద్యాలయం కానీ కళాశాల కానీ లేదు. బాగా శోధించిన తర్వాత, వెబ్‌సైట్‌లో ఇచ్చిన స్థలం కారు మరమ్మతు యూనిట్ అని తేలింది. ఇలాంటి గౌరవ డాక్టరేట్లు, ఆణిముత్యాలు, ఉత్తమ ప్రశంస పత్రాలు డబ్బు తీసుకొని ప్రచురించే సంస్థలపై నిఘా పెట్టి, ఇలాంటి ఈవెంట్లు నిర్వహించే వారిని అదుపులోకి తీసుకోవాలి.

- డాక్టర్ ముచ్చుకోట సురేష్ బాబు, అధ్యక్షులు, ప్రజాసైన్స్ వేదిక

# గడ్డి దివిటీ– గంగానది

పొగడ్తలకు పొంగిపోవడం, తెగడ్తలకు కుంగిపోవడం ధీరుల లక్షణం కాదు. పొంగిపోవడం వల్ల అహంకారం ఉదయిస్తుంది. ఆ అహంకారమే తిరిగి మనల్ని తిరోగమనంలోకి నడిపిస్తుంది. అలాగే కుంగిపోవడం కూడా. తెగడ్తలకు కుంగిపోయిన వారు నైరాశ్యంలో పడిపోతారు. ఆ నిరాశలో తమ శక్తుల్ని కోల్పోతారు. అంతేకాదు... ఒక్కోసారి కోపం తెచ్చుకుంటారు. కలహాలతో జీవిస్తారు. కాబట్టి... పొంగడమైనా, కుంగడమైనా రెండూ మన పతన కారణాలే అవుతాయి. సత్యాన్ని సత్యంగా చూడనీయవు. అసత్యాన్ని అసత్యంగా దర్శించనీయవు.

కాబట్టి, పొగడ్తలకు పొంగని, తెగడ్తలకు కుంగని సమతా స్థితిని కలిగి ఉండటమే ప్రజ్ఞ. స్థితప్రజ్ఞత. సాధారణంగా మనం ఇతరుల నుండి ఐదు రకాల మాటల్ని వింటూ ఉంటాం.



జ్యోతిర్మయం

వారి మాటలు సమయ సందర్భాన్ని బట్టి ఉండొచ్చు, ఉండకపోవచ్చు. అవి నిజం కావచ్చు, కాకపోవచ్చు. మేలు కలిగించేవి కావచ్చు, కీడు కలిగించేవి కావచ్చు. మైత్రితో ఉండొచ్చు, ద్వేషంతో ఉండొచ్చు. మృదువుగా ఉండొచ్చు, పరుషంగా ఉండొచ్చు. ఇలా– ఈ ఐదు రకాలుగా ఉంటాయి. మొదటి ఐదు మనకి ఉల్లాసాన్నీ, శాంతినీ కలిగిస్తాయి. రెండవ ఐదు నిరుత్సాహాన్నీ, కోపాన్నీ తెప్పిస్తాయి. కానీ... మీరు స్థిర చిత్తులు దృఢచిత్తులు అయితే, స్థితప్రజ్ఞత కలిగిన వారు అయితే... వీటికి పొంగరు, కుంగరు. వారు పలికే పలుకులు... మీ మీద, మీ నడిచే నడత మీద, మనస్సు మీద ఎలాంటి ముద్రల్నీ వేయలేవు.

ఎలాగంటే... ఒకరు పలుగు, పార, గంపలు తెచ్చి 'ఈ భూమినంతా తవ్వి పారబోస్తాను, ఈ మహా పృధ్విని లేకుండా చేస్తాను' అన్నాడనుకోండి. అది సాధ్యమా? అతను అక్కడక్కడే కొద్దిగా తవ్విపోసిన గుంటల వల్ల భూమి హరించుకుపోతుందా? భూమి చలిస్తుందా? కంపిస్తుందా? బరువును కోల్పోతుందా? అలాగే స్థిరచిత్తుడు ఈ ఐదు రకాల పొగడ్తలకీ, తెగడ్తలకీ పొంగడు, కుంగడు. అతని చిత్తంలో ఎలాంటి మార్పూ కలగదు. అలాగే– మరొకడు మండుతున్న గడ్డి దివిటీ తెచ్చి 'ఈ నీటిని వేడి చేస్తాను! ఆవిరి చేస్తాను' అని ఆ దివిటీని గంగానదిలో ముంచాడనుకొండి. ఏమవుతుంది? ఆ నీరు వేడెక్కుతుందా? సలసల మరిగి ఆవిరి అవుతుందా? నీటిలో ఎలాంటి మార్పూ రాదు. చివరకు ఆ దివిటీనే చప్పగా చల్లారిపోతుంది. స్థిర చిత్తుడు మహానది లాంటివాడు. కోపం, ద్వేషం, ఈర్ష్య అనే గడ్డి మంటలు అతణ్ణి ఏమీ చేయలేవు. అతని చిత్తంలో ఎలాంటి మార్పూ కలిగించలేవు. అతని మనస్సు ఎల్లప్పుడూ మైత్రీ భావనతోనే ఉంటుంది అంటాడు బుద్ధుడు.

- బొర్రా గోవర్ధన్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** అమావాస్య ప.1.39 వరకు, తదుపరి ఫాల్గుణ శు.పాడ్యమి, **నక్షత్రం:** ధనిష్ఠ ప.12.54 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.7.38 నుండి 9.06 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.36 నుండి 1.23 వరకు తదుపరి ప.2.54 నుండి 3.40 వరకు, **అమృతఘడియలు:** తె.4.38 నుండి 5.56 వరకు(తెల్లవారితే మంగళవారం), **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.29, **సూర్యాస్తమయం:** 5.59.

# మల్లికార్జునుడికి వైభవంగా పెద్దపట్నం



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్ద పట్నం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి 1.10 గంటలకు (లింగోద్భవ కాలంలో) మొదలైన కార్యక్రమం ఆదివారం తెల్లవారుజామున 4 గంటల వరకు కొనసాగింది. పెద్దపట్నం (కల్యాణం) చూసేందుకు సుమారు 70 వేలమంది భక్తులు తరలివచ్చారు. ఒగ్గు పూజారులు పంచెవన్నె రంగులతో 41 వరుసల పట్నం వేసి స్వామివారికి కల్యాణం జరిపించారు. తెల్లవారుజామున గర్భాలయం నుంచి వీరశైవ అర్చకులు ఉత్సవ విగ్రహాలతో పెద్దపట్నం చుట్టూ ప్రదక్షిణలు చేసి పట్నం తొక్కారు. అనంతరం భక్తులు మల్లన్నను స్మరిస్తూ పట్నాన్ని విడతల వారీగా దాటారు. సిద్దిపేట అడిషనల్ డీసీపీ మహేందర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## క్లుప్తంగా...

### హుజూర్‌నగర్, కోదాడ కోర్టులను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



హుజూర్‌నగర్ కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ రాధారాణి

హుజూర్‌నగర్, కోదాడ: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, కోదాడ కోర్టులను హైకోర్టు న్యాయమూర్తి, సూర్యాపేట జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ డాక్టర్ రాధారాణి ఆదివారం సందర్శించారు. కోర్టుల పరిసరాలను పరిశీలించి హుజూర్‌నగర్ కోర్టులో జడ్జిలు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 7వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నందున.. ఇక్కడ అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. హైకోర్టు పరిధిలోని అంశాలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ప్రధాన జడ్జి గౌతమ్ ప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్ కుమార్, కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

### సూర్యాపేట జిల్లాలో స్వల్ప భూకంపం



భయంతో ఆరుబయట కూర్చున్న జనం

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లాలో ఆదివారం స్వల్ప భూకంపం వచ్చింది. చింతలపాలెం మండలంలోని తమ్మారం, వెల్లటూరు, చింతలపాలెం, గుడిమల్కాపురం, దొండపాడు, వజినేపల్లి తదితర గ్రామాలతో పాటు మేళ్లచెరువు మండలంలో ఉదయం 7.30 గంటల సమయంలో 3 నుంచి 5 సెకన్ల పాటు భూమి కంపించింది. దీని తీవ్రత సుమారు 3 మాగ్నిట్యూడ్‌గా నమోదైనట్లు తెలిసింది. గతంలో 2020, జనవరి మొదటి వారంలో 4 మాగ్నిట్యూడ్‌గా నమోదైంది. 2022లో కూడా పలు మార్లు స్వల్పంగా భూమి కంపించింది. ఈ నేపథ్యంలో మళ్లీ భూకంపం సంభవించడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రపంచ పద్మశాలి సదస్సుకు తడక యాదగిరి



భూదాన్‌పోచంపల్లి: దుబాయ్‌లో ఈ నెల 25, 26 తేదీల్లో నార్త్ అమెరికన్ పద్మశాలి అసోసియేషన్, దుబాయ్ నేత ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ పద్మశాలి సదస్సుకు తెలంగాణ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లికి చెందిన చేనేత రంగ పరిశోధకుడు, తెలంగాణ సోషల్ డెవలప్‌మెంట్ స్టడీస్ చైర్మన్, విద్యావేత్త తడక యాదగిరి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు నార్త్ అమెరికన్ పద్మశాలి అసోసియేషన్ ప్రతినిధి బాలాజీ ఆహ్వాన పత్రాన్ని యాదగిరికి అందజేశారు. దుబాయ్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న గ్లోబల్ పద్మశాలి సదస్సుకు 12 దేశాల నుంచి 200 మంది వరకు ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సదస్సులో పద్మశాలీల భవిష్యత్ కార్యాచరణ, చేనేత పరిశ్రమ అభివృద్ధి, చేనేత వస్త్రాల ప్రమోటింగ్ తదితర అంశాలపై చర్చించనున్నారు.

# సిద్దిపేట 'సేంద్రియ ఎరువు'

- కార్బన్ లైట్స్ పేరుతో మార్కెట్‌లోకి..
- సిద్దిపేటలో సేకరించే తడిచెత్తతో ఎరువు తయారీ
- ఈ నెల 21న మార్కెట్‌లోకి విడుదల చేయనున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట మున్సిపాలిటీలో సేకరించిన తడి చెత్త ద్వారా తయారైన నాణ్యమైన సేంద్రియ ఎరువు త్వరలో మార్కెట్లోకి రానుంది. మున్సిపాలిటీలో సేకరించిన తడి చెత్తను సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్‌లోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఈ తడి చెత్తతో ఇప్పటికే సీఎన్‌జీని తయారు చేసి విక్రయిస్తుండగా.. తాజాగా ఎరువును కూడా తయారు చేసి విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సేంద్రియ ఎరువును సిద్దిపేట కార్బన్ లైట్స్ బ్రాండ్ పేరుతో ఈ నెల 21న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా మార్కెట్‌లోకి విడుదల చేయనున్నారు.

**ప్రతి ఇంటినుంచి చెత్త సేకరణ..**

సిద్దిపేట పట్టణంలోని 43 వార్డుల్లో 41,322 కుటుంబాలు ఉండగా 1,57,026 మంది నివసిస్తున్నారు. ఇక్కడ తడి, పొడి, హానికర చెత్తను ఇంటింటి నుంచి సేకరించడాన్ని డిసెంబర్ 2020లో ప్రారంభించారు. ఈ చెత్తను సేకరించేందుకు 52 వాహనాలను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో రోజుకు 60 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా ఇందులో 70 శాతం తడి, 30 శాతం పొడి చెత్త ఉంటోంది. ఈ లెక్కన 42 మెట్రిక్ టన్నుల తడి చెత్త, 18 మెట్రిక్ టన్నుల పొడి చెత్తను సేకరిస్తున్నారు.

**తడి చెత్తతో ఎరువు తయారీ**

బుస్సాపూర్ డంపింగ్ యార్డులో రూ.6 కోట్ల వ్యయంతో బయో - సీఎన్‌జీ ప్లాంట్, సేంద్రియ ఎరువుల కేంద్రం నిర్మించారు. ఈ ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను కార్బన్ లైట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అప్పగించారు. రాష్ట్రంలోనే మొదటిదైన ఈ ప్లాంట్‌ను 2021 డిసెంబర్ 20న బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ డాక్టర్ ఆండ్రూ ఫ్లెమింగ్‌తో కలసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఇళ్ల నుంచి సేకరించిన 42 మెట్రిక్ టన్నుల తడి చెత్త నుంచి ఆహార వ్యర్థాలు, కురగాయలు, ఇతర వ్యర్థాలను వేరు చేస్తున్నారు. ఇలా వేరుచేసిన తర్వాత 10 మెట్రిక్ టన్నుల తడి చెత్తను బయో-సీఎస్‌జీ తయారు చేయడానికి మిగతా 32 మెట్రిక్ టన్నుల చెత్తను సేంద్రియ ఎరువులను తయారు చేయడానికి వినియోగిస్తున్నారు. సిద్ధం చేసిన సేంద్రియ ఎరువును 40 కేజీల చొప్పున బ్యాగుల్లో ప్యాక్ చేసి విక్రయించేందుకు సిద్ధం చేశారు. ఒక్కో బ్యాగు అసలు ధర రూ.600 కాగా సిద్దిపేట రైతులకు రూ.300కే విక్రయించనున్నారు.




**21న రైతులకు అవగాహన సదస్సు**

సేంద్రియ ఎరువుల ఆవశ్యకతపై రైతులకు ఈ నెల 21న సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి యార్డులో అవగాహన కల్పించనున్నారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేయనున్నారు.

**సిద్దిపేట బ్రాండ్‌తో సేంద్రియ ఎరువు: మంత్రి హరీశ్‌రావు**

మంత్రి హరీశ్‌రావు ఆదివారం సాయంత్రం సిద్దిపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సిద్దిపేట బ్రాండ్‌తో చెత్త ద్వారా తయారు చేసిన ఎరువును రైతులకు అందించబోతున్నామన్నారు. సిద్దిపేట ప్రజలు రోజు వేసే చెత్తతో ఒక గొప్ప సంపదను తయారు చేసి రైతులకు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ సేంద్రియ ఎరువుతో అన్నీ పంటల నుంచి అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తులు పొందే అవకాశం ఉందని చెప్పారు.

# వైఎస్ షర్మిల అరెస్టు

- ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కు తరలింపు
- లోటస్‌పాండ్‌లోని ఇంటి వద్ద దింపిన పోలీసులు
- పాదయాత్ర అనుమతి రద్దు చేసిన ఎస్పీ
- ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని ప్రశ్నించిన షర్మిల

సాక్షి, మహబూబాబాద్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను ఆదివారం మహబూబాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన ఘటనలో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. మహబూబాబాద్ జిల్లాలో ప్రజాప్రస్థానం యాత్రలో భాగంగా నిర్వహించిన పాదయాత్రలో షర్మిల స్థానిక ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు బీఆర్‌ఎస్ కార్యకర్తలు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. షర్మిల వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం ఉదయం శంకర్‌నాయక్ భార్య సీతామహాలక్ష్మితోపాటు పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు షర్మిల బస చేసిన క్యాంపు వద్దకు తరలివచ్చారు. షర్మిల ఫ్లెక్సీలను దహనం చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి చేయిదాటే ప్రమాదం ఉండటంతో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా షర్మిల పాదయాత్రకు ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రకటించారు. తరువాత షర్మిలను అరెస్టు చేసి పోలీస్ వాహనంలో ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కు తరలించారు. ఆ వాహనంపై ఆందోళనకారులు రాళ్లు వేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అసభ్యకర వ్యాఖ్యలు చేసిన షర్మిల క్షమాపణ చెప్పాలని సీతామహాలక్ష్మి, డిమాండ్ చేశారు.



లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

**కోర్టుకు వెళ్లి అనుమతి తెచ్చుకుంటాం: షర్మిల**

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ పాలనలో పాదయాత్ర చేయాలంటే కోర్టుకు వెళ్లి అనుమతి తెచ్చుకోవాలని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. మీరు అంటేనే తాను జవాబు ఇచ్చానని, దానికి పోలీసులు తనను అరెస్ట్ చేసి మళ్లీ ఇంటి దగ్గర దింపారన్నారు. తాను ఎవరిపైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయలేదని, తనమీద వేసిన నిందలకు సమాధానం మాత్రమే చెప్పానని పేర్కొన్నారు. పోలీసులు లోటస్‌పాండ్‌లోని తన ఇంటి వద్ద దింపిన తర్వాత షర్మిల మీడియాతో మాట్లాడారు. ఆడదాన్ని అయితే ఇష్టం వచ్చినట్టు మాట్లాడతారా, ప్రజా సమస్యలను ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. తమ ప్రజాప్రస్థానం పాదయాత్రకు ప్రజల ఆదరణ లభిస్తోందన్న కుళ్లుతోనే కేసీఆర్ పాదయాత్రను ఆపించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. అయినా కోర్టుకు వెళ్లి అనుమతి తెచ్చుకుంటామన్నారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో పాదయాత్ర చేశానని.. ఎక్కడ చూసినా మాఫియాలు.. కబ్జాలేనని విమర్శించారు. పాదయాత్ర అంటే పాదాల మీద నడిచే యాత్ర అని.. రేవంత్‌రెడ్డి పాదయాత్ర అనే పదానికి అర్థం లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, పార్టీ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

## తరోడ వద్ద కుంగిన బ్రిడ్జి

- అంతర్రాష్ట్ర రహదారిపై భారీ వాహనాల రాకపోకలకు బ్రేక్..

జైనథ్: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం తరోడ గ్రామ సమీపంలోని తరోడ వాగుపై ఉన్న బ్రిడ్జి ఆదివారం ఉదయం కుంగిపోయింది. కింది వైపు నుంచి బీటలు వారింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా అక్కడి చేరుకొని వెంటనే రాకపోకలను నిలిపివేశారు. జైనథ్, బేల ప్రాంతాల మీదుగా మహారాష్ట్ర, ఆదిలాబాద్‌ను కలుపుతూ 33 కిలోమీటర్ల మేరకు ఉన్న ఈ అంతర్రాష్ట్ర రహదారి రవాణాకు అత్యంత కీలకం. శనివారం ఒక్కసారిగా రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం బ్రిడ్జి వద్ద పికెటింగ్ ఏర్పాటు చేసి ద్విచక్రవాహనాలతో పాటు పాదచారులను మాత్రమే అనుమతిస్తున్నారు. మిగతా వాహనాలకు నో ఎంట్రీ విధించారు. మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను నిరాల నుంచి అడా గ్రామం మీదుగా ఆదిలాబాద్ వైపు మళ్లించారు. ఆదిలాబాద్ నుంచి జైనథ్, బేల వెళ్లే వాహనాలను సీసీఐ మీదుగా నిరాల, జైనథ్ దారిలో మళ్లించారు.

**2018లో వరదలకు కొట్టుకుపోయిన బ్రిడ్జి..**

2018 ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు సాత్నాల, మత్తడి వాగు గేట్లు ఒక్కసారిగా ఎత్తడంతో తరోడ వద్ద ఉన్న ఈ బ్రిడ్జి దెబ్బతింది. అప్పట్లో రెండు నెలల పాటు వాహనాల రాకపోకలను నిలిపివేసి తాత్కాలిక మరమ్మతుల అనంతరం పునఃప్రారంభించారు. అప్పటినుంచి భారీ వరదలేవి రాకపోవడంతో బ్రిడ్జి ఇప్పటివరకు సేవలందించింది. అయితే ఈ రహదారి గుండా మహారాష్ట్ర నుంచి భారీ లోడ్‌తో సిమెంట్, ఇతర లారీలు రాకపోకలు కొనసాగిస్తుండడంతోనే ప్రస్తుతం బ్రిడ్జి కుంగడంతో పాటు బీటలు వారినట్లుగా అంచనా వేస్తున్నారు.



బీటలు వారిన బ్రిడ్జి

## వాషింగ్టన్ వేదికగా తెలంగాణ వాయిస్

- రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ అధ్యక్షతన 'ఇస్టా'సమావేశాలు
- విత్తన భాండాగారంగా తెలంగాణ: డాక్టర్ కేశవులు



ఇస్టా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కేశవులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విత్తన ధ్రువీకరణ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ కేశవులు అమెరికా గడ్డపై తెలంగాణ వాయిస్ వినిపించారు. అంతర్జాతీయ విత్తన పరీక్షల సంఘం (ఇస్టా) అధ్యక్షుడి హోదాలో ఈ నెల 13 నుంచి 18 వరకు వాషింగ్టన్‌లో జరిగిన ఇస్టా పాలకమండలి సమావేశాలకు అధ్యక్షత వహించిన ఆయన తెలంగాణను అంతర్జాతీయ విత్తన భాండాగారంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ పథకాల ఫలితంగా ఆసియా ప్రాంతంలో తెలంగాణ రాష్ట్రం విత్తన ఎగుమతి కేంద్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. భవిష్యత్తులో విత్తన ఎగుమతులను పెంచుకోవడానికి ప్రాంతీయ విత్తన ప్రమాణాలు, వాణిజ్య నిబంధనలు తెలంగాణకు గొప్ప అవకాశాన్ని కల్పిస్తాయని కేశవులు అభిప్రాయపడ్డారు. ప్రపంచ విత్తన నాణ్యత, ప్రపంచ ఆహార భద్రతలో 'ఇస్టా'పాత్రను తెలియజేశారు. నాణ్యతగల విత్తనాలు విత్తన రంగం అభివృద్ధిలో ముఖ్యమైన భాగమని, ఇది వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచుతుందని అన్నారు. ప్రపంచ విత్తన పరిశ్రమను 2022లో 63 బిలియన్ డాలర్లుగా అంచనా వేశామన్నారు. 2026 నాటికి అది 86.8 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. ప్రపంచ విత్తన పరిశ్రమలో ఉత్తర అమెరికా ఆధిపత్యం 35 శాతం ఉన్నప్పటికీ ప్రధాన వృద్ధి మాత్రం ఆసియా-పసిఫిక్, ఆఫ్రికా ప్రాంతంలో కనిపిస్తోందన్నారు.

## తాటికల్లు సేవించడం తెలంగాణ సంస్కృతి



కలకోవ శివారులోని తాటివనంలో కల్లు తాగుతున్న గోరటి వెంకన్న

మునగాల (కోదాడ): రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులను ప్రోత్సహించేందుకు కల్లును వేదామృతంగా ప్రకటించడం అభినందనీయమని, రాష్ట్రంలో తాటికల్లు సేవించడం తెలంగాణ సంస్కృతి అని శాసనమండలి సభ్యుడు, కవి గోరటి వెంకన్న పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం కలకోవ శివారులో గల తాటివనంలో ఆదివారం 'వేదామృతం -నీరాఫెస్టివల్'ను తొలిసారిగా కవులు, జర్నలిస్టులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కల్లులో ఎన్నో ఔషధ గుణాలున్నాయని, కల్లు సేవించడం ఆరోగ్యదాయకమని తెలిపారు. గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గీత కార్మికులు ప్రమాదాలకు గురైన సందర్భంలో ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించి ఆదుకుంటోందని చెప్పారు. ఈ సందర్భంగా గీత కార్మికులు తీసుకువచ్చిన కల్లును సేవించారు. ఈ కార్యక్రమంలో 'సాక్షి'కార్టూనిస్టు శంకర్, తెలంగాణ సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ విమర్శకులు డాక్టర్ అంబటి సురేంద్ర రాజు, పున్నా కృష్ణమూర్తి, రఘు, రాములు, ప్రముఖ కవులు మునాస్ వెంకట్, మోహన్‌రేషి, తెలంగాణ మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు, ప్రముఖులు బండారు శంకర్, గౌడసంఘం నాయకులు అమరగాని వీరభద్రం గౌడ్, కలకోవ గ్రామసర్పంచ్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ యాప్ వేధింపులకు యువకుడు బలి!

- రూ.ఆరు వేలు తీసుకుని రూ.54వేలు కట్టించుకున్నారు
- అప్పు ఇంకా తీరలేదని నిత్యం వేధింపులు
- వ్యక్తిగత కారణాలతోనే అంటున్న పోలీసులు



భూక్యా ఆకాశ్ (ఫైల్)

ఖమ్మంక్రైం: ఆన్‌లైన్ యాప్ లోన్ ఆగడాలకు ఖమ్మంలో ఓ యువకుడు బలయ్యాడు. యాప్ వారి వేధింపులకు భరించలేక పురుగుమందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. ఖమ్మం జిల్లాలో రఘునాథపాలెం మండలంలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బాపూజీ తండాకు చెందిన భూక్యా భావ్‌సింగ్ కుమారుడు ఆకాశ్(24) నగరంలోని ఓ బంగారం షాపులో పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ.6 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఆ అప్పును సకాలంలో చెల్లించడంతోపాటుగా అదనంగా రూ.54 వేలు చెల్లించినా....ఇంకా అప్పు ఉన్నావని, అప్పు చెల్లించకుంటే 'నీ ఫొటో, మీ కుటుంబ సభ్యుల ఫొటోలు సోషల్ మీడియాలో పెడతాం'అంటూ వేధింపులకు పాల్పడ్డారు. వారి వేధింపులు భరించలేక ఈ నెల 9న తాను పనిచేసే షాపు వెనుకనే పురుగు మందు తాగాడు. షాపు యాజమాన్యం గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఆకాశ్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఖమ్మం త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, సీఐ సర్వయ్య మాత్రం లోన్‌యాప్ వేధింపులనే ఫిర్యాదు తమకు అందలేదని, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడనే సమాచారం ఉందని, దీనిపై విచారణ చేస్తున్నామని చెప్పారు.

## అనుమతులు వచ్చినా జాప్యమే..!

▶ మొదటి పేజీ తరువాయి

కానిస్టేబుల్, ఎస్సై పోస్టులకు ప్రకటనలు జారీ చేసింది. ఇక తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఎంహెచ్ఎస్ఆర్‌బీ) సైతం మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సు కేటగిరీల్లో 7 వేల ఉద్యోగాలకు ప్రకటనలు ఇచ్చింది. ఇలా వివిధ నియామక సంస్థలు నోటిఫికేషన్లు ఇచ్చి దరఖాస్తుల స్వీకరణ, అర్హత పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై బిజీ అవుతుండగా.. గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదు.

**నిరాశలో అభ్యర్థులు**

రాష్ట్ర ప్రభుత్వం ఐదు గురుకుల సొసైటీల పరిధిలో పోస్టుల భర్తీ బాధ్యతలను టీఆర్ఈఐఆర్‌బీకి అప్పగించింది. ఇంత పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి టీఆర్ఈఐఆర్‌బీ పక్కా వ్యూహంతో సన్నద్ధం కావాలి. బోర్డుకు చైర్మన్‌గా గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శుల్లో సీనియర్ ఒకరు వ్యవహరిస్తారు. ఆ తర్వాత మరో కార్యదర్శి కన్వీనర్‌గా, మిగతా సొసైటీలకు సంబంధించిన కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. సొసైటీల కార్యదర్శులే బోర్డులో ఉండటంతో ఉద్యోగ ఖాళీలు, ఇతర అంశాల సమాచారం వేగంగా సేకరించి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అయినా జాప్యం తప్పడం లేదు. దీనితో గురుకుల కొలువుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు.

# రేపటి నుంచే యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

- వచ్చే నెల 3 వరకు ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు జరిగే శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఇప్పటికే రూ.1.50కోట్ల బడ్జెట్‌ను ఆలయాధికారులు కేటాయించారు. ప్రధానాలయం ఉద్ఘాటన తరువాత జరుగుతున్న తొలి బ్రహ్మోత్సవాలు కావడంతో రాష్ట్రమంతా తెలిసే విధంగా ప్రచారం చేపట్టారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ అధికారులతో ఈఓ గీతారెడ్డి ఆదివారం సమీక్ష నిర్వహించారు. అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆలయాధికారులకు సూచించారు. శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండపైన ఏర్పాట్లను వేగంగా చేస్తున్నారు. ప్రధానాలయ ప్రథమ ఉత్తర ప్రాకార మంటపంలో నిత్య హోమాది పూజలు చేసేందుకు యాగశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్తర దిశలోని రథశాలలో ఉన్న శ్రీస్వామి వారి రథాన్ని సిద్ధం చేసే పనిలో ఉన్నారు. యాదాద్రీశుడి కొండపై ఉన్న విష్ణు పుష్కరిణిని అధికారులు సిద్ధం చేశారు. ఆలయాభివృద్ధిలో భాగంగా ఈ విష్ణు పుష్కరిణికి సుమారు రూ.5.3కోట్ల వ్యయంతో మరమ్మతులు చేపట్టారు. దీనిని కేవలం శ్రీస్వామి వారి కార్యక్రమాలకే వినియోగించేలా తీర్చిదిద్దారు.



అమ్మవారికి సమర్పించనున్న పట్టు చీరను పరిశీలిస్తున్న యాదాద్రి దేవస్థాన అధికారులు


**పట్టువస్త్రాల పరిశీలన**

బ్రహ్మోత్సవాల సందర్భంగా పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవానికి స్వామి, అమ్మవార్లకు సమర్పించనున్న పట్టు వస్త్రాలను ఆదివారం దేవస్థానం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారులు రమేశ్‌బాబు, దూసరి కృష్ణ, సూపరింటెంట్ రామారావు పరిశీలించారు. సంఘం అధ్యక్షుడు సీతా శ్రీరాములు మాట్లాడుతూ 21న బ్రహ్మోత్సవాల అంకురార్పణ రోజున దేవాలయంలో అమ్మవారికి రెండు పట్టు చీరెలు, స్వామికి రెండు పట్టు పంచెలు, రెండు శాలువాలను సమర్పిస్తామని తెలిపారు.

**యాదాద్రిలో భక్తుల రద్దీ**

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో పాటు వేములవాడ, కొమురవెల్లి వంటి దేవాలయాలకు వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో యాదాద్రీశుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని వెళ్లారు. దీంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి 2 గంటలు, వీఐపీ దర్శనానికి 45 నిమిషాల సమయం పట్టింది. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, కల్యాణ కట్ట వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు.

## మురికి నీటిలో పుణ్యస్నానాలు



కొమురవెల్లి ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రి పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చిన భక్తులకు ఇబ్బంది తప్పలేదు. ఆలయ అధికారుల నిర్లక్ష్యంతో కోనేరులోని మురికి నీటిలోనే పుణ్యస్నానాలు చేయాల్సి వచ్చిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

## క్లుప్తంగా...

### విచారణకు కొంత సమయమివ్వండి

**సీబీఐకి సిసోడియా లేఖ**



**న్యూఢిల్లీ:** ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మళ్లీ విచారణకు హాజరయ్యేందుకు కొంత సమయం కావాలని ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా సీబీఐకి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పనలో బిజీగా ఉన్నందున వెంటనే వీలుకాదని ఆర్థిక మంత్రిగా కూడా వ్యవహరిస్తున్న సిసోడియా పేర్కొన్నారు. ఈ నెల చివరి వారంలో వీలు కుదురుతుందని, సీబీఐ అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానమిస్తానని అందులో వివరించారు. సిసోడియా వినతిని పరిశీలించామని, విచారణకు మరో తేదీని త్వరలోనే నిర్ణయిస్తామని సీబీఐ అధికారులు తెలిపారు. ఈ కేసులో మూడు నెలల క్రితం కోర్టులో చార్జిషీట్ వేసిన సీబీఐ ఆదివారం జరిగే విచారణకు రావాలంటూ సిసోడియాకు సమన్లు జారీ చేసింది. ఢిల్లీ మున్సిపల్ మేయర్ ఎన్నిక విషయంలో సుప్రీంకోర్టులో ఓటమి పాలైన కేంద్ర ప్రభుత్వం మద్యం కేసులో తనను అరెస్ట్ చేయడం ద్వారా ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోందని సిసోడియా మీడియాతో వ్యాఖ్యానించారు. ఢిల్లీ ప్రజలకు అత్యంత అవసరమైన బడ్జెట్ రూపకల్పన కోసమే సీబీఐని గడువు కోరినట్లు వెల్లడించారు. అరెస్టయ్యేందుకు గానీ, జైలుకు వెళ్లేందుకు గానీ తానేమీ భయపడటం లేదని చెప్పారు.

### సరిహద్దుల్లో డ్రోన్, హెరాయిన్ లభ్యం

**గురుదాస్‌పూర్:** భారత్– పాక్ అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంలో బీఎస్‌ఎఫ్ ఒక డ్రోన్‌ను, హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. సరిహద్దుల్లోని పంజాబ్ రాష్ట్రం గురుదాస్‌పూర్ జిల్లా ధనియాకె గ్రామం వద్ద ఆదివారం ఉదయం 9.15 గంటల సమయంలో ఘటన జరిగింది. సరిహద్దు వెంట స్మగ్లర్ల అనుమానాస్పద కదలికలతో అప్రమత్తమైన జవాన్లు ఆ ప్రాంతంలో సోదాలు చేపట్టారు. తొమ్మిది కిలోల బరువును మోయగలిగే చైనా తయారీ డ్రోన్ వారికి కనిపించింది. అందులో నాలుగు ప్యాకెట్లలో 2.730 గ్రాముల బరువున్న హెరాయిన్ లభ్యమైంది. శనివారం ఖసావలి గ్రామం సమీపంలో బీఎస్‌ఎఫ్ బలగాలు సరిహద్దు కంచెకు 30 మీటర్ల దూరంలో పడి ఉన్న 15 అడుగుల పొడవైన పైపులో 20 ప్యాకెట్ల హెరాయిన్‌ను, రెండు పిస్టళ్లు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి.

# భస్మాసుర హస్తం!

## పాకిస్తాన్‌లో తాలిబన్ల ధ్వంసరచన ● దేశాన్ని చెప్పుచేతల్లోకి తీసుకునే దిశగా పావులు

**ఆర్థికంగా దివాలా తీశామని ఒకవైపు దేశ రక్షణ మంత్రే ప్రకటిస్తున్న పరిస్థితుల్లో తెహ్రీక్–ఇ–తాలిబన్ రూపంలో కొత్త ముప్పుని ఎదుర్కొంటోంది. అఫ్గాన్‌లో తాలిబన్లు అధికారం చేజిక్కించుకున్నప్పుడు సంబరాలు చేసుకున్న పాకిస్తాన్ ఇప్పుడు తాము బలిపశువుగా మారినందుకు ఎలా అడుగు లు వెయ్యాలో తెలీక బిత్తరపోతోంది. ఎవరీ తెహ్రీక్–ఇ–తాలిబన్లు, వారి లక్ష్యమేంటి ..?** - సాక్షి, నేషనల్ డెస్క్




**2021, ఆగస్టు అఫ్గాన్‌లో తాలిబన్ ప్రభుత్వం ఏర్పాటైన సందర్భం...**

పాకిస్తాన్‌లో సంబరాలు జరిగాయి. తమ కనుసన్నల్లో మెలిగిన తాలిబన్లు అమెరికానే తరిమి కొట్టారని, అగ్రరాజ్యంపై ఇస్లాం ఘన విజయం సాధించిందంటూ నాయకులందరూ ప్రకటనలు గుప్పించారు. ఆ నాటి పాక్ ఐఎస్‌ఐ చీఫ్ ఫయాజ్ హమీద్ కాబూల్‌కు వెళ్లి తాలిబన్ల ప్రభుత్వ స్థాపనకు స్వయంగా ఏర్పాట్లు చేసి మరీ వచ్చారు.

**నెల రోజులయ్యేసరికి..**

అఫ్గాన్‌లో అధికారంలోకొచ్చిన తాలిబన్ల అండతో తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) రెచ్చిపోవడం ప్రారంభించింది. పాకిస్తాన్ సార్వభౌమాధికారాన్నే ప్రశ్నిస్తూ దాడులకు దిగడం మొదలు పెట్టింది. 2021 ఆగస్టు నుంచి 2022 ఆగస్టు వరకు పాక్‌లో కనీసం 250 దాడులు జరిగాయని పాక్ ఇనిస్టిట్యూట్ ఫర్ పీస్ స్టడీస్ (పీఐపీఎస్) గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. అంతకు ముందు ఏడాదితో పోల్చి చూస్తే దాడుల సంఖ్య రెట్టింపు అయింది. ఈ దాడుల్లో 95శాతం బెలూచిస్తాన్, ఖైబర్ పఖ్తుఖ్వా(కె.పి)లో కీలక ప్రాంతాలు లక్ష్యంగా జరిగాయి. భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకునే దాడులు జరుపుతున్నారు. ఈ ఏడాది జనవరిలో 100 మంది ప్రాణాలను బలితీసుకున్న పెషావర్ మసీదు దాడి ఘటన జరిగిన కొద్ది రోజులకే కరాచీలో పోలీసుల్ని లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగడం ఆందోళన కలిగిస్తోంది.

> పాకిస్తాన్‌లో ఉగ్ర దాడులకు ఐసిస్ అవసరం లేదు. పాకిస్తానీ తాలిబన్లు చాలు. అఫ్గానిస్తాన్ తరహాలో ఏదో ఒకరోజు తాలిబన్లు పాకిస్తాన్‌ను స్వాధీనం చేసుకున్నా ఆశ్చర్యపడాల్సిన పని లేదు.
> - తస్లీమా నస్రీన్, బంగ్లాదేశ్ రచయిత్రి




### ఏమిటీ టీటీపీ

తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్తాన్‌ను టీటీపీ అని పిలుస్తారు. అఫ్గానిస్తాన్‌లో తాలిబన్ల మద్దతుతో వీళ్లు తమ కార్యకలాపాలు నిర్వహిస్తారు. 2001లో అమెరికాపై ట్విన్ టవర్స్ దాడి తర్వాత అగ్రరాజ్యం చేసిన ఉగ్రవాదుల ఏరివేత కార్యక్రమానికి పాకిస్తాన్ అండగా నిలవడంతో తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసిన వీరంతా ఒక గూటి కిందకి చేరారు. పాక్ విధానాలను వ్యతిరేకిస్తూ దక్షిణ వజిరిస్తాన్‌లో బైతుల్లా మెహసూద్ నేతృత్వంలో 2007లో తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) ఏర్పాటైంది. టీటీపీ ప్రస్తుత చీఫ్ నూర్ వలీ మెహసూద్ అఫ్గాన్ నుంచి పాక్‌లో హింసను రాజేస్తున్నాడు.

### దివాలా తీశాం: పాక్ రక్షణ మంత్రి

ఆర్థిక సంక్షోభంతో విలవిలలాడుతున్న పాకిస్తాన్ రేపో మాపో దివాలా తీస్తుందని అందరూ అనుకుంటున్న వేళ ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ బాంబు లాంటి నిజం చెప్పారు. ఇప్పటికే దేశం దివాలా తీసిందని అన్నారు. ఆదివారం సియాల్‌కోట్‌లో ఒక కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ''పాక్ దివాలా తీస్తుందన్న వార్తలు మీరు వినే ఉంటారు. వాస్తవానికి ఇప్పటికే దేశం దివాలా తీసింది. మనం ప్రస్తుతం దివాలా తీసిన దేశంలో బతుకుతున్నాం'' అని కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పారు. దేశంలో ఆర్థిక సమస్యల పరిష్కారానికి అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఏమీ చేయలేదని మనమే ఏదో ఒకటి చెయ్యాలన్నారు. పాకిస్తాన్‌లో చట్టం, రాజ్యాంగాన్ని అనుసరించడం లేదని, ఈ దుస్థితికి రాజకీయ నాయకులు, అధికార యంత్రాంగం, మన వ్యవస్థలు అన్నీ బాధ్యతవహించాలన్నారు.

### టీటీపీ లక్ష్యాలేంటి ?

పాకిస్తాన్ మిలటరీ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించిన ఈ సంస్థ దేశాన్ని తన నియంత్రణలోకి తెచ్చుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తోంది. 2021లో అఫ్గాన్ నుంచి అమెరికా, నాటో దళాలు వెళ్లిపోయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాక పాకిస్తాన్‌పై దృష్టి సారించింది. ఇస్లాం విస్తరణ తాలిబన్ల ప్రధాన ధ్యేయంగా మారింది. అఫ్గానిస్తాన్‌లో మాదిరిగా పాకిస్తాన్‌లో కూడా ప్రభుత్వాన్ని కూల్చివేసి ఇస్లామిక్ రాజ్యాన్ని స్థాపించి షరియా చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఉవ్విళ్లూరుతోంది. పాకిస్తాన్ జైళ్లలో ఉన్న తమ వారిని బయటకు తీసుకురావాలని, అఫ్గాన్, పాక్ సరిహద్దుల్లోని గిరిజన ప్రాంతాల్లో పాకిస్తాన్ సైనికుల్ని వెనక్కి తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలంటూ పాక్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తోంది.

### అనుకున్నదొక్కటి అయినదొక్కటి.!

అఫ్గానిస్తాన్‌లో తాలిబన్ల ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే పరిస్థితులన్నీ తమకు అనుకూలంగా మారిపోతాయని పాక్ ప్రభుత్వం భావించింది. రెండు దశాబ్దాల పాటు అఫ్గాన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు సాయం అందించి అంతర్జాతీయంగా మంచి పేరు సంపాదించుకున్న భారత్ ఓ పక్కకి వెళ్లిపోతుందని ఆనందపడింది. అయితే సరిహద్దు రూపంలో తాలిబన్లతో సమస్య మొదలైంది.డ్యూరాండ్ రేఖపై ఇరు దేశాల మధ్య విభేదాలు తలెత్తాయి. టీటీపీ తుపాకీలు వదిలి జన జీవన స్రవంతిలోకి రావాలని పాక్ సర్కార్ చేసిన ప్రయత్నాలు కొనసాగలేదు. సరిహద్దుల్లో ఉన్న గిరిజనుల్ని పాక్ చేతుల నుంచి విడిపించడమే తమ లక్ష్యమన్నట్టుగా టీటీపీ మారిపోయింది. అఫ్గానిస్తాన్ సరిహద్దుల నుంచి సైన్యాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. కొన్నాళ్లు కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ పాకిస్తాన్ కొత్త ఆర్మీ చీఫ్‌గా గత ఏడాది నవంబర్‌లో జనరల్ అసీమ్ మునీర్ బాధ్యతలు స్వీకరించగానే కాల్పుల విరమణను రద్దు చేసింది. అప్పట్నుంచి పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడులు, ప్రభుత్వ అధికారుల కిడ్నాప్‌లు, బెదిరింపులు వంటివి చేయసాగింది. మరోవైపు పాక్ ప్రభుత్వం కూడా తాలిబన్లను అదుపు చేయడానికి దాడులకు దిగుతూ ఉండడంతో ఇరుపక్షాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోతున్నాయి. ఇన్నాళ్లూ అఫ్గాన్‌లో మంచి తాలిబన్లు, పాక్‌లో ఉన్న టీటీపీ చెడ్డ తాలిబన్లు అని భావించిన పాక్‌కు ఇద్దరూ చేతులు కలపడంతో అనుకున్నదొక్కటి అయినది ఒక్కటి అని నిట్టూరుస్తోంది. ఈ పరిణామాలన్నీ దేశంలో అంతర్యుద్ధానికి దారి తీయవచ్చునసే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.



టీటీపీ లోగో

### అమెరికాలో కాల్పులు.. ముగ్గురు బాలికలు మృతి

**గలెనా పార్క్:** అమెరికాలోని హూస్టన్ శివారులోని ఓ ఇంట్లో ఆదివారం జరిగిన కాల్పుల ఘటనలో 13, 14, 19 వయస్సున్న ముగ్గురు బాలికలు చనిపోయారు. 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడి జరిపిన దుండగుడు పారిపోయేందుకు అవకాశమివ్వగా ఆమె ఇంట్లో ఉన్న ఏడాది చిన్నారి సహా అక్కడి నుంచి సురక్షితంగా బయటపడినట్లు పోలీసులు వెల్లడించారు. స్వల్ప గాయాలతో వీరిద్దరూ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారన్నారు. అనంతరం సాయుధుడు(38) తనను తాను కాల్చుకుని చనిపోయాడు.

### సిరియాపై ఇజ్రాయెల్ దాడులు..ఐదుగురు మృతి

**డెమాస్కస్:** సిరియా రాజధాని డెమాస్కస్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం ఐదుగురు చనిపోగా, 15 మంది వరకు గాయపడ్డారు. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో రాజధానిలోని నివాస భవనసముదాయాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు దిగిందని ప్రభుత్వ వార్తా సంస్థ సనా పేర్కొంది. వందల ఏళ్లనాటి కోట, ఒక కళాశాల ధ్వంసమయ్యాయని వివరించింది. ఇరాన్ అనుకూల హిజ్బొల్లా మిలిటెంట్లే లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో కనీసం 15 మంది చనిపోయినట్లు యూకే కేంద్రంగా పనిచేసే సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ పేర్కొంది. కాగా, ఈ ఘటనపై స్పందించేందుకు ఇజ్రాయెల్ నిరాకరించింది.

### అక్రమాలకు సూత్రధారి వినోద్ అదానీయే : కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** అదానీ గ్రూప్ సంస్థల్లో అక్రమాలకు గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీయే ప్రధాన సూత్రధారి అని కాంగ్రెస్ పేర్కొంది. ఒక సంస్థ ఆస్తులను చూపి మరో సంస్థకు రుణాలు పొందారని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. సెబీ, ఈడీల దర్యాప్తునకు ఈ అర్హతలు సరిపోవా అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వినోద్‌కు చెందిన విదేశాల్లోని షెల్ కంపెనీలు కోట్లాది రూపాయలను భారత్‌లోని అదానీ పబ్లిక్ లిస్టెడ్, ప్రైవేట్ సంస్థలకు మళ్లించారన్నారు. వినోద్‌తో తమకు సంబంధం లేదంటూ అదానీ గ్రూప్ తప్పుదోవ పట్టించిందన్నారు.

### మధ్యవర్తిత్వంలో కృత్రిమ మేధ

**కేంద్ర న్యాయ మంత్రి రిజిజు**

**న్యూఢిల్లీ:** దేశంలో సంస్థాగత మధ్యవర్తిత్వం అవసరం ఎంతో ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు చెప్పారు. అడ్ హక్ మధ్యవర్తిత్వంలో లోపాలున్నాయని ఆయన చెప్పారు. కోర్టుల జోక్యానికి వీలుండటం వల్ల అంతిమ తీర్పు ఆలస్యమవుతుందని మంత్రి చెప్పారు. రీసెర్చ్, రివ్యూ వంటి విషయాల్లో మధ్యవర్తిత్వ దారులకు కృత్రిమ మేధ ఉపయోగకారిగా ఉంటుందని తెలిపారు. ఢిల్లీ హైకోర్టులో ఆదివారం మధ్యవర్తిత్వంపై జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సంజయ్ కౌల్ మాట్లాడారు. మధ్యవర్తిత్వ విచారణల్లో వెలువడే తీర్పులకు కక్షిదారులు కట్టుబడి ఉండాలే తప్ప పై కోర్టులకు వెళ్లడం తగదన్నారు.

### 'చంద్రయాన్-3'లో కీలక పరీక్ష విజయవంతం



**బెంగళూరు:** చంద్రయాన్–3 ప్రాజెక్టులో భాగంగా నిర్వహించిన ఎలక్ట్రో–మ్యాగ్నెటిక్ ఇంటర్‌ఫియరెన్స్/ఎలక్ట్రో–మ్యాగ్నెటిక్ కంపాటిబిలిటీ(ఈఎంఐ/ఈఎంసీ) పరీక్ష విజయవంతమైందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఆదివారం ప్రకటించింది. బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకూ ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలియజేసింది. శాటిలైట్ ఉప వ్యవస్థలు అంతరిక్ష వాతావరణంలో సక్రమంగా పనిచేసేలా చూడడానికి ఈఎంఐ/ఈఎంసీ టెస్టు నిర్వహించారు. శాటిలైట్ ప్రయోగాల్లో ఇది ముఖ్యమైన పరీక్ష అని ఇస్రో పేర్కొంది. చంద్రుడిపైన లూనార్‌ను క్షేమంగా దించడమే లక్ష్యంగా చంద్రయాన్–3 ప్రయోగాన్ని ఈ ఏడాది జూన్‌లో చేపట్టే అవకాశం ఉంది. 2019లో చంద్రయాన్–2 ప్రయోగం విఫలమైన సంగతి తెలిసిందే.

### ఛత్రపతి శివాజీ ప్రారంభించారు.. మోదీ కొనసాగిస్తున్నారు: అమిత్ షా

**పుణే:** మొగలులు, ఇతర విదేశీ దురాక్రమణదారులు ధ్వంసం చేసిన ఆలయాలను ఛత్రపతి శివాజీ పునర్నిర్మించారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా శ్లాఘించారు. మరాఠా యోధుడు ప్రారంభించిన ఆ పనిని ప్రధాని మోదీ నేడు కొనసాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దురాగతాలకు వ్యతిరేకంగా పోరాడేందుకే శివాజీ తన జీవితాన్ని పణంగా చెప్పారన్నారు. పుణేలోని నర్హే–అంబేగావ్‌లో శివాజీ జీవితగాథ ఆధారంగా 'శివసృష్టి' ఇతివృత్తంతో 21 ఏకరాల్లో ఏర్పాటవుతున్న పార్క్ మొదటి దశను అమిత్ షా ప్రారంభించారు. 'శివాజీ అనంతరం ధ్వంసమైన ఆలయాల పునర్నిర్మాణాన్ని ప్రధాని కొనసాగిస్తున్నారు. పలు దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నారు'అన్నారు.

**శివాజీ ఆశీస్సులతో విల్లు, బాణం: షిండే**

ఛత్రపతి శివాజీ ఆశీస్సులతో తమకు శివసేన ఎన్నికల గుర్తు 'విల్లు, బాణం' లభించిందని కార్యక్రమంలో పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చెప్పారు. శివసృష్టి ప్రాజెక్టును అద్భుతంగా తీర్చిదిద్దుతామని షిండే చెప్పారు. మహారాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాని మోదీ, అమిత్ షా తమ వెనక కొండంత అండగా నిలిచారని శనివారం ఆయన పేర్కొనడం తెలిసిందే.

# మీరు మళ్లీ యువకులైపోతే...?

## బిల్‌గేట్స్, రిషితో చాట్‌జీపీటీ ఆసక్తికర ఇంటర్వ్యూ

**లండన్:** చాట్‌జీపీటీ. ప్రపంచమంతటా విశేషంగా ఆదరణ పొందుతున్న కృత్రిమ మేధ ఏఐ) ఆధారిత చాట్‌బాట్. టెక్ ప్రపంచంలో కొత్త ఒరవడికి నాంది పలికింది చాట్‌జీపీటీ. సందేహాలు తీర్చుకోవాలన్నా, సంగీత స్వరాలు కూర్చాలన్నా, కవిత్వం రాయాలన్నా, వ్యాసాలు సిద్ధం చేసుకోవాలన్నా, కొత్త ఐడియాలు సృష్టించుకోవాలన్నా, చివరికి ప్రేమలేఖ రాయాలన్నా చలో చాట్‌జీపీటీ అనే పరిస్థితి! మరి చాట్‌జీపీటీయే యాంకర్ అవతారమెత్తితే? ఇద్దరు అత్యంత ప్రముఖులను ఇంటర్వ్యూ చేస్తే? అదే జరిగింది! బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌లకు చాట్‌జీపీటీ పలు ప్రశ్నలు సంధించి వారి నుంచి ఆసక్తికరమైన సమాధానాలు రాబట్టింది. చాట్‌జీపీటీతో తమ ఇంటర్వ్యూను బిల్ గేట్స్ లింక్డ్‌ఇన్‌లో షేర్ చేశారు. తమ సంభాషణ అద్భుతంగా సాగిందన్నారు. రిషి మాటలతో వీడియో మొదలైంది. బిల్ గేట్స్, తాను లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీలో ఉన్నామని, యూకేలో క్లీన్ టెక్నాలజీ రంగంలోని అగ్రశ్రేణి ఆవిష్కర్తలను కలిశామని ఆయన చెప్పారు. తర్వాత గేట్స్ తెరపైకి వచ్చి సంభాషణలో పాలుపంచుకున్నారు. తమను చాట్‌జీపీటీ ఇంటర్వ్యూ చేయబోతోందని అన్నారు.

**ఇలా సాగింది...**

రాబోయే పదేళ్లలో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ, జాబ్ మార్కెట్‌పై టెక్నాలజీ ప్రభావం ఏ మేరకు ఉండబోతోందని చాట్‌జీపీటీ ప్రశ్నించింది. ప్రధానంగా ఆరోగ్య సంరక్షణ, విద్యా రంగాల్లో నిపుణులైన ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉందని, మరింత సమర్థులు అవసరమని గేట్స్ బదులిచ్చారు. ఈ విషయంలో కృత్రిమ మేధ వంటి టెక్నాలజీ సహకరిస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక టెక్నాలజీతో నైపుణ్యాలున్న మానవ వనరులను తయారు చేసుకోవచ్చన్నారు. అనంతరం, ''కాలచక్రంలో మీరు యువకులుగా ఉన్న రోజుల్లోకి, అంటే మీ కెరీర్ ప్రారంభంలో ఉన్న నాటికి వెళ్తే మీకు మీరు ఎలాంటి సలహా ఇచ్చుకుంటారు?'' అంటూ చాట్‌జీపీటీ ఆసక్తికరమైన ప్రశ్న వేసింది. అతిగా ఆలోచించడం మాని వర్తమానంలో జీవించేందుకు మరింతగా ప్రయత్నిస్తామంటూ వారిద్దరూ అంతే ఆసక్తికరంగా సమాధానమిచ్చారు! ''కెరీర్ ఆరంభంలో చాలా ఏళ్ల పాటు వీకెండ్స్, సెలవులంటే నాకు పెద్దగా ఇష్టముండేది కాదు. ఎక్కువగా ఆలోచించేవాన్ని. కష్టపడి పని చేసేవాన్ని. కానీ, అంత అతిగా శ్రమించడం అవసరం లేదని ఇప్పుడు భావిస్తున్నా'' అని గేట్స్ చెప్పారు. దానితో రిషి కూడా ఏకీభవించారు. ''మాది బ్రిటన్‌కు వలస వచ్చిన కుటుంబం. కనుక బాగా పనిచేసి అన్నింటా ముందంజలో ఉండాలని అప్పట్లో ఎంతో ప్రయత్నించేవాడిని. కానీ గతంలోనూ, భవిష్యత్తులోనూ కాకుండా వర్తమానంలోనే జీవించాలని క్రమంగా తెలుసుకున్నా'' అని చెప్పుకొచ్చారు.



**ఏఐని వాడేస్తున్నారు!**

కృత్రిమ మేధ (ఏఐ) మీకెలా ఉపయోగపడుతోందని గేట్స్, రిషిలను చాట్‌జీపీటీ అడిగింది. ఏదైనా నోట్స్ రాసుకున్నప్పుడు దాన్ని మరింత 'తెలివైనదిగా' మార్చడానికి ఏఐ ఉపయోగిస్తున్నట్టు గేట్స్ తెలిపారు. పాటలు, పద్యాలు రాయడానికి కూడా వాడుకుంటున్నానన్నారు. తన కోసం ఏఐ ప్రతివారం 'పీఎం క్వశ్చన్ టైమ్' నిర్వహిస్తే చాలా సంతోషిస్తాని రిషి చెప్పారు.

### రష్యాకు సహకరిస్తే ఆంక్షలు తప్పవు

**చైనాకు అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ హెచ్చరికలు**

**వాషింగ్టన్:** ఉక్రెయిన్‌పై యుద్ధం సాగిస్తున్న రష్యాకు చైనా ఆయుధపరమైన సాయం అందించడం, అమెరికా భూభాగంపైకి నిఘా బెలూన్‌ను పంపించడంపై అమెరికా తీవ్ర నిరసన తెలిపింది. రష్యాకు సాయమందిస్తే ఆంక్షలు తప్పవని హెచ్చరించింది. జర్మనీలోని మ్యూనిక్‌లో జరుగుతున్న సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో భాగంగా అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, చైనా ఉన్నతస్థాయి దౌత్యవేత్త వాంగ్ యీతో శనివారం భేటీ అయ్యారు. 'మా గగనతలంలోకి నిఘా బెలూన్‌ను పంపించడం అంతర్జాతీయ చట్టాలకు, మా సార్వభౌమత్వానికి భంగం కలిగించడమే. ఇలాంటి బాధ్యతారాహిత్య ఘటన పునరావృతం కారాదు' అని బ్లింకెన్ స్పష్టం చేశారని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి నెడ్ ప్రైస్ చెప్పారు. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాకు ఆయుధ, ఇతరత్రా సాయం అందజేస్తే తీవ్ర ఆంక్షలు విధిస్తామని కూడా బ్లింకెన్ చెప్పారు. అయితే ఇలాంటి చర్యలతో అమెరికా తన బలం చూపాలనుకుంటే విరుద్ధ ఫలితాలే వస్తాయని వాంగ్ యీ బదులిచ్చారు.

### దక్షిణ కొరియా సైనిక విన్యాసాలు



**సియోల్:** ఉత్తరకొరియా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం జరిపిన నేపథ్యంలో ఆదివారం దక్షిణ కొరియా, అమెరికా సంయుక్త సైనిక విన్యాసాలు ప్రారంభించాయి. ఆదివారం జరిపిన ఈ విన్యాసాల్లో అమెరికా వ్యూహాత్మక బాంబర్లు పాల్గొన్నాయి. అమెరికా బీ–1బీ బాంబర్లకు దక్షిణ కొరియా ఎఫ్–35ఏ, ఎఫ్–15ఏ, అమెరికా ఎఫ్–16 రక్షణగా నిలిచాయి. రెండు మిత్ర దేశాలు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు తమకున్న రక్షణ సంసిద్ధతను ప్రదర్శించాయని దక్షిణ కొరియా ఒక ప్రకటనలో తెలిపింది. జపాన్‌తో కలిసి అమెరికా సంయుక్త వైమానిక విన్యాసాలు జరుపనుందని జపాన్ వార్తా సంస్థ తెలిపింది. ఉత్తరకొరియా శనివారం రాజధాని ప్యాంగ్యాంగ్ నుంచి లాంగ్–రేంజ్ క్షిపణిని జపాన్ సముద్రం తీరంలోకి ప్రయోగించింది. ఈ క్షిపణి గంటలో 900 కిలోమీటర్లు (560 మైళ్లు) ప్రయాణించింది. జపాన్‌కు చెందిన ఓషిమా దీవికి 200 కిలోమీటర్ల దూరంలోని సముద్ర జలాల్లో క్షిపణి కూలిపోయినట్లు సమాచారం.

### రూ.2,000 కోట్లతో శివసేన పేరు కొనేశారు: రౌత్

**ముంబై:** శివసేన పార్టీ పేరు, ఎన్నికల గుర్తు 'విల్లు, బాణం' కొనుగోలు వెనుక ఇప్పటిదాకా రూ.2,000 కోట్ల డీల్ చోటుచేసుకుందని ఉద్ధవ్ ఠాక్రే వర్గంలోని కీలక నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ ఆరోపించారు. ''ఇది 100 శాతం నిజం. మహారాష్ట్ర ప్రభుత్వానికి సన్నిహితుడైన ఓ బిల్డర్ నాకీ విషయం చెప్పాడు'' అంటూ ఆదివారం ట్వీట్ చేశారు. డీల్‌కు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని, త్వరలో బయటపెడతానని స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఇలాంటి తప్పుడు వ్యవహారాలు గతంలో ఎప్పుడూ జరగలేదని వెల్లడించారు. రూ.2,000 కోట్లు అంటే చిన్న మొత్తమేమీ కాదని తెలిపారు. రౌత్ ఆరోపణలను సీఎం ఏక్‌నాథ్ షిండ్ వర్గం నాయకుడు సదా సర్వాంకర్ ఖండించారు. సంజయ్ రౌత్ క్యాషియరా? అని ప్రశ్నించారు. ఆధారాల్లేని ఆరోపణలు చేయొద్దని, స్వతంత్ర సంస్థలైన సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం ప్రతిష్టను దెబ్బతీయొచ్చని మహారాష్ట్ర మంత్రి, బీజేపీ నేత సుధీర్ మునగంటివార్ హితవు పలికారు. ప్రజాస్వామ్యాన్ని అగౌరవపర్చేవారికి ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు.

### పట్నాలో కాల్పులు.. ఇద్దరు మృతి

**పట్నా:** బిహార్ రాజధాని పట్నాలోని జెథులి గ్రామంలో పార్కింగ్ లాట్ విషయమై ఆదివారం జరిగిన గొడవ కాల్పులకు దారితీసింది. పార్కింగ్ స్థలం విషయంలో రెండు గ్రూపుల మధ్య వివాదం తలెత్తింది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో ఇద్దరు చనిపోగా ఐదుగురు గాయపడ్డారు. ఓ వర్గానికి చెందిన వారు కొన్ని భవనాలకు, వాహనాలకు నిప్పుపెట్టారు. ఇందుకు సంబంధించి పోలీసులు ప్రధాన నిందితుడు, మరో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

# శిథిలాల కింద 12 రోజులు...

### ప్రాణాలతో భార్యాభర్తలు, కుమారుడు మృతి

**అన్‌టాకియా:** తుర్కియే, సిరియాను భూకంపం కుదిపేసి 12 రోజులు గడుస్తున్నా ఇంకా కొందరు శిథిలాల కింద నుంచి మృత్యుంజయులుగా బయటపడుతున్నారు. హతాయ్ ప్రావిన్స్‌లోని అన్‌టాకియా నగరంలో కుప్పకూలిన అపార్ట్‌మెంట్ శిథిలాల కింద 296 గంటలుగా ఇరుక్కున్న ఒక కుటుంబంలో ముగ్గురిని బయటకు తీసుకువచ్చారు. సిమెంట్ పెళ్లల కింద క్షణమొక యుగంలా గడిపిన ఒక కుటుంబంలోని ముగ్గురి మూలుగులు ఉన్న సహాయ సిబ్బంది వారిని బయటకి తీశారు. వీరిలో భార్యాభర్తలిద్దరికీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తూ ఉంటే వారి 12 ఏళ్ల కుమారుడి ప్రాణాలు మాత్రం వైద్యులు కాపాడలేకపోయారు. రెండు దేశాల్లోనే భూకంప మృతుల సంఖ్య 44 వేలు దాటింది. తుర్కియేలో మొత్తం 11 ప్రావిన్స్‌లకు గాను రెండు తప్ప తొమ్మిది ప్రావిన్స్‌లలో సహాయ చర్యలు నిలిపివేసినట్టు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది.



భూకంప బాధితుల కోసం అమెరికా నుంచి వచ్చిన సహాయ సామగ్రిని టర్కీలోని అడెనా ఎయిర్ బేస్ వద్ద ట్రక్కుల్లోకి చేరేయడంలో యూఎస్ సైనిక సిబ్బందికి సాయం చేస్తున్న ఆ దేశ విదేశాంగ మంత్రి ఆంథోనీ బ్లింకెన్. భూకంప ప్రభావిత ప్రాంతాలను ఆదివారం ఆయన ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు.

# వన్యప్రాణుల వైవిధ్యానికి ఊతం

**12 చీతాల రాకపై మోదీ హర్షం**

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికా నుంచి 12 చీతాల రాకతో మన దేశంలో వన్యప్రాణుల వైవిధ్యానికి మరింత ఊతం లభించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. చీతాల రాకపై కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ చేసిన ట్వీట్‌ను మోదీ ఆదివారం తన ట్విట్టర్ ఖాతాలో ట్యాగ్ చేశారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో 'ప్రాజెక్టు చీతా' మరో మైలురాయికి చేరుకుందని భూపేంద్ర యాదవ్ తన ట్వీట్‌లో వెల్లడించారు. దక్షిణాఫ్రికా నుంచి ప్రత్యేక విమానంలో రప్పించిన 12 చీతాలను శనివారం మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో క్వారంటైన్ ఎన్‌క్లోజర్‌లో చేర్చిన సంగతి తెలిసిందే.

**లద్దాఖ్‌లో జీవనం మరింత సులభతరం**

కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లో ప్రజల జీవనాన్ని మరింత సులభతరంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలూ చేస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. 4.1 కిలోమీటర్ల పొడవైన షిన్‌కున్ లా సొరంగం నిర్మాణానికి రూ.1,681.51 కోట్లు కేటాయించడానికి కేంద్రం అంగీకరించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తూ లద్దాఖ్ ఎంపీ జామ్‌యాంగ్ సెరింగ్ చేసిన ట్వీట్‌ను మోదీ ట్యాగ్ చేశారు.



**ఛత్రపతి ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం**

మరాఠా సామ్రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, ప్రజలకు అందించిన సుపరిపాలన మనకు స్ఫూర్తిదాయకమని ప్రధాని మోదీ కొనియాడారు. ఈ మేరకు ఆదివారం ట్వీట్ చేశారు. శివాజీ జయంతి సందర్భంగా మోదీ ఘనంగా నివాళులర్పించారు.

## అంజన్న సేవలో జడ్జి



కొండగట్టు: సిటీ స్మాల్ కాజెస్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలాగీతాంబ ఆదివారం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు.



## వైరుధ్య.. వివాదం

చందాల దందాలో సీపీఐ(ఎంఎల్) జనశక్తి పార్టీకి పురిటిగడ్డ అయిన రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆ పార్టీ మాజీ నేతల అరెస్ట్ చర్చనీయాంశమైంది.

8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/17.0

## వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. సాయంత్రం చలి పెరుగుతుంది.

# యంత్రాలెన్ని.. పరికరాలెన్ని..

• మార్చి నుంచి గణనకు శ్రీకారం • తదనుగుణ ప్రక్రియకు కసరత్తు
• అన్నదాతకు ప్రయోజనమేనా.. నిధులిస్తారా..? • 2018 నుంచి నిధుల్లేవ్.. పరికరాల్లేవ్

కరీంనగర్ అర్బన్: వ్యవసాయ పరికరాలెన్ని, యంత్రాలెన్ని వంటి వివరాల ఆరా క్రమంలో ప్రభుత్వం సర్వేకు సిద్ధమవుతోంది. ఏఈవో పరిధిలో గణన ప్రారంభం కానుండగా తదనుగుణ కసరత్తు మొదలైంది. మార్చి 1 నుంచి జిల్లాలో సర్వే జరగనుండగా అన్నదాతలకు యంత్రయోగం కలుగుతుందా.. ఇకనైనా నిధులు కేటాయిస్తారా అన్న ఆశలు చిగురిస్తున్నాయి. రైతులు, కమతాలు, పశుసంపద, పరికరాల వివరాలను నమోదు చేయనున్నారు. గతంలో పశు గణన, వ్యవసాయ గణన వేర్వేరుగా జరగగా ఈ సారి ఒకేసారి ఆయాశాఖల భాగస్వామ్యంతో నిర్వహించనున్నారు. కాగా గత ఐదేళ్లుగా వ్యవసాయ యంత్రాలకు నిధులు కేటాయింపు లేకపోగా పథకాలు నామమాత్రమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వ్యవసాయ పరికరాలెన్ని ఉన్నాయనే కోణంలో ఆరా తీస్తుండటం అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 2017 వరకు ఏటా వానాకాలంలో రాయితీ పరికరాలు అందించగా ఆ తరువాత అతీగతిలేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**జిల్లాలో 2015-16లో జరిగిన గణన ప్రకారం**

పవర్ టిల్లర్లు: 192
రోటోవేటర్లు: 2,528
ట్రాన్స్‌ప్లాంటర్లు: 05
ట్రాక్టర్లు: 4,140
హార్వెస్టర్లు: 704
స్ట్రాబేలర్లు(గడ్డి కట్టలు చుట్టేయంత్రం): 13
మల్టీక్రాప్ ప్లాంటర్లు (గింజలు పట్టేది): 13
జీరో టిల్ సీడ్‌డ్రిల్(నాటు వేసేవి): 18
కల్టివేటర్లు: 2,750
కేజ్‌వీల్స్: 1,701
ఇతరాలు: 4,566
పశువులు: 84,399
గేదెలు: 1,00,892
గొర్రెలు: 4,10,703
మేకలు: 83,224
కోళ్లు: 19,54,110



### పెద్దపీట వేసేనా.?

- వ్యవసాయం, అనుబంధ రంగాలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం యాంత్రీకరణను నిర్లక్ష్యం చేయడం శాపంగా మారింది.
- కూలీ ఖర్చులతో పాటు సమయాన్ని ఆదా చేసుకోవాలని రైతులు ఎక్కువగా యంత్రాలపై ఆధారపడుతుండగా రాయితీ పరికరాల కోసం పడిగాపులు తప్పడం లేదు.
- యంత్రాల కోసం దరఖాస్తు చేయడం.. పడిగాపులు కాయడం రివాజుగా మారింది. ప్రతి మార్చి నుంచి మార్చి వరకు ఆర్థిక సంవత్సరం కాగా సదరు గడువులోగా కేటాయించిన నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది.
- రిజర్వేషన్ వారీగా ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలను మండలాలకు కేటాయిస్తారు. తదుపరి మీసేవ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తారు. అనంతరం జిల్లా కమిటీ ద్వారా అమోదం తెలిపి కలెక్టర్ అనుమతితో రైతులకు ట్రాక్టర్లను అందజేయాల్సి ఉంటుంది.
- 2014, 2015 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులను మంజూరు చేయగా 2016 నుంచి మాత్రం కేటాయింపులు ఒకరకంగా, మంజూరు మరోరకంగా ఉంటోంది.
- 2016లో రూ.36కోట్లు కేటాయించగా కేవలం రూ.9.69 కోట్లు మాత్రమే విడుదల చేశారు. 2017లో రూ.8.94కోట్లు కేటాయించగా అందులో సగానికి పైగా నిధులు ఏడాదిన్నర తరువాత విడుదలయ్యాయి. నాలుగు విడతలుగా మూడు నెలలకోసారి నిధులు విడుదల కావాల్సి ఉండగా సదరు ప్రక్రియే లేదు.
- ఏటేటా యంత్ర పరికరాల ధరలు పెరుగుతుండగా కరోనా సమయంలోనూ నియంత్రణ లేకపోవడం దారుణ పరిణామం.
- గతేడాది రోటోవేటర్ ధర రూ.75వేలు ఉండగా ఇప్పుడు రూ.90వేలకు చేరింది. కల్టివేటర్ రూ.24వేలుండగా రూ.30వేలకు చేరింది. కలుపు తీసే యంత్రం రూ.38వేలుండగా రూ.40వేలకు చేరింది. నాగళ్లు రూ.30వేలుండగా రూ.35వేలకు, తైవాన్ స్ప్రేయర్ రూ.18వేలుండగా రూ.20వేలకు ఎగబాకింది.
- కాగా వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో ఎస్సీ, ఎస్టీలకు రాయితీని గరిష్ఠంగా రూ.5లక్షలుగా ఉండేది. ఇతర వర్గాలకు రూ.4లక్షలు. గతంలో మాదిరిగానే రూ.2లక్షలలోపు విలువైన యంత్రాలకు ఏడీఏ పరిధిలో, రూ.2లక్షలు దాటితే జిల్లా కమిటీ పరిధిలో లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుంది.
- మొత్తంగా 50శాతం రాయితీతో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, తదితర పరికరాలు అందజేసేవారు. మాన్యువల్ దరఖాస్తులతో అక్రమాలు చోటుచేసుకోవడంతో 2016 నుంచి మీసేవ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.
- సదరు విధానంలో దరఖాస్తులను స్వీకరించాల్సి ఉండగా నిధులు రాక రైతులు బహిరంగ విపణిలో ట్రాక్టర్లు, పరికరాలను కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఒక్కో ట్రాక్టరుకు రైతు రూ.3లక్షల వరకు నష్టపోవాల్సి వస్తోంది. రాయితీ పథకం అమలైతే కోట్ల వ్యయం తప్పనుంది.

### ఈ సారైనా పథకాలుంటాయా.?

వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగమైన రాష్ట్రీయ కృషి వికాస్ యోజన అయిదేళ్లుగా అటకెక్కింది. 2016లో తొలి విడత మాత్రమే నిధులు కేటాయించగా తదుపరి కార్యాచరణ కరవైంది. ఈ పథకం ద్వారా రైతులకు పరికరాలు, అద్దె ప్రాతిపదికన యంత్రాలను ఇవ్వడం పరిపాటి. పథకానికి రూ.5 కోట్ల వరకు కేటాయించేవారు. ఏళ్లుగా ఆ ఊసే లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అయిదేళ్లుగా నిధుల కేటాయింపు.. మంజూరు ఇలా(రూ.కోట్లలో)**

| ఏదాది | కేటాయింపు | మంజూరు |
|---|---|---|
| 2014 | 11.40 | 11.40 |
| 2015 | 5.64 | 5.64 |
| 2016 | 36 | 9.69 |
| 2017 | 8.94 | 7.82 |
| 2018 | 00 | 00 |
| 2019 | 00 | 00 |
| 2020 | 00 | 00 |
| 2021 | 00 | 00 |
| 2022 | 00 | 00 |

## న్యూస్‌రీల్

### ఫిజికల్ టెస్టులకు 1,082 మంది హాజరు



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ సీటీసీలో జరుగుతున్న పోలీసు ఫిజికల్ టెస్టుల్లో ఆదివారం 1,082 మంది హాజరయ్యారు. 33 మంది వివిధ అనారోగ్యకారణాలు చూపిస్తూ ధ్రువపత్రాలు సమర్పించారు. వారికి అధికారులు వేరే తేదీలు కేటాయించారు. ఫిజికల్ టెస్టులు సీసీ కెమెరాల నిఘాలో కొనసాగుతుండగా పక్రియ మొత్తం హైదరాబాద్‌లోని ఉన్నతాధికారుల కార్యాలయానికి అనుసంధానం చేశారు. అక్కడి నుంచి ప్రతీ ప్రక్రియ మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(పరిపాలన)జి.చంద్రమోహన్, ఏసీపీలు కాశయ్య, కె.శ్రీనివాస్, సత్యనారాయణ, కరుణాకర్‌రావు, సత్యనారాయణ, సి.ప్రతాప్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మునిరామయ్య, సూపరింటెండెంట్ ఏవీఎస్‌చారి, ఎస్‌బీఐ జి.వెంకటేశ్వర్లు, సీఐలు మాధవి, బి.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

### విద్యారంగంపై విదేశీయుల దండయాత్ర




కరీంనగర్: నూతన జాతీయ విద్యా విధానంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీలు చేయడానికి ఎన్‌టీఏ ద్వారా కామన్ ఎంట్రెన్స్ టెస్టులు పెడుతున్నారని, కామన్ స్కూల్ విద్యావిధానం లేనప్పుడు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ఎలా పెడతారని ప్రశ్నించాలని తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, హెచ్‌సీయూ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ– కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నూతన జాతీయ విద్యావిధానం–2020పై విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం బడుగు వర్గాల పిల్లలకు విద్యను దూరం చేసే విధంగా ఉందని అన్నారు. దేశభక్తి గురించి మాట్లాడే కేంద్ర ప్రభుత్వం విదేశీ విశ్వవిద్యాలయాలను ఆహ్వానించడం ద్వంద్వనీతి ద్వంద్వ విధానం కాదా అని ప్రశ్నించారు. జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.ఎల్లయ్య, డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి, యం.రఘుశంకర్‌రెడ్డి, కె.నారాయణరెడ్డి, కె.కిషన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

### షర్మిలను ఎదుర్కొనే ధైర్యం లేకనే అక్రమ అరెస్టులు



విద్యానగర్(కరీంనగర్): వైఎస్సార్ టీపీ అధినేత షర్మిలను రాజకీయంగా ఎదుర్కొనలేకనే బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకుల బ్రిటీష్‌కాలం నాటి పోలీస్ రాజ్యం నడిపిస్తున్నారని అన్నారు. అక్రమార్కులు, భూకబ్జాదారులపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాల్సిన పోలీస్ వ్యవస్థ బీఆర్ఎస్ కనుసన్నల్లో నడుస్తోందని అన్నారు. చట్టపరిధిలో, హైకోర్టు జోక్యం, పోలీసుల అనుమతితో షర్మిల పాదయాత్ర చేస్తుంటే అన్యాయంగా అరెస్ట్ చేసి, అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్.షర్మిల యాత్ర కొనసాగుతుందని అన్నారు. నాయకులు గంటి రాజేశ్వర్, ఎస్‌కే.జావిద్, రాచమల్ల నర్సయ్య, పోలు శ్రీనివాస్, ఇప్పనపెల్లి శేఖర్, లొట్టి సంపత్, గంధిశ్యామ్, పందిల్ల సాయి, మెరుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### 26న జాతీయ కవి సమ్మేళనం

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ ఫిలింభవన్‌లో ఈనెల 26న జాతీయస్థాయి కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు భవానీ సాహిత్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు వైరాగ్యం ప్రభాకర్, వీఎల్.భవానీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడా ప్రచారం పొందని కవులతో పాటు ప్రసిద్ధి చెందిన కవుల గురించి రాసిన కవితలతో రూపొందించిన 'కవన మూర్తులు' కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. అతిథులుగా అడిషనల్ కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్‌లాల్, ఎమ్మెల్సీ సురభివాణీదేవి, దాస్యం సేనాధిపతి, ఎస్సారార్ ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ, గాజోజు నాగభూషణం హాజరు అవుతారని అన్నారు.

### నేటి కంటి వెలుగు శిబిరాలివే..

కరీంనగర్‌టౌన్: జిల్లాలో సోమవారం 48 ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జువేరియా తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని 4, 10, 13, 16, 28, 30, 31, 32, 36, 40, 44, 55 డివిజన్లలో, హుజూరాబాద్ పట్టణంలో 11, 29వార్డులు, మండలంలోని జూపాక, కందుగుల గ్రామాలు, జమ్మికుంట పట్టణంలోని 6, 21, 27 వార్డులు, మండలంలోని పాపక్కపల్లి, వీణవంక మండలంలోని మామిడాలపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తారు. అదేవిధంగా చిగురుమామిడి మండలంలోని లంబాడిపల్లి, రామంచ, చొప్పదండిలోని 6వ వార్డు, చాకుంట, ఇల్లందకుంట మండలంలో వంతడుపుల, కనగర్తి గ్రామాలతో పాటు గంగాధర మండలం గర్షకుర్తి, మల్లాపూర్, లింగంపల్లి గ్రామాల్లో శిబిరాలు ఉంటాయి. రామడుగు మండలం శ్రీరాములపల్లె, మోతె, తిరుమలాపూర్, కొత్తపల్లి పట్టణంలోని 3వ వార్డు, కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్, ఎలబోతారం, జూబ్లీనగర్, మానకొండూరు మండలం మానకొండూర్, గంగిపల్లి, ఊటూర్, సైదాపూర్ మండలంలో ఆరెపల్లి, గుజ్జులపల్లి గ్రామాలు, శంకరపట్నం మండలం తాడికల్, మెట్‌పల్లి గ్రామాలతో పాటు తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్, పోరండ్ల, గన్నేరువరంలోని చొక్కారావుపల్లి గ్రామాల్లో కంటివెలుగు శిబిరాలు నిర్వహిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు.

### నేటి నుంచి పోస్టల్ మేళా

విద్యానగర్(కరీంనగర్): పోస్టల్‌శాఖ అందిస్తున్న వివిధ పొదుపు స్కీమ్‌లపై కరీంనగర్ డివిజన్ వ్యాప్తంగా నేటి నుంచి 24వరకు మేళా నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వై.వెంకటేశ్వర్లు వివరించారు. ఈ మేళాలో తపాలాశాఖలో అందుబాటులో ఉన్న వివిధఖాతాల గురించి ప్రజలకు వివరించి, వారిని ఆయా ఖాతాల్లో సభ్యులుగా చేరేలా ప్రోత్సాహించడం జరుగుతుందని తెలిపారు. ఐదు రోజుల పాటు ప్రతి పోస్టాఫీసు పరిధిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, ప్రజలకు అనుకూలమైన స్కీంలలో చేర్పించేందుకు కృషి చేస్తామని ఆయన వివరించారు. ఆర్థిక చేయూతనిచ్చే పోస్టల్ స్కీంలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. వివరాలకు దగ్గరలోని పోస్టాఫీసులో సంప్రదించాలని సూచించారు.

### ముగిసిన ఎంపిక పోటీలు



కరీంనగర్‌స్పోర్ట్స్: స్థానిక అంబేద్కర్‌స్టేడియంలో ఆదివారం జరిగిన అథ్లెటిక్స్‌ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 100మంది హాజరయ్యారు. వీరికి 400 మీటర్ల పరుగుపందెంలో పోటీలు నిర్వహించారు.ప్రతిభ కనబరిచినవారిని ఈనెల 25, 26 తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రపోటీలకు పంపనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.మహిపాల్, రవి తెలిపారు.



ఆటోల్లో తిరుగు పయనమవుతున్న భక్తులు



ఆదివారం ఖాళీగా క్యూలైన్లు

# వెళ్లొస్తాం.. రాజన్న

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- స్వస్థలాలకు తిరుగుప్రయాణం
- ముగిసిన మహాజాతర
- రెండు రోజుల్లో రూ.కోటి ఆదాయం
- మూడు లక్షలకు పైగా వచ్చిన భక్తులు



స్వస్థలాలకు వెళ్తున్న భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా సాగిన మహాశివరాత్రి వేడుకలు ఆదివారం ముగిశాయి. శుక్రవారం మొదలైన మహాజాతరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. మూడు రోజులపాటు వేములవాడలోనే ఉండి.. మొక్కులు చెల్లించుకున్న భక్తులు ఆదివారం స్వస్థలాలకు తిరుగు ప్రయాణమయ్యారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు గుడి చెరువు కట్ట కింద నుంచి బస్సులు నడిపించారు. రెండు రోజుల్లో రాజన్నకు భక్తుల ద్వారా రూ.కోటి ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**కొనసాగిన భక్తుల రద్దీ**

మహాశివరాత్రి వేడుకలకు వచ్చిన భక్తులు ఆదివారం సైతం రాజన్నను దర్శించుకునేందుకు బారులుతీరారు. శనివారం మొత్తం ఉపవాసం ఉండడంతోపాటు జాగరణ చేపట్టారు. ఆదివారం ఉదయం బద్దిపోచమ్మకు బోనం మొక్కు చెల్లించి ఉపవాసదీక్ష విరమించారు. భక్తుల రాకతో బద్దిపోచమ్మ ఆలయం కిటకిటలాడింది.

**ప్రత్యేక ఆకర్షణగా కల్చరల్ ప్రోగ్రామ్స్**

మహాశివరాత్రి జాతర సందర్భంగా రాష్ట్ర భాషా, సాంస్కృతికశాఖ జాయింట్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆధ్వర్యంలో గుడి చెరువు ఖాళీ స్థలంలో నిర్వహించిన కల్చరల్ ప్రోగ్రామ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ రంగాల కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

**పోలీసులు తిరుగుపయనం**

జాతర బందోబస్తుకు వచ్చిన ఇతర జిల్లాల పోలీసులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం మధ్యాహ్నం రిలీవ్ చేశారు. ఆర్టీసీ బస్సులను ఠాణా వరకు రప్పించి వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసులను వారివారి ప్రాంతాలకు పంపించారు.

**జాతర సక్సెస్‌తో అధికారుల ఖుషీ**

మహాజాతర విజయవంతం కావడంతో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ చంద్రయ్య, అడిషనల్ కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, డీఆర్‌వో శ్రీనివాస్‌రావు, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ సంతృప్తి వ్యక్తం చేశారు. జాతర సక్సెస్‌కు కృషిచేసిన అన్ని విభాగాల వారికి కృతజ్ఞతలు తెలిపారు.

**రూ.కోటి ఆదాయం**

మహాజాతర సందర్భంగా శుక్ర, శనివారాల్లో దాదాపు 3 లక్షలకు పైగా భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. ఉచిత పాస్‌లు, ఉచిత దర్శనాలు పోను రెండు రోజుల్లో భక్తుల ద్వారా రూ.కోటి ఆదాయం సమకూరినట్లు ఆలయ అకౌంట్స్ ఏఈవో ప్రతాప నవీన్ ఆదివారం వివరించారు.

# బిల్లులు.. చిక్కులు!

'కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయురాలు 2021 నవంబరులో అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. మెడికల్ బిల్లుల కోసం అన్ని ధ్రువపత్రాలు జతపరిచి ఎంఈవో ద్వారా ప్రభుత్వానికి నివేదించింది. ప్రభుత్వం నుంచి ట్రెజరీకి రూ.1.60లక్షల బిల్లు సమర్పించారు. 14 నెలలు దాటినా.. మెడికల్ బిల్లుకు సంబంధించిన అమౌంట్ ఇంత వరకు ఆ ఉద్యోగి ఖాతాలో జమ కాలేదు.'

'జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి రెండు నెలలు అనారోగ్యంతో సెలవులో వెళ్లాడు. తిరిగి విధుల్లో చేరిన తర్వాత సెలవుకు సంబంధించి సప్లిమెంటరీ వేతనం కోసం అన్ని పత్రాలు అందజేశారు. మూడు నెలలైనా సెలవు వేతనం మంజూరు కాలేదు. అనారోగ్యానికి చికిత్స కోసం అప్పు తెచ్చాడు. తీర్చేందుకు సెలవు వేతనం అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నాడు.'

- పేరుకుపోయిన బకాయిలు
- డబ్బుల కోసం ట్రెజరీ చుట్టూ చక్కర్లు
- కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఎదురుచూపులు




ట్రెజరీ కార్యాలయం

కరీంనగర్: జిల్లా ట్రెజరీ కార్యాలయం నుంచి బిల్లుల మంజూరుకు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ప్రజాప్రతినిధులకు నెలల తరబడి ఎదురుచూపులే దిక్కవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, కాంట్రాక్టర్ల బిల్లులు దాదాపు కోట్లల్లోనే పెండింగ్‌లో ఉన్నట్లు వినికిడి. అనధికార సమాచారం ప్రకారం 2వేల బిల్లులకు సంబంధించి రూ.వంద కోట్లపైబడి చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. జిల్లా ట్రెజరీశాఖ పరిధిలో సుమారు 9వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు, 12 వేల మందికిపైగా పింఛన్‌దారుల ఖాతాలు ఉన్నాయి. వీరంతా వివిధ అవసరాలకు ఖర్చు చేసిన బిల్లుల కోసం కలెక్టరేట్‌లోని ట్రెజరీ కార్యాలయానికి నిత్యం చక్కర్లు కొడుతూనే ఉన్నారు.

**వేతనాలకే పరిమితం**

జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు తప్ప ఏ బిల్లులు మంజూరు కావడం లేదు. సరెండర్ లీవ్, జీపీఎఫ్, సప్లిమెంటరీ సాలరీస్ లాంటి బెనిఫిట్స్ అందక ఇబ్బందులు పడుతున్నారు. పండుగల అలవెన్స్ ఐదు నెలలుగా రావడం లేదు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలు, డెత్ రిలీఫ్ చెక్కులు పాస్ కావడం లేదు. గ్రామ పంచాయతీలు, లోకల్ బాడీస్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ పనుల చెక్కులన్నీ వెనక్కి పంపిస్తున్నారు.

**డబ్బులు లేవంటూ..**

జనరల్ ఫండ్ నుంచి చేసిన పనులకు సంబంధించిన చెక్కులు సమర్పిస్తే పైసలు లేవని తిరిగి ఇస్తున్నారని సర్పంచులు పేర్కొంటున్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి నాలుగైదు నెలల జనరల్ ఫండ్ బిల్లులు అందాల్సి ఉంది. ట్రెజరీ, ఆర్‌బీఐ క్లియరెన్స్ కోసం నాలుగైదు నెలలు నిరీక్షించాల్సి వస్తుందని, సకాలంలో బిల్లులు రాక ఒక్కోసారి అప్పులు చేయాల్సి వస్తుందని జిల్లాకు చెందిన పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### విడుదల చేయాలి



2020 పీఆర్సీ బకాయిలు పది విడతలకు గాను మూడు మాత్రమే చెల్లించారు. గతేడాది ఆగస్టులో సబ్మిట్ చేసిన సప్లమెంటరీ బిల్లులు, సరెండర్ లీవ్స్, మెడికల్ రీయంబర్స్‌మెంట్స్, టీఎస్ జీఎల్ఐ లోన్స్, అక్టోబర్ 2022 నుంచి జీపీఎఫ్ పార్ట్ ఫైనల్స్ వంటి బిల్లులన్ని ట్రెజరీల్లో ఆమోదం పొంది నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ కావడం లేదు. బిల్లులకు సంబంధించిన నగదును విడుదల చేయాలి.

– ముల్కల కుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

### మంజూరుకు పంపిస్తున్నాం



విడతల వారీగా బిల్లుల చెల్లింపుల కోసం కార్యాలయం నుంచి పంపిస్తున్నాం. ఉద్యోగులకు సంబంధించిన అన్ని బిల్లులను ప్రభుత్వానికి వెంట వెంటనే నివేదిస్తున్నాం. ఈ–కుబేర్‌లో పొందుపరిచి ఉన్న సీరియల్ ప్రకారమే బిల్లులు పాసవుతాయి. ఉద్యోగుల బెనిఫిట్స్‌కు సంబంధించిన బిల్లులు పెండింగ్ లేకుండా పంపిస్తున్నాం.

– నాగరాజు, జిల్లా ట్రెజరీ అధికారి

## కేంద్ర పథకాలను గడపగడపకూ తెలియజేయాలి



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

హుజూరాబాద్‌రూరల్: రైతుల సంక్షేమంకోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను గడపగడపకు తెలియజేసేలా శక్తికేంద్రం ఇన్‌చార్జీలు పనిచేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. హుజూరాబాద్ మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో ఆదివారం బీజేపీ శక్తికేంద్రం స్ట్రీట్‌కార్నర్ సమావేశం మండలాధ్యక్షుడు రాముల కుమార్ ఆధ్వర్యంలో శక్తికేంద్రం ఇన్‌చార్జి భాషవేణి రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వ విజయాలు, కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతీఇంటికి చేరడానికి బీజేపీ శక్తికేంద్రం ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం రైతులకోసం తీసుకున్న అభివృద్ధి చర్యలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రధానమంత్రి కృషి వికాస్ యోజన ద్వారా ఎకరానికి రూ.5వేలు అందిస్తున్నట్లు వివరించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పారిపెల్లి కొండాల్‌రెడ్డి, చందుపట్ల జనార్దన్, చిదురాల శ్రీనివాసరెడ్డి, నరెడ్ల చైతన్యరెడ్డి, బైరెడ్డి సంపత్‌రెడ్డి, మేకల మౌనికరెడ్డి, కంకణాల తిరుపతి, పరుశ రాములు, సాయిచంద్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్

జ్యోతినగర్(రామగుండం): గీతకార్మికుడిపై హత్యాయత్నం చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో ఇద్దరు నిందితులను ఎన్టీపీసీ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ ఫర్టిలైజరేసిటి టౌన్‌షిప్‌లో శనివారం కల్లు గీసే కత్తితో గుర్తుతెలియని వ్యక్తులు కొయ్యడ వెంకన్నపై హత్యాయత్నం చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి కుమారుడు కొయ్యడ సుధాకర్ ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై బి.జీవన్ విచారణ చేపట్టారు. గోదావరిఖని అశోక్‌నగర్‌కు చెందిన ఎస్‌కే సమీర్, గంగానగర్‌కు చెందిన సయ్యద్ వాజిద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### ఏడుగురు పేకాటరాయుళ్ల..

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని బొమ్మకల్ బైపాస్ రోడ్డులో లారీ అసోసియేషన్ కార్యాలయం సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.8,600 స్వాధీనం చేసుకుని కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

### ఆస్పత్రి ఎదుట ఆందోళన

జగిత్యాల: స్థానిక జమ్మిగద్దె ప్రాంతంలోని ఓ ఆస్పత్రిలో చిన్నారి మృతిచెందింది. ఆస్పత్రి నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆదివారం ఆందోళన చేపట్టారు. గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన ఓ చిన్నారి అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఆ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స నిర్వహిస్తుండగానే మరణించింది. దీంతో ఆస్పత్రి వర్గాలు మరో ఆస్పత్రికి పంపించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే చిన్నారి మృతి చెందిందని బంధువులు ఆందోళన చేపట్టారు. సీఐ కిశోర్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి

మంథని: మంథని మండలం లక్కేపూర్ గ్రామ పంచాయతీ పరిధి తోటగోపయ్యపల్లికి చెందిన ఊషణవేణ పోశమ్మ(55) ఆదివారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. పోశమ్మకు పదేళ్లుగా మతిస్థిమితం సరిగా లేదు. ఆస్పత్రిలో చికిత్సకు సహకరించడం లేదు. ఈ క్రమంలో గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందింది. మృతురాలికి భర్త, కూతురు, కుమారుడు ఉన్నారు. భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన శివ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఇరుకుల్ల వంతెన వద్ద ఆదివారం రాత్రి ద్విచక్రవాహనాన్ని ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్ నుంచి ద్విచక్రవాహనంపై భూపాలపల్లికి పోతున్న శివను ఇరుకుల్ల వాగు నుంచి ఇసుకను నింపుకుని రాజీవ్‌రహదారిలోకి రాంగ్‌రూట్‌లో వచ్చిన ట్రాక్టర్ వేగంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివను బ్లూకోల్ట్స్ పోలీసులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలాగే గోపాల్‌పూర్ చౌరస్తాలో ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు ద్విచక్రవాహనదారులు గాయపడ్డారు. చికిత్స కోసం స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

# జనశక్తి మాజీల వైరుధ్య .. వివాదం

- కామారెడ్డి చందాల దందాలో కొత్త కోణం..!
- ఒకే కేసులో నిందితులుగా వైరివర్గాలు
- అరెస్ట్ అయిన నలుగురిలో ముగ్గురు జిల్లావాసులే..
- జనశక్తి అగ్రనేతలపైనా కేసు నమోదు..!
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో చర్చనీయాంశం


జనశక్తి సాయుధ దళం(ఫైల్)


జైలుకు వెళ్లిన లక్ష్మీరాజం అలియాస్ సాగర్

సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్) జనశక్తి పార్టీకి పురిటిగడ్డ అయిన రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆ పార్టీ మాజీ నేతల అరెస్ట్ చర్చనీయాంశమైంది. జనశక్తి మాజీ నక్సలైట్లు చందాలు వసూలు చేస్తున్నట్లు కామారెడ్డి జిల్లా పోలీసులు కేసు నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన నలుగురిలో ముగ్గురు రాజన్న సిరిసిల్ల జిల్లా వాసులు ఉన్నారు. ఇదే కేసులో జనశక్తి పార్టీ అగ్రనేతలు కూర రాజన్న అలియాస్ రాజేందర్ (ప్రస్తుతం చంచల్‌గూడా జైలులో ఉన్నారు), కూర దేవేందర్ అలియాస్ అమర్, విమలక్క, బొమ్మని నర్సింహ అలియాస్ ఆనంద్, సంతోష్‌లను నిందితులుగా పోలీసులు చూపారు. పోలీసులు అరెస్ట్ చేసిన జనశక్తి మాజీ నాయకుడు ఎడ్ల లక్ష్మీరాజం అలియాస్ సాగర్‌కు కూర రాజన్న, అమర్, విమలక్కలకు మధ్య వైరుధ్యాలు ఉన్నాయి. ఒకే కేసులో వైరివర్గాల వారిని నిందితులుగా చూపడం రాజన్న సిరిసిల్ల జిల్లాలో చర్చనీయాంశమైంది. వాస్తవానికి ఒకప్పుడు కూర రాజన్న, అమర్‌లతో కలిసి సాగర్ పని చేశారు. వేర్వేరు ఘటనల్లో ఇరువర్గాల వారిని పోలీసులు అరెస్ట్ చేయడంతో జనశక్తి నేతలు రెండుగా చీలిపోయారు. కానీ కామారెడ్డి జిల్లాలో బీడీ కంపెనీ యజమాని వద్ద చందాలు వసూలు చేసిన ఘటనలో వైరివర్గాలకు చెందినవారు నిందితులుగా ఉండడంపై చర్చ సాగుతోంది.

### సర్పంచ్‌గా సాగర్ ప్రజాజీవనం..

కామారెడ్డి జిల్లా పోలీసులు అరెస్ట్ చేసిన ఎడ్ల లక్ష్మీరాజం అలియాస్ సాగర్ ప్రస్తుతం వీర్నపల్లి మండలం అడవి పదిర గ్రామ సర్పంచ్‌గా, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడిగా ఉన్నారు. గతంలో ఆయన భార్య ఎంపీటీసీగా పని చేశారు. సాగర్ సమీప బంధువు ముస్తాబాద్ మండలం అవునూర్ గ్రామానికి చెందిన జక్కుల యాదగిరి(45) కూడా ఇదే కేసులో అరెస్ట్ అయ్యారు. యాదగిరి మొన్నటి ×సెస్× ఎన్నికల్లో ముస్తాబాద్ మండలంలో డైరెక్టర్ స్థానానికి పోటీ చేశారు. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రికి చెందిన సామల అనసూర్య(57) జనశక్తి మాజీ దళ నాయకుడు గొడ్డలి రామన్న భార్య. రామన్న ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. అనసూర్య బీడీ కార్మిక సంఘంలో పని చేస్తుంది. ఆమెతో పాటు కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం మంథని దేవునిపల్లికి చెందిన వెంకటలక్ష్మి (53) జైలుకు వెళ్లారు.

### బీడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

కామారెడ్డిలో అరెస్ట్ అయిన అనసూర్య, వెంకటలక్ష్మి శ్రామిక శక్తి బీడీవర్కర్ యూనియన్ ప్రతినిధులు. వీరు జనశక్తి అగ్రనేత కూర రాజన్న వర్గంతో సంబంధాలు ఉన్నవారు. దీంతో ఈ కేసులో వారిని కూడా నిందితులుగా చేర్చినట్లు భావిస్తున్నారు. సాగర్, రాజన్నకు మధ్య వైరుధ్యాలు ఉన్నా.. బీడీ వర్కర్స్ యూనియన్ మహిళా నాయకురాళ్లు కూర రాజన్న వర్గం వారు కావడంతో అందరిపైనా పోలీసులు ఎఫ్‌ఐఆర్ నంబరు: 86/2023 నమోదు చేసినట్లు భావిస్తున్నారు.

### వికటించిన చందాలు..

రెండు దశాబ్దాల కిందట సీపీఐ(ఎంఎల్) జనశక్తి సాయుధ దళాలు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో పని చేసేవి. 1990 నుంచి 2005 వరకు ఆ మూడు జిల్లాల్లో జనశక్తి సాయుధ నక్సలైట్లు సమాంతర ప్రభుత్వాన్ని నడిపేవారు. పార్టీ నిర్మాణానికి, ఆయుధాల కొనుగోలుకు జనశక్తి నక్సలైట్లు బీడీ కంపెనీల యజమానులు, కాంట్రాక్టర్లు, వ్యాపారుల వద్ద చందాలు (డబ్బులు) వసూలు చేసేవారు. 2005 తరువాత పోలీసు నిర్బంధంతో నక్సలైట్లు ఉద్యమాలు ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో క్షీణించింది. గతంలో కామారెడ్డికి చెందిన బీడీ కంపెనీ యజమాని చాట్ల నర్సయ్యతో జనశక్తి పార్టీ నక్సలైట్లకు పాత పరిచయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రెండు వర్గాలవారు బీడీ కంపెనీవాళ్లను చందాలు అడిగినట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే పోలీసులకు సమాచారం వెళ్లడం, నలుగురు అరెస్ట్ కావడం, మరో ఐదుగురిని పరారీలో ఉన్నట్లు పోలీసులు చూపడం జరిగినట్లు సమాచారం. ఏది ఏమైనా కామారెడ్డి ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చర్చకు తెరలేపింది.

# తెలంగాణ పోలీస్ సేవలు భేష్


ఆశామాల్వియాకు ఆర్థికసాయం చేస్తున్న ఎస్సై శ్రీనివాస్

పాలకుర్తి(రామగుండం): మహిళల భద్రత, సాధికారతే లక్ష్యంగా మధ్యప్రదేశ్‌లోని నాటారంకు చెందిన జాతీయ క్రీడాకారిణి (మౌంటేనర్) ఆశా మాల్వియా చేపట్టిన దేశవ్యాప్త సైకిల్‌యాత్ర ఆదివారం బసంత్‌నగర్‌కు చేరుకోగా ఎస్సై శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది నవంబర్ 1న మధ్యప్రదేశ్‌లో ప్రారంభమైన సైకిల్ యాత్ర గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మీదుగా సోమవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి ప్రవేశించనున్నట్లు పేర్కొన్నారు. దేశంలోని 28 రాష్ట్రాల్లో సైకిల్‌యాత్ర నిర్వహించి ఆగస్టు 15న ఢిల్లీ చేరుకుని ముగిస్తానని వివరించారు. ఇప్పటివరకు యాత్ర పూర్తయిన 9రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు పోలీసుల సేవలు భేష్‌గా ఉన్నాయన్నారు. ముఖ్యంగా తెలంగాణ పోలీసులు చాలా అప్రమత్తంగా ఉండి సహాయ సహకారాలు అందించడంలో ముందున్నారని వెల్లడించారు. పోలీసుల కుటుంబసభ్యులతో కాసేపు ముచ్చటించిన ఆశామాల్వియాను వారు శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఆశాకు సైకిల్ రిపేర్ ఖర్చుల నిమిత్తం ఎస్సై శ్రీనివాస్ రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. పోలీస్ సిబ్బంది రవీందర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**బాలికలు లక్ష్యంతో ముందుకెళ్లాలి**

జ్యోతినగర్(రామగుండం): బాలికలు లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే దిశగా ముందుకెళ్లాలని క్రీడాకారిణి, మౌంటేనర్ ఆశా మాల్వియా అన్నారు. దేశ పర్యటనలో భాగంగా ఆమె సైకిల్‌పై ఆదివారం ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చేరుకున్న క్రమంలో బీజేపీ మల్కాపూర్‌శాఖ అధ్యక్షుడు మిట్టపల్లి సతీష్‌కుమార్ శాలువాతో సన్మానించారు.

**సైకిల్ యాత్రికురాలికి స్వాగతం**

పెద్దపల్లిరూరల్: సైకిల్ యాత్రికురాలు ఆశామాల్వియాకు పెద్దపల్లిలో పోలీసు సిబ్బంది స్వాగతం పలికారు. కరీంనగర్ సైక్లింగ్ క్లబ్ నాయకులు ఎస్సార్ శేఖర్, రవీందర్ తదితరులు బసంత్‌నగర్ వరకు సంఘీభావ యాత్ర నిర్వహించారు.

# జాతీయస్థాయిలో జిల్లాకు పేరు తేవాలి


నూతన కమిటీ సభ్యులు, క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన మహేశ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): క్రీడల్లో జాతీయస్థాయిలో ఉమ్మడి జిల్లాకు పేరు తీసుకువచ్చేలా కమిటీ సభ్యులు, క్రీడాకారులు కృషి చేయాలని టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ అన్నారు. సుల్తానాబాద్‌లోని శ్రీవాణి పీజీ కళాశాలలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలకు పుట్టినిల్లు సుల్తానాబాద్ అని, చాలామంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన గడ్డ అని వివరించారు. అనంతరం పెద్దపల్లి జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా రాజన్న, ఆలేటి సంపత్‌కుమార్, కరీంనగర్ కార్యదర్శిగా కొరిమి సంతోష్‌కుమార్, రాజన్న సిరిసిల్ల కార్యదర్శిగా గోట్టె శివకుమార్, జగిత్యాల కార్యదర్శిగా మహేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ బ్రహ్మానందం, ఎలక్షన్ ఆఫీసర్ ఆయూబ్‌ఖాన్, కోచ్‌లు దేవేందర్, భానుప్రకాష్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముత్యాల రవీందర్, కళాశాల ప్రిన్సిపాల్ కమలాకర్, స్పోర్ట్స్ క్లబ్ బాధ్యులు కుమార్ కిషోర్, గెల్లు మధుకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎండ్లపల్లిలో విషాదం..

- రోజు వ్యవధిలోనే ఇద్దరి మృతి
- మృతులిద్దరూ వరుసకు అన్నాచెల్లెలు..
- వేర్వేరు కారణాలతో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం


భాస్కర్ (ఫైల్)


సంగీత (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): సొంత అన్నదమ్ముల కుమారుడు, కూతురు.. వేర్వేరు కారణాలతో ఇటీవల ఆత్మహత్యకు యత్నించి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రోజు వ్యవధిలో మృతిచెందడం ఎండ్లపల్లి గ్రామంలో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాచనపల్లి గ్రామ పంచాయతీ పరిధి ఎండ్లపల్లి గ్రామానికి చెందిన ఎండ్ల తిరుపతి, ఎండ్ల సుధాకర్ అన్నదమ్ములు. తిరుపతి కుమారుడు భాస్కర్(28). కొంత కాలంగా లివర్ సంబంధింత వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై ఈనెల 17న పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతిచెందాడు. సుధాకర్ కూతురు సంగీత(20). కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. నొప్పి భరించలేక ఈనెల 17న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందింది. మృతులిద్దరి తండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జమ్మికుంట టౌన్ సీఐ రామచందర్‌రావు తెలిపారు.

### గుండెపోటుతో సింగరేణి కార్మికుడు మృతి


రాజయ్య (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ–2 ఏరియా బేస్ వర్క్ షాప్‌లో ఈపీ ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మారుపాక రాజయ్య (57) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. తోటి కార్మికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజయ్య విధులు ముగించుకుని ఇంటికి వెళ్లాడు. ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు రెఫర్ చేశారు. కరీంనగర్‌కు తీసుకెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా టీబీజీకేఎస్ సంఘంలో మెయింటనెన్స్ సెక్షన్ ఇన్‌చార్జిగా రాజయ్య వ్యవహరించారు. టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, అక్రమ్, రవీందర్, చంద్రయ్య తదితరులు రాజయ్య మృతదేహానికి నివాళి అర్పించారు.

# షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసెలు దగ్ధం


కాలిపోతున్న గుడిసెలు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని జైసేవాలాల్ తండా (నిమ్మపల్లి) గ్రామంలో మల్యాల లింభయ్య, సురేశ్‌లకు చెందిన రెండు పూరి గుడిసెలు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. శనివారం రాత్రి భోజనాలు చేసిన అనంతరం కుటుంబసభ్యులు నిద్రిస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి గుడిసెలకు నిప్పంటుకుంది. కాలుతున్న శబ్దం రావడంతో అందులో ఉన్న వారు మేల్కొని బయటకు పరుగులు తీశారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. రెండు గుడిసెలు, వాటిలోని సామగ్రి పూర్తిగా కాలిపోయి సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. బాధిత కుటుంబాలకు లంబాడి హక్కుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని సర్పంచ్ ఇస్లావత్ రాములు నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.

# లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలవాలి


అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఆర్జీ–2 ఏరియా అగ్రగామిగా నిలవాలని ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఆర్జీ–2 ఏరియాలో పర్యటించారు. ఈసందర్భంగా బొగ్గు ఉత్పత్తి గురించి సమీక్షించారు. వార్షిక లక్ష్యాలకు మరో 40 రోజులే గడువు ఉన్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశంలో ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, ప్రాజెక్టు అధికారి మోహన్‌రెడ్డి, ఇంజినీర్ దుర్గాప్రసాద్, సర్వే అధికారి నర్సింగరావు తదితరులున్నారు.

# మహాశివరాత్రి వేడుకల్లో అపశ్రుతి

- అగ్నిగుండంలో నడుస్తూ అదుపుతప్పి పడిన సర్పంచ్, ఆమె భర్త
- కుమారుడికి సైతం గాయాలు
- పచ్చునూర్‌లో ఘటన
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



అగ్నిగుండంలో పడిపోతున్న సర్పంచ్

మానకొండూర్: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పచ్చునూర్‌లో మహాశివరాత్రి పండుగ సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో అగ్నిగుండాలపై సర్పంచ్, ఆమె భర్త నడుచుకుంటూ వెళ్తుండగా అదుపుతప్పి అందులో పడ్డారు. వారి వెనకాలే నడుచుకుంటూ వెళ్లిన కుమారుడు తల్లిని రక్షించే క్రమంలో అతడికి కూడా గాయాలైనాయి. గ్రామస్తుల వివరాలు.. పచ్చునూర్‌లో ఏటా మహాశివరాత్రి పండుగ రోజు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద శివకల్యాణం, అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ క్రమంలో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణం జరిపించి, తర్వాత అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పూజారి అగ్నిగుండంపై నడుచుకుంటూ వెళ్తుండగా, అతడిని అనుసరిస్తూ సర్పంచ్ నర్మెట్ల వసంత, ఆమె భర్త వీరయ్య అతడి కుమారుడు సాయి, భక్తులు నడుచుకుంటూ అగ్నిగుండం దాటుతున్నారు. సర్పంచ్ వసంత చేతిని ఆమె భర్త పట్టుకొని తొందరగా అగ్నిగుండం దాటే ప్రయత్నం చేయగా, సర్పంచ్ అదుపుతప్పి అగ్నిగుండంలో పడగా, వీరయ్య అగ్నిగుండం అంచున పడ్డాడు. వీరి వెనకాలే వస్తున్న తనయుడు తల్లిని రక్షించే క్రమంలో గాయాలపాలయ్యాడు. క్షతగాత్రులను వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

# ప్రజారోగ్య సంరక్షణే సింగరేణి ధ్యేయం


శిబిరాన్ని పరిశీలిస్తున్న జీఎం వెంకటేశ్వరరావు

రామగిరి(మంథని): సింగరేణి ప్రభావిత, పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్య సంరక్షణే సంస్థ ధ్యేయమని ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పన్నూరులో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి ప్రభావిత గ్రామం పన్నూర్‌లో ఎస్‌ఓటూ జీఎం జి.రఘుపతి అధ్యక్షతన మెగా మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో కంటి, ఎముకల, గుండె, దంత, ఛాతి, చెవి, ముక్కు, గొంతు, స్త్రీ వైద్య, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్‌కు సంబంధించి గ్రామస్తులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరాన్ని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు సందర్శించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ శంకరయ్య, అధికారులు సంఘం అధ్యక్షుడు మత్స్యగిరి నరేందర్, డీవైసీఎంవో డాక్టర్ కిరణ్‌రాజ్, ఏరియా ఇంజినీర్ సీతారామం, ప్రాజెక్ట్ అధికారి ఎస్.రమేష్, ఇంజినీర్ శ్రీనివాస్, పర్సనల్ డీజీఎం విలాస్ శ్రీనివాస్ పొద్దర్, మేనేజర్ ఉదయ్ హరిజన్, పర్యావరణ అధికారి కిషన్, సర్పంచ్ అల్లం పద్మ, జెడ్పీటీసీ మ్యాదరవేణి శారద, వైస్ ఎంపీపీ కాపరబోయిన శ్రీదేవి, ఎంపీటీసీ చిందం మహేష్, జీఎం కమిటీ సభ్యుడు పర్శ బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

# 103 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కరీంనగర్‌క్రైం: అక్రమంగా నిల్వ ఉంచిన 103 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల వివరాలు.. ఇతర ప్రాంతాలకు రవాణా చేసేందుకు కరీంనగర్ బైపాస్ రోడ్డులోని లారీ అసోసియేషన్ కార్యాలయం సమీపంలోని గుడిసెల్లో రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచారని సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. విచారణలో బొమ్మకల్ ప్రాంతానికి చెందిన గంట కొమురయ్య (40), గంట ఎల్లవ్వ (50), గంట ఎల్లవ్వ (35), గంట వెంకటి (50), బత్తుల రాజవ్వ (40), గంట సరవ్వ (50) నిందితులు అని తేలడంతో అదుపులోకి తీసుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి బియ్యాన్ని కిలోకు రూ.12 చొప్పున కొనుగోలు చేసి కోతిరాంపూర్‌కు చెందిన వ్యాపారికి విక్రయించేందుకు నిల్వ ఉంచామని నిందితులు పేర్కొన్నారు. వీరి నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని సదరు వ్యాపారి ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తాడని చెప్పారు. పట్టుబడిన బియ్యంతోపాటు నిందితులను కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విజయసారథి ఆధ్వర్యంలో జరిగిన దాడిలో ఇన్‌స్పెక్టర్లు సృజన్‌రెడ్డి, ఉం.రవికుమార్, ఎస్‌ఐ సాంబమూర్తి, ఏఆర్‌ఎస్‌ఐ నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


# సమస్యల పరిష్కారానికి సమ్మెకైనా సిద్ధం


సమావేశంలో అఖిలపక్ష కమిటీ నాయకులు

గోదావరిఖని(రామగుండం): మైనింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం సమ్మెకైనా సిద్ధమని కార్మిక సంఘాల అఖిలపక్ష కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రక్షణ చర్యలను పర్యవేక్షించడానికి వినియోగించాల్సిన మైనింగ్ సిబ్బందిని ఉత్పత్తి సాధన కోసం ఒత్తిడి చేయడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. భూపాలపల్లి కేటీకే ఓసీపీ–3 ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టులో జరిగిన ప్రమాదానికి బాధ్యులను చేస్తూ షార్ట్ ఫైరర్ సాదుల ప్రకాష్‌ను డిస్మిస్ చేయడం, ఓవర్‌మెన్ శ్రీకాంత్‌ను డీప్రమోట్ చేయడం, సీనియర్ సర్దార్ వెంకటేశ్వర్లుకు 8 ఇంక్రిమెంట్ల కోత విధించడం అన్యాయమన్నారు. మైనింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం మూకుమ్మడిగా క్యాజువల్ లీవ్ పెట్టాలని కార్మిక సంఘాలు సూచించాయి. దీనిని మైనింగ్ సిబ్బంది ఏకగ్రీవంగా ఆమోదించారు. యాజమాన్యంతో తక్షణమే సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కార్మిక నాయకులు హామీ ఇచ్చారు. మైనింగ్ స్టాఫ్ చేపట్టిన పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు కార్మిక నాయకులు వెల్లడించారు. మైనింగ్‌స్టాఫ్ నాయకుడు మాదాసు రామమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనక్ ప్రసాద్, సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఉద్యోగుల సంఘం నాయకుడు గట్టయ్య, నాయకులు లక్ష్మీపతిగౌడ్, ఖయ్యూం, కుమారస్వామి, మైనింగ్ స్టాఫ్ నాయకులు అనిల్‌కుమార్, అక్రమ్, సాయికుమార్, మణికంఠ, అయాజ్, శ్రీనివాస్, దొంతల శ్రీనివాస్, అద్దు శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ క్యూఆర్ కోడ్

- తాజాగా నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇంటర్నెట్‌తో అనుసంధానిస్తే గూగుల్ మ్యాప్ ద్వారా దారి చూపించే అవకాశం
- కరీంనగర్‌లో 79,182 ఇళ్లు



**కరీంనగర్ సిటీ:** పట్టణాలు, నగరాల్లో ఇంటి నంబర్ కనుక్కోవడం చాలా కష్టం. ఈ క్రమంలో ఇంటి నంబర్ల ఆచూకీని సులభతరం చేసే ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తాజాగా క్యూఆర్ కోడ్‌తో కూడిన ఇంటి నంబర్లు కేటాయించాలని నిర్ణయించింది. వాటిని ఇంటర్నెట్‌తో అనుసంధానిస్తే సులభంగా గూగుల్ మ్యాప్ ద్వారా దారి చూపించే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం 2019లో స్మార్ట్‌సిటీల్లోని ఇళ్లను డిజిటలైజేషన్ చేయాలని ఆదేశించినా అప్పుడు సాధ్యం కాలేదు. తాజాగా ఈ అంశంపై మళ్లీ తెర మీదకి వచ్చింది.

**కొన్ని నెలల క్రితం సమావేశం..**

ఉన్నతాధికారుల నుంచి సరైన ఆదేశాలు లేకపోవడంతో కరీంనగర్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రారంభం కాలేదని మున్సిపల్ అధికారులు అంటున్నారు. కొన్ని నెలల క్రితం మేయర్ సునీల్‌రావు, కమిషనర్ సేవ ఇస్లావత్ ఆధ్వర్యంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వెంటనే ఇంటి నంబర్ల డిజిటలైజేషన్ విధానం అమలు చేయాలని నిర్ణయించారు. అయితే అది కాగితాలకే పరిమితమైంది.

**కార్పొరేషన్‌లో 60 డివిజన్లు..**

కరీంనగర్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లు, 3.85 లక్షలకు పైగా జనాభా, 79,182 ఇళ్లు ఉన్నాయి. ప్రతి నెలా కొత్తగా సుమారు 2 నుంచి 3 వేల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏ నివాసం ఎక్కడుందో గుర్తించడం సాధ్యమవడం లేదు. కొన్నిచోట్ల ఇంటి నంబర్లు లేవు. మరికొన్ని చోట్ల ఒకే నంబర్‌పై రెండు ఇళ్లు ఉన్నాయి.

**పూర్తవని ఆధార్ అనుసంధానం..**

డిజిటల్ ఇంటి నంబర్ల ప్రక్రియలో భాగంగా తొలిసారి ఇంటి యజమాని ఆధార్ నంబర్‌ను ప్రస్తుతం ఉన్న ఇంటి నంబర్‌కు అనుసంధానం చేయాలని 2019 ఫిబ్రవరిలో ఆదేశాలిచ్చారు. ఇలా చేయడం వల్ల ఇంటి నంబర్లు ఉన్న ప్రాంతాలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది. కానీ ఈ ప్రక్రియ కరీంనగర్‌లో 50 శాతం కూడా పూర్తి కాలేదు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, డిజిటల్ ఇంటి నంబర్లు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

**కమిటీ ఏర్పాటు..**

రాష్ట్రంలో తెలంగాణ మున్సిపల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద డిజిటల్ ఇంటి నంబర్లు కేటాయించడానికి కసరత్తు చేస్తున్నారు. దీన్ని అధ్యయనం చేయడానికి ఇప్పటికే ఒక కమిటీ వేశారు. నివేదిక ఆధారంగా మార్పులు చేసి, డిజిటల్ ఇంటి నంబర్లను అమల్లోకి తీసుకురానున్నారు. ఈ ప్రక్రియలో ఇంటికో క్యూఆర్ కోడ్ ఇస్తారు. ఇందులో ఇంటి డోర్ నంబర్, వీధి, నగరం, రాష్ట్రం, పోస్టల్ పిన్‌కోడ్, గూగుల్ మ్యాప్ లొకేషన్, యూఆర్ఎల్ లింక్ వంటి సమస్త సమాచారం ఉంటుంది. దీన్ని స్కాన్ చేస్తే గూగుల్ మ్యాప్ సహకారంతో సులభంగా ఇంటికి చేరుకునే అవకాశం ఉంటుంది.

**త్వరలో డిజిటలైజేషన్**



స్మార్ట్‌సిటీలో భాగంగా త్వరలో ఇంటి నంబర్ల డిజిటలైజేషన్‌ను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ చేపడుతాం. పలు నగరాల్లో ఇది విజయవంతమైందన్న సమాచారం ఉంది.

– వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

## ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి



నివాళి అర్పిస్తున్న రోహిత్‌రావు, నాయకులు



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

**కొత్తపల్లి:** అవినీతి, అన్యాయాలపై విరోచిత పోరాటం చేసి, దేశ ప్రజల గుండెల్లో నిలిచిన ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలని కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు మేనేని రోహిత్‌రావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక పాలనపై తమ పార్టీ పోరాటం చేస్తోందని తెలిపారు. శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని, ఆదివారం కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్ మినీ ట్యాంక్‌బండ్‌పై గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ.. ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి, ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. కిసాన్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు సిరిపురం నాగప్రసాద్, యూత్ కాంగ్రెస్ నాయకులు బూస సందీప్, బోనా ల సంపత్, వేముల అనిల్, మెరుగు మల్లేశం, గణేశ్, బూస ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్‌రూరల్:** దుర్శేడ్‌లోని శివాజీ విగ్రహానికి కాంగ్రెస్ కరీంనగర్ మండల కో–ఆర్డినేటర్ మేనేని రోహిత్‌రావు పూలమాల వేసి, నివాళి అర్పించారు. పార్టీ బ్లాక్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు బుర్ర హరీశ్‌గౌడ్, క్రాంతికుమార్, అమర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గోపాల్‌పూర్‌లో శివాజీ చిత్రపటానికి నివాళి అర్పించారు. సర్పంచు ఊరడి మంజుల, వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరడి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శివాజీ మహరాజ్ దేశభక్తికి నిదర్శనం**

**కరీంనగర్‌టౌన్:** ఛత్రపతి శివాజీ మహరాజ్ దేశభక్తికి, ధైర్యానికి నిదర్శనమని బీజేపీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా ఒకటో డివిజన్ తీగలగుట్టపల్లిలో వేడుకలు నిర్వహించారు. కరీంనగర్‌లోని వృద్ధులు, వికలాంగుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కూర మహిపాల్ రెడ్డి, కైలాస నవీన్, వేణు, గడప భాస్కర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

**పద్మనగర్ బైపాస్ రోడ్డులో..**

పద్మనగర్ బైపాస్ రోడ్డులో గల శివాజీ విగ్రహానికి వెస్ట్ జోన్, నార్త్ జోన్ బీజేపీ నాయకులు నివాళి అర్పించారు. పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణకు శివాజీ అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. కరీంనగర్ 18వ డివిజన్ రేకుర్తిలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. నాయకులు జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణ రెడ్డి, గుంజేటి శివకుమార్, తిప్పర్తి బ్రహ్మం, సిద్ధి సంపత్, పాశం నరసింహారెడ్డి, చంద్రగిరి వేణు, కైలాస నవీన్, మైపాల్ రెడ్డి, కంజర్ల శ్రీకాంత్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హజ్ హౌస్, ఈద్గాకు స్థలం కేటాయించాలి



మాట్లాడుతున్న గులాం అహ్మద్ హుస్సేన్


**విద్యానగర్:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముస్లింల సౌకర్యం కోసం కరీంనగర్ శివారు ప్రాంతంలో మినీ హజ్‌హౌస్, ఈద్గా కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఎంఐఎం కరీంనగర్ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కోరారు. ఇందుకోసం రాష్ట్ర సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాత్రి కరీంనగర్‌లోని 26వ డివిజన్‌లో హలాతే హజిరా డివిజన్ సందర్శన కార్యక్రమంతోపాటు, పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఐఎం కృషి ఫలితంగానే పద్మనగర్ శివారులో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.2 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. రాబోయే 3 నెలల్లో పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. ఏడాదిలో రెండు నెలలు హజ్ యాత్ర కోసం మినీ హజ్ హౌస్ ఉపయోగపడుతుందని, మిగతా పది నెలలు ముస్లిం బాలబాలికలకు, విద్యార్థుల కోసం నాలెడ్జ్ సెంటర్, కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్, మహిళలకు స్వయం ఉపాధి కేంద్రంగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఈ నెల 25, 26వ తేదీల్లో ముంబయిలోని ముంబ్రా ప్రాంతంలో జరిగే ఎంఐఎం పార్టీ జాతీయ స్థాయి రాజకీయ సమ్మేళనానికి ఉమ్మడి జిల్లాలోని ఎంఐఎం కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తరలిరావాలని కోరారు. మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, కార్యదర్శులు హఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, ఖమరుద్దీన్, కోశాధికారి ఇబ్రహీం బియాబాని, కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, అతినా, అలీబాబా, అజర్ దబీర్, డివిజన్ అధ్యక్షుడు కల్లెపల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన

**శంకరపట్నం(మానకొండూర్):** రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన కొనసాగుతోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి ఆరోపించారు. తాడికల్, కాచాపూర్ గ్రామాల్లో ఆదివారం బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నామని చెప్పుకునే ప్రభుత్వం ఏడు గంటలు కూడా ఇవ్వడం లేదని, దళిత బంధు పేరిట దళితులను మోసం చేసిందని, నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, జిల్లా అధికార ప్రతినిధి సమ్మిరెడ్డి, జైపాల్, నరేందర్, రాజిరెడ్డి, సతీష్, రాజేందర్, అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

**రామడుగు(చొప్పదండి):** రంగసాయిపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు ఆదివారం స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరాచారి హాజరై, మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు జిన్నారం విద్యాసాగర్, కట్ల రవీందర్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, పోచంపల్లి నరేష్, శ్రీనివాసాచారి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలి



**శంకరపట్నం(మానకొండూర్):** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. కేశవపట్నంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న బీఆర్ఎస్ నుంచి చాలామంది ఈ నెల 20న కేశవపట్నంలో సీపీఐ, అనుబంధ సంఘాల్లో చేరనున్నారని తెలిపారు. 23న రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కరీంనగర్‌లో నిర్వహించే ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అదానీ కంపెనీలకు వత్తాసు పలుకుతూ ఎల్ఐసీ వంటి ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేయాలని చూస్తోందని ఆరోపించారు. పార్టీ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, సదానందం, రవి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

### పవర్ కట్ ప్రాంతాలు



**కొత్తపల్లి:** సబ్‌స్టేషన్లలో నెలవారీ విద్యుత్ మరమ్మతు దృష్ట్యా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 33/11 కేవీ ఎస్సారార్ కళాశాల, బ్యాంక్ కాలనీ, వావిలాలపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని సంతోష్‌నగర్, భాగ్యనగర్, జ్యోతినగర్, కొత్త లేబర్ అడ్డా, సెయింట్ జాన్స్ స్కూల్, విద్యానగర్, ఆర్టీసీ వర్క్‌షాప్ వెనక ప్రాంతం, బాలాజీ సూపర్ మార్కెట్, బ్యాంక్ కాలనీ, మెహర్‌నగర్, వరలక్ష్మీనగర్, ఎస్సారార్ కళాశాల రోడ్, కోర్టు రోడ్, ఆర్టీసీ వర్క్‌షాపు, రెడ్డి హాస్టల్, సీతారాంపూర్, చైతన్యపురి, హిందూపురికాలనీ, వావిలాలపల్లి, జ్యోతినగర్, సివిల్ ఆసుపత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1, 2 ఏడీఈలు ఎస్.నరేందర్, ఎం.సుధీర్ కుమార్ తెలిపారు.

**కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ పరిధిలో..**

విద్యుత్ సబ్‌స్టేషన్లలో నెలవారీ విద్యుత్ మరమ్మతు దృష్ట్యా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 33/11 కేవీ నగునూర్, శాతవాహన యూనివర్సిటీ, బద్దిపల్లి, ఆసిఫ్‌నగర్, ఖాజీపూర్ సబ్ స్టేషన్ల పరిధిలోని నగునూర్, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, శ్రీరాంనగర్ కాలనీ, బద్దిపల్లి, నాగులమల్యాల, ఆసిఫ్‌నగర్, ఎలగందుల, కమాన్‌పూర్, ఖాజీపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## శ్రీఅమృతేశ్వర మహాశివాలయంలో అన్నపూజ



**కొత్తపల్లి:** మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం రేకుర్తిలోని శ్రీఅపర్ణ అమృతేశ్వర మహాశివాలయంలో పరమేశ్వరునికి అన్నపూజ నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం జరిపి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులను సన్మానించారు. కార్పొరేటర్లు సుదగోని మాధవి, గుగ్గిళ్లపు జయశ్రీ, కమిటీ సభ్యులు, భక్తులు హాజరయ్యారు. గుజ్జుల ప్రసాదరెడ్డి, కాసిడి రాజశేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుదగోని కృష్ణగౌడ్, జక్కుల నాగరాజు, కొండాల్‌రావు, శంకరయ్య, రాజిరెడ్డి, రజనీకాంత్ రెడ్డి, సుదగోని నారాయణగౌడ్, అజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

## అనుమతి లేని ఆస్పత్రులపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న తిరుపతి

**కరీంనగర్:** సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ, సంతాన సాఫల్య కేంద్రాలు రకరకాల తోక పేర్లు పెట్టుకుంటూ పేద రోగులు, పసిపిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ ఆస్పత్రులను గుర్తించి, వాటి రిజిస్ట్రేషన్ రద్దుకు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నరేష్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రోగం నయం కావాలని కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రులకు వస్తే అర్హతలు లేని వైద్యులతో చికిత్స అందిస్తున్నారని ఆరోపించారు. మరికొందరు హాస్పిటల్స్ నెలకొల్పి, కన్సల్టేషన్ ఫీజు వైద్యులకు రూ.500 ఇచ్చి, రోగుల వద్ద నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. డబ్బే పరమావధిగా అనవసరమైన పరీక్షలు చేస్తుండటంతో సకాలంలో వైద్యం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతి లేని, రెన్యువల్ కాని ఆస్పత్రుల యాజమాన్యాలతో జిల్లా వైద్యాధికారులు కుమ్మక్కవుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా వైద్యశాఖ మంత్రి, కలెక్టర్ తక్షణమే స్పందించి, నిజ నిర్ధారణ కమిటీలు ఏర్పాటు చేసి, ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించాలని కోరారు. లేనిపక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లక్‌పతి, నాయకులు నవీన్, అశోక్, నితిన్, విజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## భట్రాజు కులబాంధవులు సమష్టిగా ఉండాలి



కార్పొరేటర్ శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న నాయకులు

**కరీంనగర్:** భట్రాజు కులబాంధవులు సమష్టిగా ఉండాలని, హక్కుల సాధనకు ముందుకుసాగాలని భట్రాజు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు సీహెచ్.సత్యనారాయణ రాజు, అంబటి రవీందర్‌రాజు, జీవన్ రాజు తదితరులు పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన భట్రాజు సంఘం సమావేశంలో మాట్లాడారు. జిల్లా నూతన కమిటీ భట్రాజు కులబాంధవుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. స్థానిక కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ కృషితో కమ్యూనిటీ భవనానికి ప్రభుత్వం స్థలంతోపాటు రూ.20 లక్షల రూపాయలు కేటాయించిందని తెలిపారు. అంతకుముందు జిల్లా అధ్యక్షుడిగా అంబటి మధుసూదన్ రాజు, ప్రధాన కార్యదర్శిగా కాంచనపల్లి మహేందర్ రాజు, యువజన సంఘం అధ్యక్షుడిగా చెన్నమాధవుని కృష్ణకాంత్, ప్రధాన కార్యదర్శిగా పెద్దిరాజు ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చెన్నమాధవుని పవనసుతరాజు, శ్రీనివాస్, సత్యనారాయణ, పృథ్వీరాజు, శ్రీనివాస్, మహేందర్, వీరమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ప్రభాకర్‌యాదవ్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రభాకర్, నాయకులు

**కరీంనగర్‌రూరల్:** రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని, ఇందుకోసం ప్రజలను చైతన్యపరచాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ప్రభాకర్ యాదవ్ కోరారు. ఆదివారం కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌లో నిర్వహించిన ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర నిధులతో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి పేరిట రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.సంతోష్‌కుమార్, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు పాశం తిరుపతి, ఆసిరి తిరుపతి, చిందం అశోక్, రాంచంద్రం, శ్రీధర్, పద్మ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. చామనపల్లిలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కల్యాణ్‌చంద్ర, శక్తి కేంద్రం ఇన్‌చార్జి కుమార్, నాయకులు సంపత్, శేఖర్, మహేశ్, రా జు, శ్రీనివాస్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల పోస్టులపై కేసులేవీ?



పరంధాం కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌రావు, నాయకులు

**కరీంనగర్‌టౌన్:** రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి చట్టం చుట్టంలా మారిందని బీజేపీ కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. ఆ పార్టీకి వ్యతిరేకంగా కరీంనగర్ బీజేపీ సోషల్ మీడియా నాయకుడు పరంధాం పెట్టిన పోస్టుపై కేసు పెట్టి, బీజేపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేయాలనుకోవడం అవివేకమని పేర్కొన్నారు. కరీంనగర్ పట్టణానికి చెందిన పరంధాంను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో బాధిత కుటుంబసభ్యులను ఆదివారం కలిసి, మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్వేచ్ఛాయుత వాతావరణం లేకుండా చేస్తోందని మండిపడ్డారు. పోలీసులను ఉపయోగించి, ప్రతిపక్షాలను, ప్రజలను భయపెట్టాలనుకోవడం మూర్ఖత్వమన్నారు. బీజేపీపై బీఆర్ఎస్‌వాళ్లు పెట్టిన పోస్టులపై అనేక ఆధారాలతో ఫిర్యాదులు చేస్తున్నామని తెలిపారు. వారిపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. పరంధాం విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్‌కుమార్ సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడటంతో విడిచిపెట్టారని పేర్కొన్నారు. పార్టీ నార్త్ జోన్ అధ్యక్షుడు పాదం శివరాజు, నాయకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నెల రోజులుగా నీటి తిప్పలు



కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ గ్రామస్తులు నెల రోజులుగా నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హౌజింగ్ బోర్డుకాలనీ నుంచి గ్రామానికి సరఫరా చేస్తున్న తాగునీటి ప్రధాన పైపులైన్ పగిలిపోయింది. మరమ్మతు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా బొమ్మకల్‌తోపాటు ప్రియదర్శినికాలనీ, లక్ష్మీనగర్ ప్రాంతాలకు తాగునీరందక పోవడంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రెండు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. అవి కూడా సరిపోవడం లేదని, స్థానికంగా ఉన్న చేతిపంపులను ఆశ్రయిస్తున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తాగునీటి సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్

### క్లుప్తంగా

## ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సాక్షి ఎఫెక్ట్

నగరంలో ఆటోవాలాల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. 'ఆటోలదే హవా' శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన చిత్ర కథ వార్తకు ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. తెలంగాణ చౌక్‌లో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయవద్దని ఆదేశించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

## ఎమ్మెల్యే సాయన్న మృతికి మంత్రి గంగుల సంతాపం

**కరీంనగర్:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మృతికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

## రేవంత్‌రెడ్డి పాదయాత్రలో యూత్ కాంగ్రెస్ నాయకులు



పాదయాత్రలో రేవంత్‌రెడ్డితో ప్రశాంత్

**కొత్తపల్లి:** టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి చేస్తున్న హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో కొనసాగుతోంది. ఆదివారం కరీంనగర్ నియోజకవర్గ నాయకుడు మేనేని రోహిత్‌రావు ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్ గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బూస ప్రశాంత్, నాయకులు సిరిపురం నాగప్రసాద్ తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.

## సేనాధిపతికి అమృతలత జీవన సాఫల్య పురస్కారం

**కరీంనగర్‌కల్చరల్:** ప్రముఖ రచయిత్రి, విద్యావేత్త డాక్టర్ అమృతలత తన సంస్థ తరఫున 2023 సంవత్సరానికి గాను సాహిత్య విమర్శ విభాగంలో కరీంనగర్‌కు చెందిన ప్రముఖ కవి, విమర్శకులు దాస్యం సేనాధిపతిని రాష్ట్రస్థాయి అమృతలత జీవన సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 5న నిజామాబాద్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, గాజుల రవీందర్, నంది శ్రీనివాస్, వైరాగ్యం ప్రభాకర్, గాజోజు నాగభూషణం, వేణుశ్రీ, కల్వకుంట రామకృష్ణ, కందుకూరు అంజయ్య, కూకట్ల తిరుపతి తదితరులు సేనాధిపతికి అభినందనలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి బాల మేధావి అవార్డుకు ఎంపిక



స్నితిక్

**కరీంనగర్‌కల్చరల్:** అస్తిత్వం సంస్థ 2023 సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయి బాల మేధావి అవార్డుకు కరీంనగర్‌కు చెందిన బాల కథారచయిత మాస్టర్ సాయిని స్నితిక్‌ను ఎంపిక చేసిందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డు అందించనున్నట్లు పేర్కొన్నారు. స్నితిక్ రాసిన ట్వెల్వ్ పెరల్స్ ఆంగ్ల కథా సంకలనానికి పురస్కారం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కవులు, రచయితలు అతన్ని అభినందించారు.

**ఇండియన్ ఐకాన్ అవార్డుకు శ్రీనివాస్..**

రచయిత, చిత్రకారుడు, గంగాధర మండలంలోని మల్లాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మియాపురం శ్రీనివాస్‌ను సామాజిక, కళారంగాల్లో చేస్తున్న సేవలకు గాను విజ్‌డమ్ చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్‌వారు ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు–2023కి ఎంపిక చేసినట్లు సంస్థ బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం అవార్డు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. శ్రీనివాస్‌ను రచయితలు, చిత్రకారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## క్రీడలతో మానసికోల్లాసం

**జమ్మికుంట(హుజూరాబాద్):** క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతాయని జమ్మికుంట టౌన్ సీఐ రామచందర్‌రావు అన్నారు. జమ్మికుంట మండలంలోని కోరపల్లిలో పల్లె బక్కస్వామిగౌడ్ జ్ఞాపకార్థం పల్లె విజయలక్ష్మి, లవకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో వారం రోజులుగా గ్రామస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా సీఐ హాజరై మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికితీసేందుకు క్రీడలు దోహదపడుతాయని అన్నారు. అనంతరం విజేతలకు రూ.10 వేల చెక్కును బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రంజిత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### 'ఏపీ ఇంధన పొదుపు'పై జర్మనీ అధ్యయనం

సాక్షి, అమరావతి: ఇంధన పొదుపు, సామర్థ్య కార్యక్రమాల్లో జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన ఆంధ్రప్రదేశ్.. తాజాగా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. సోలార్, విండ్ తదితర పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ముమ్మరంగా చేపట్టడం, పరిశ్రమల్లో ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలు వంటి అంశాల్లో ఏపీ సాధించిన విజయాలు జర్మనీని ఆకర్షించాయి. వీటిపై అధ్యయనం చేయడానికి కన్సల్టెన్సీ ప్రైస్ వాటర్ కూపర్స్ (పీడబ్ల్యూసీ)ను.. జర్మన్ కార్పొరేషన్ ఫర్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ నియమించింది. ఈ అధ్యయనంలో భాగంగా పీడబ్ల్యూసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రభాత్ నేతృత్వంలోని బృందం రెండు రోజులుగా విజయవాడలో ఇంధన పరిరక్షణ మిషన్, నెడ్ క్యాప్ అధికారులతో చర్చిస్తోంది. పారిశ్రామిక రంగంలో ఏపీ సాధించిన విజయాలను అధ్యయనం చేస్తోంది. ఏపీ ఇంధన పరిరక్షణ మిషన్ 'టార్చ్ బేరర్' అంటూ ప్రభాత్ అభినందించారు.

### 23న టీడీపీలోకి కన్నా!

గుంటూరు మెడికల్: బీజేపీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ఈ నెల 23న టీడీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది. ఆదివారం గుంటూరులోని తన నివాసంలో కార్యకర్తలు, అనుచరులతో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ బాధ్యతలు కన్నాకు అప్పగించే అవకాశాలున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.

### పరమేశ్వరుడిని కించపరిచేలా ప్రచారమా?

వైఎస్సార్‌సీపీపై బీజేపీ నేతల విమర్శలు

సాక్షి, అమరావతి/ ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): అధికార వైఎస్సార్‌సీపీ అధికారిక ట్విటర్ ఖాతా ద్వారా పరమేశ్వరుడిని కించపరిచేలా ప్రచారం చేస్తోందని ఏపీ బీజేపీ తప్పుపట్టింది. ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు తదితర నేతలు ఆదివారం వైఎస్సార్‌సీపీ వైఖరిపై విమర్శలు గుప్పించారు. ఏపీ వ్యాప్తంగా శివాలయాల వద్ద ఆందోళన చేపట్టాలని పిలుపునివ్వగా, అక్కడక్కడ బీజేపీ నేతలు శివాలయాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశాఖలో జీవీఎల్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హిందువుల మనోభావాలను దెబ్బ తీస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బాల శివుని వేషధారణలో ఉన్న వీధి బాలుడికి పాలు పోస్తున్నట్లు ఫొటో రూపొందించడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలన్నారు.

# మేనమామ మేలిమి 'కానుక'

**ఏపీలో అత్యుత్తమంగా 'జగనన్న విద్యాకానుక'**
- ఖరీదైన బ్యాగ్, మిలమిల మెరిసే బూట్లు
- ఆకర్షణీయంగా చెక్స్ యూనిఫామ్.. పెరిగిన క్లాత్ పరిమాణం
- రూ.1,042.53 కోట్లతో 40 లక్షల మందికిపైగా విద్యార్థులకు కిట్లు



సాక్షి, అమరావతి: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని ఇనుమడింపచేస్తూ అందచేస్తున్న జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మరింత నాణ్యతతో, సకాలంలో సమకూర్చేలా విద్యాశాఖ సన్నద్ధమైంది. రూ.1,042.53 కోట్ల వ్యయంతో 40 లక్షల మందికిపైగా విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందించేలా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈసారి విద్యార్థులకు మరింత మన్నికతో కూడిన నాణ్యమైన బ్యాగ్‌లు, బూట్లను అందించనున్నారు. యూనిఫామ్‌ను ప్లెయిన్ క్లాత్ కాకుండా ఆకర్షణీయంగా రంగు రంగుల చెక్స్ డిజైన్‌తో రూపొందించారు. దుస్తులు కుట్టే సమయంలో సమస్యలు ఎదురు కాకుండా యూనిఫామ్ క్లాత్‌ను అదనంగా పెంచారు. ఇక పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్ ముద్రణ పనులు ఇప్పటికే ప్రారంభం కాగా ఈనెల 24వ తేదీ నుంచి జిల్లా పాయింట్లకు పంపిణీ మొదలవుతుంది. స్కూళ్లు తెరిచే రోజే వీటిని విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల పట్ల పెరుగుతున్న ఆదరణ, ఏటా అదనంగా చేరుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఐదు శాతం అదనపు బఫర్‌తో ప్రభుత్వం 5.06 కోట్ల పాఠ్యపుస్తకాలను ముద్రిస్తుండటం గమనార్హం. విద్యాకానుక ద్వారా అందించే ప్రతి ఒక్క వస్తువు నాణ్యతను స్వయంగా పరిశీలిస్తూ ఓ మేనమామలా ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న విషయం తెలిసిందే. మూడున్నరేళ్లుగా జేవీకే అమలు తీరును గమనిస్తూ ఫీడ్ బ్యాక్ ఆధారంగా మార్పు చేర్పులను సూచిస్తున్నారు.

- స్థానిక మార్కెట్లో సుమారు రూ.650 విలువ చేసే నాణ్యమైన బ్యాగులను సరఫరా చేసేందుకు మంజీత్ ప్లాస్టిక్ ఇండస్ట్రీస్, కోర్స్ ఇండియా లిమిటెడ్, అభిలాష కమర్షియల్ ప్రైవేట్ లిమిటెడ్, ఎక్స్‌వో ఫుట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్, వినిష్మా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేసి ఆర్డర్లు ఇచ్చారు. స్కేర్ టైపులో పెద్ద బ్యాగులు రీ డిజైన్ చేశారు.
- యూనిఫామ్‌కి సంబంధించి బాలికల టాప్, బాలుర షర్ట్‌లను ప్లెయిన్ క్లాత్ నుంచి చెక్స్ (గడులు) రూపంలోకి మార్పు చేశారు. దుస్తులు కుట్టే సమయంలో సమస్యలు ఎదురు కాకుండా క్లాత్ పరిమాణాన్ని కూడా దాదాపు 20 శాతం పెంచారు. మఫత్‌లాల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, నందన్ డెనిమ్ లిమిటెడ్, కంచన్ ఇండియా లిమిటెడ్, అరవింద్ కాట్సిన్ ఇండియా లిమిటెడ్, పదమ్ చంద్ మిలాప్‌చంద్ జైన్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేశారు.
- బూట్లు మరింత కాంతివంతంగా (షైనింగ్) ఉండేలా చర్యలు చేపట్టారు. సరఫరాదారులు పాత మెటీరియల్ వాడకుండా నియంత్రించారు. డైమండ్ ఫుట్‌కేర్ ఉద్యోగ్ ప్రైవేట్ లిమిటెడ్, మంజీత్ ప్లాస్టిక్ ఇండస్ట్రీస్, ఎక్సెల్ ఫుట్ వేర్ ప్రైవేట్ లిమిటెడ్, పవర్ టెక్ ఎలక్ట్రో ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, లెహర్ ఫుట్‌వేర్ లిమిటెడ్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేసి పంపిణీ ఆర్డర్లు ఇచ్చారు.
- 1 నుంచి 9వ తరగతి వరకు బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు ప్రచురిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా 6, 7, 9 తరగతుల విద్యార్థుల కోసం ఎన్సీఈఆర్టీ సిలబస్‌తో బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు ముద్రిస్తున్నారు. తమిళనాడు న్యూస్ ప్రింట్ పేపర్స్ లిమిటెడ్ కాగితాన్ని సరఫరా చేస్తోంది. 40 లక్షల మందికిపైగా విద్యార్థులకు రెండు సెమిస్టర్ల విధానంలో పుస్తకాలు తయారు చేస్తున్నారు. దాదాపు 4.83 కోట్ల పుస్తకాలు ముద్రించి అందించనున్నారు.

# రాజ్యాంగం పట్ల పాలకులకు చిన్నచూపు

**ప్రముఖ జర్నలిస్టు, రచయిత సతీష్‌చందర్**
- మనుస్మృతిని కాలరాయాలి: రచయిత్రి జూపాక సుభద్ర
- రాజ్యాంగ హక్కుల రక్షణ కోసమే జేఏసీ: ప్రజాకవి జయరాజ్



సతీష్‌చందర్‌తో పాటు పలువురిని అరెస్టు చేసిన దృశ్యం

ముషీరాబాద్: రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల పాలకులు చిన్నచూపు చూస్తున్నారని ప్రముఖ జర్నలిస్టు, రచయిత సతీష్‌చందర్ విమర్శించారు. ఆదివారం ఏజీ ఆఫీసు సమీపంలోని అంబేడ్కర్ రిసోర్స్ సెంటర్‌లో భారత రాజ్యాంగం వర్సెస్ మనుస్మృతి అనే అంశంపై విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో సెమినార్ జరిగింది. సతీష్ చందర్ మాట్లాడుతూ పాలకులు మనువాద పద్ధతుల్లో వ్యవహరిస్తున్నారని నిందించారు. వ్యతిరేకించే వారికి కూడా వ్యతిరేకత తెలిపే స్వేచ్ఛను రాజ్యాంగం ఇచ్చింది కానీ దాన్ని పాటిస్తామని వాగ్దానం చేసిన పాలకులే హక్కులకు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. రచయిత్రి జూపాక సుభద్ర మాట్లాడుతూ మనుస్మృతిని అగ్రకుల మహిళలే ఎక్కువగా వ్యతిరేకించాలని, దళిత, బీసీలు కూడా మనుస్మృతిని కాలరాయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ ప్రజాకవి జయరాజ్ మాట్లాడుతూ అంబేడ్కర్, మార్క్స్, బుద్ధుడు చెప్పిన అంశాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల రక్షణ కోసమే జేఏసీ ఏర్పడిందని తెలిపారు.

**అకారణ అరెస్టులపై ఆగ్రహం**

కాగా, రెండు రోజుల క్రితం అంబేడ్కర్‌పై హమారా ప్రసాద్ అనే వ్యక్తి చేసిన వ్యాఖ్యల పట్ల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమానికి ఆందోళనకారులు పిలుపునిచ్చారు. ఈ సభికులు కూడా అక్కడికి వెళ్తారని భావించిన పోలీసులు సతీష్‌చందర్, జయరాజ్, సుభద్ర తదితరులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, వారికి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. తాము నిరసన కార్యక్రమానికి పిలుపు ఇవ్వలేదని, వారికీ తమకు సంబంధం లేదని చెప్పినప్పటికి పోలీసులు బలవంతంగా వ్యాన్‌లోకి ఎక్కించి నాంపల్లి, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. అరెస్టయిన వారిలో సతీష్‌చందర్, జయరాజ్, సుభద్రతో పాటు విజ్ఞాన దర్శిని కన్వీనర్ రమేష్, జనార్థన్, ఝాన్సీ, స్వరూప, దినకర్ శ్రీనివాస్, స్కైల్యాబ్ బాబు, విజయ్‌కుమార్ తదితరులున్నారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడిచిపెట్టారు. ఈ సందర్భంగా సతీష్ చందర్ మాట్లాడుతూ పాలకులకు భారత రాజ్యాంగానికి రక్షకులు ఎవరో భక్షకులు ఎవరో తెలియక పోవడం విచారకరమని వ్యాఖ్యానించారు.

# హిందువులంటే మీరేనా.. మేం కాదా?

- సీఎం ఎక్కడా, ఎప్పుడూ ఎవరినీ అగౌరవ పరచలేదు
- వైఎస్సార్‌సీపీ నేతల స్పష్టీకరణ

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: 'మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా, అన్నార్తుల ఆకలి తీర్చడమే ఈశ్వర ఆరాధన అని చెబుతూ.. మా పార్టీ అఫీషియల్ ట్విటర్ ఖాతాలో ట్వీట్ చేసింది. రాష్ట్ర ప్రజలందరికీ శివయ్య చల్లని దీవెనలు ఉండాలని కోరుకుంటూ శుభాకాంక్షలు చెప్పింది. ఇందులో హిందువుల మనోభావాలు ఎక్కడ దెబ్బ తిన్నాయో అర్థం కావడం లేదు. ఆ ట్వీట్‌లో పరమ శివుడిని కించ పర్చినట్లు ఎక్కడ ఉందో చెప్పండి? బీజేపీ పూర్తిగా దిగజారి వక్రీకరిస్తోంది. శివరాత్రి రోజు బీజేపీ వాళ్లు శివాలయాలకు వెళ్లడం మర్చిపోయినట్లు ఉన్నారు. అందుకే ఈరోజు 'కోవెలకు వెళ్దాం' అంటూ ధర్నాలు చేపట్టారు' అని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు.

**హిందుత్వానికి మీరు పేటెంటా?**

మతాన్ని రాజకీయాల్లోకి ఎందుకు లాగుతున్నారు? హిందుత్వానికి చాంపియన్స్ అన్నట్టు బిల్డప్ ఇస్తున్నారు. మీకన్నా హిందుత్వంపై ఎక్కువ ప్రేమ ఉన్నవారు, హిందుత్వ సంప్రదాయాలు పాటించే వారు వైఎస్సార్‌సీపీలో కోట్లాది మంది ఉన్నారు. 2014లో చంద్రబాబు విజయవాడ నడిబొడ్డున 40 ఆలయాలు పడగొడితే ఏం పీకారు? ఆ ప్రభుత్వంలో భాగమైన మీరు ఆ రోజు ఒక్క ధర్నా చేశారా? టీడీపీ హయాంలో రాష్ట్రంలో ఎన్ని గుళ్లు కట్టారో.. ఈ మూడున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ హయాంలో ఎన్ని గుళ్లు కట్టారో, ఎన్నింటిని పునర్నిర్మించారో చూడండి. బీజేపీ నాయకుడు సునీల్ థియోధర్ ట్వీట్ ఇన్సల్టింగ్‌గా ఉంది. అటువంటి వ్యక్తితో రాజకీయం చేస్తే ఇంకా దిగజారిపోతారు.

– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి

**నాడు గుడులు కూల్చినప్పుడు ఏమయ్యారు?**

మతానికి రాజకీయ రంగు పులిమి పబ్బం గడుపుకుంటున్న దుర్మార్గ పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక బీజేపీ మాత్రమే. ఓ సదుద్దేశంతో ట్విట్టర్‌లో వచ్చిన ఒక చిన్న క్యారికేచర్‌ను పట్టుకుని వక్ర భాష్యాలు వల్లిస్తూ రెచ్చిపోవడం బీజేపీ రాష్ట్ర నేతల దిగజారుడుతనానికి నిదర్శనం. మీరు టీడీపీతో అంటకాగినప్పుడు రాష్ట్రంలో 40 గుళ్లు కూల్చారు. అప్పుడు దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న బీజేపీ నేత, ఇతర నేతలంతా ఎక్కడ నిద్రపోయారు?

– కొట్టు సత్యనారాయణ, డిప్యూటీ సీఎం



కన్నబాబు, కొట్టు సత్యనారాయణ, బొత్స

**ఇందులో తప్పేముంది?**

రాష్ట్రంలో బీజేపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి. మేమంతా హిందువులమే. ఆ ట్వీట్ ద్వారా మా మనోభావాలు ఏమీ దెబ్బతినలేదు. బీజేపీ వాళ్లకు ఏం ఇబ్బంది కలిగిందో అర్థం కావటం లేదు. ఆకలి అంటే దేవుడిని తలుచుకోవడం అందరికీ సహజం. రాష్ట్రంలో మనుగడ కోసం ఏమీ లేని చోట బీజేపీ మసిపూసి మారేడికాయ చేస్తోంది. గతంలో వారే దేవాలయాలు కూల్చి వారే ధర్నాలు, నిరసనలు చేశారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి.

– బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి

**బీజేపీ దిష్టికళ్లతో చూడటం మానాలి**

అన్నార్తులకు అన్నం పెడితే, దాన్ని కూడా మతం దృష్టిలో చూసే దిష్టి కళ్లు బీజేపీవి. దేవుళ్లను రాజకీయాలకు వాడుకునే బీజేపీకి భక్తి గురించి ఏ మాత్రం తెలియదు. ఇలాంటి విషయాన్ని రాజకీయం చేయడం దుర్మార్గం.

– బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి

# కళాశాల మెట్లు కూలి విద్యార్థులకు గాయాలు

**సూర్యాపేటలోని భవిత జూనియర్ కళాశాలలో ఘటన**



కూలిన భవిత జూనియర్ కళాశాల మెట్లు

సూర్యాపేటటౌన్: కళాశాల భవనం మెట్లు కూలి పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో ఉన్న భవిత జూనియర్ కళాశాలలో 100 మంది వరకు విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నారు. భవనం కింది భాగంలో తరగతులు, పై అంతస్తులో హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే సాయంత్రం స్టడీ అవర్స్ అయిపోగానే విద్యార్థులు ఎవరి రూమ్‌కు వారు వెళ్లిపోయారు. కాగా, శివాజీ జయంతి ఉత్సవాల నిర్వాహకులు రోడ్డుపై ర్యాలీ నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ఒక్కసారిగా హాస్టల్ రూమ్‌ల నుంచి బయటకు వచ్చి మొదటి అంతస్తు మెట్లపై నిలబడి చూస్తున్నారు. అయితే ఆ భవనం శిథిలావస్థలో ఉండటంతో మెట్లు కూలి సైడ్‌వాల్ ఒకవైపు ఒరిగిపోయింది. దీంతో 12 మంది విద్యార్థులు ఒకరిపై ఒకరు కిందపడిపోయారు. అక్కడ ఉన్న సిబ్బంది, తోటి విద్యార్థులు.. గాయపడిన విద్యార్థులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆదివారం రాత్రి మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. తీవ్ర గాయాలైన వారికి వెంటనే మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# పక్షులు మెరిసే.. బర్డ్‌వాచర్లు మురిసే



పక్షులను పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి, కుమురంభీం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

- అట్టహాసంగా ముగిసిన బర్డ్‌వాక్
- హాజరైన నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి



బైసన్‌కుంటలో ఫొటోలు తీస్తున్న పక్షి ప్రేమికులు

జన్నారం(ఖానాపూర్): తమకోసం వచ్చిన వారిని చూసి మురిసిన పక్షులు తమ అందాలను చూపించాయి. మంచిర్యాల జిల్లా జన్నారం అటవీరేంజ్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బర్డ్‌వాక్ ఆదివారం ముగిసింది. పక్షి ప్రేమికులు ఉదయం బైసన్‌కుంట, మల్యాల వాచ్‌టవర్ ప్రాంతాల్లో పర్యటించారు. కుంటల ప్రాంతంలో వివిధ రకాల పక్షులను గుర్తించి తమ కెమెరాల్లో బంధించారు. అరుదుగా కనిపించే సర్పెంట్ ఈగల్, బ్లాక్ స్టార్క్, నార్తన్ పింటెల్స్ లాంటి పక్షులను చూసి మురిసిపోయారు. ముగింపు సందర్భంగా నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ హాజరయ్యారు. వివిధ రకాల పక్షుల పేర్లు అడిగి తెలుసుకున్నారు. పక్షుల కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బర్డ్‌వాక్‌లో పాల్గొన్న పక్షి ప్రేమికులు 'సాక్షి' తో తమ అనుభవాలు పంచుకున్నారు.

### 60 రకాల పక్షులను గమనించా



బర్డ్‌వాక్‌కు రావడం ఇది రెండోసారి. రెండు రోజులుగా వివిధ ప్రాంతాల్లో తిరిగా. ఇక్కడ 60 రకాల పక్షులను గమనించా. అరుదైనా పక్షులను కూడా చూశా. ఇక్కడి అడవులు చాలా బాగున్నాయి. అధికారులు ఏర్పాట్లు బాగా చేశారు.

– ఉదయ్, హైదరాబాద్

### చాలా ఆనందంగా ఉంది



బర్డ్‌వాక్ గురించి తెలుసుకుని ఇక్కడికి వచ్చా. రెండు రోజులుగా ఉత్సాహంగా పాల్గొన్నాం. రాత్రి అడవిలో గడపడం ఆనందంగా ఉంది. చాలా రకాల పక్షులను పరిశీలించాం. అడవిలో గడపడం, పక్షులను పరిశీలించడం కొత్త అనుభూతి ఇచ్చింది.

– నాగార్జున, హైదరాబాద్

### జీవ వైవిధ్యానికి ప్రతీక



జన్నారం అడవులు జీవ వైవిధ్యానికి ప్రతీక అని చెప్పవచ్చు. బర్డ్‌వాక్ గురించి తెలుసుకుని ఇక్కడికి వచ్చాం. చాలా రకాల పక్షులను పరిశీలించాం. సుదూర ప్రాంతాల నుంచి చాలామంది పక్షి ప్రేమికులు వచ్చారు. ప్రతి సంవత్సరం బర్డ్‌వాక్ నిర్వహిస్తే బాగుంటుంది.

– వరుణ్‌రెడ్డి, నిర్మల్ కలెక్టర్

### ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



ఏపీ, తెలంగాణ ప్రాంతాల్లోని వివిధ జిల్లాలకు చెందిన పక్షి ప్రేమికులు ఇక్కడికి వచ్చారు. వారికి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశాం. పక్షులను ఉత్సాహంగా తిలకించారు. వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నాం. ప్రతి సంవత్సరం నిర్వహించేలా చూస్తాం.

– సిరిపురం మాధవరావు, ఎఫ్‌డీవో





## 'నాగోబా'లో ముగిసిన శివరాత్రి పూజలు

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం సైతం భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. అన్నదానంలో పాల్గొని ఉపవాస దీక్షలు విరమించారు. మహిళలు, చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, సర్పంచ్ రేణుకనాగ్‌నాథ్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

# నంబర్‌వన్.. ఆర్జీ-1



జీడీకే-5 ఓసీపీ ప్రారంభోత్సవం (ఫైల్)

| నెల | లక్ష్యం | ఉత్పత్తి | శాతం |
|---|---|---|---|
| ఏప్రిల్ | 2.36 | 3.03 | 129 |
| మే | 3.00 | 3.47 | 116 |
| జూన్ | 3.00 | 3.42 | 114 |
| జూలై | 2.90 | 2.31 | 80 |
| ఆగస్టు | 2.86 | 2.98 | 104 |
| సెప్టెంబర్ | 3.00 | 3.84 | 128 |
| అక్టోబర్ | 3.62 | 4.27 | 117 |
| నవంబర్ | 3.75 | 4.66 | 125 |
| డిసెంబర్ | 3.74 | 4.48 | 120 |
| జనవరి–23 | 3.63 | 4.28 | 118 |
| ఫిబ్రవరి–19 నాటికి | 2.35 | 2.50 | 107 |
| మొత్తం | 34.21 | 39.24 | 115 |

- 40 రోజుల ముందుగానే లక్ష్యానికి చేరువ
- 39.20 లక్షల టన్నుల లక్ష్యానికి 39.24 లక్షల టన్నులు పూర్తి
- సమష్టి కృషితో లక్ష్యాల సాధన

గోదావరిఖని(రామగుండం): 40 రోజుల ముందుగానే ఆర్జీ–1 ఏరియా ఉత్పత్తి లక్ష్యాలు సాధించింది. 39.20 లక్షల టన్నుల టార్గెట్‌ను నిర్దేశిత గడువుకు ముందుగానే 39.24 లక్షలు సాధించి సింగరేణిలోనే నంబర్‌వన్‌గా నిలిచింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను 39.20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిగా యాజమాన్యం నిర్దేశించింది. ఆదివారంతో 39.24 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి లక్ష్యాలను 40రోజుల ముందుగానే అధిగమించింది. జీడీకే–5 ఓసీపీ ఏర్పాటుతో ఏరియాలో బొగ్గు ఉత్పత్తిలో వేగం పుంజుకుంది. గతేడాది ఫిబ్రవరిలో జీడీకే–5 ఓసీపీ ప్రారంభమైంది. ప్రారంభమైన రోజునే బొగ్గు వెలికితీసి ఏరియా రికార్డు నెలకొల్పింది. మేడిపల్లి ఓసీపీలో బొగ్గు నిల్వలు అడుగంటిపోవడంతో కొత్త ఓసీపీ ప్రారంభంపై యాజమాన్యం దృష్టి సారించింది. దీంతో కార్మిక వాడలకు సమీపంలో ఓసీపీ ఏర్పాటును అడ్డుకుంటామని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఓవైపు బొగ్గు ఉత్పత్తి భారీగా తగ్గిపోవడం మరోవైపు నూతన ఓసీపీ ఏర్పాటుపై తీవ్ర వ్యతిరేకత మొదలైంది.

**క్లిష్ట సమయంలో జీఎంగా బాధ్యతలు చేపట్టి..**

రెండేళ్లుగా సరైన బొగ్గు ఉత్పత్తి లేక వార్షిక లక్ష్యాలకు దూరంలో ఉన్న క్రమంలో ఆర్జీ–1 ఏరియా జీఎంగా కె.నారాయణ బాధ్యతలు చేపట్టారు. ఏరియాకు ప్రధాన వనరుగా మేడిపల్లి ఓసీపీల్లో బొగ్గు అడుగంటి పోవడంతో నూతన ఓసీపీ ఏర్పాటుపై దృష్టి సారించారు. ఒక దశలో మేడిపల్లి ఓసీపీలో పనిచేసే కార్మికుల భవిష్యత్ కూడా ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఏర్పడింది. అందులో పనిచేసిన కార్మికులందరినీ ఇతర ఓసీపీలకు బదిలీ చేసి ఉత్పత్తి లేకుండా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కార్మిక వాడలకు సమీపంలోనే ఓసీపీ ఏర్పాటుతో ప్రజాసంఘాలు, యూనియన్లు, రాజకీయ పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. జీఎం ఈప్రాంత వాసి కావడం, స్థానికంగా ఉన్న పరిచయాలు, తనకున్న అనుభవంతో ఒక్కొక్కటిగా అవాంతరాలు దాటుకుంటూ గత ఫిబ్రవరిలో నూతన ఓసీపీ ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. ప్రారంభించిన రోజే బొగ్గు ఉత్పత్తితీసేలా సిద్ధం చేసి సింగరేణి చరిత్రలోనే సరికొత్త రికార్డును నెలకొల్పారు.

**నష్టాల నుంచి లాభాల వైపు..**

నష్టాల బాటలో ఉన్న ఆర్జీ–1 ఏరియా నూతన ఓసీపీ ఏర్పాటుతో లాభాల వైపు మళ్లింది. బొగ్గు నిల్వలు సరిగా లేక గడిచిన రెండేళ్లలో ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోలేక పోయింది. ఈక్రమంలో నూతనంగా ఏర్పాటైన జీడీకే–5ఓసీపీ ఏరియా భవిష్యత్‌ను మార్చేసింది. బొగ్గు ఉత్పత్తి ఊపందుకోవడంతో నిర్దేశిత లక్ష్యాల దిశగా దూకుడుగా ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు ఏరియా 115 శాతం ఉత్పత్తి సాధించి సింగరేణిలోనే బొగ్గు ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో నిలిచింది. దీనికోసం అహర్నిశలు శ్రమించిన జీఎం కె.నారాయణను ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

### ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలి



సంస్థ సీఅండ్ఎండీ ఎన్.శ్రీధర్ దిశానిర్దేశంతో డైరెక్టర్ల పర్యవేక్షణలో ఆర్జీ–1 ఏరియా బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచింది. ఏరియాలోని అధికారులు, కార్మిక సంఘాలు, ఉద్యోగులకు ప్రత్యేక అభినందనలు. రాబోయే రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి ఏరియాను సంస్థలోనే అగ్రగామిగా నిలపాలి.

– కె.నారాయణ, ఆర్జీ–1 జీఎం

## అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో యైటింక్లయిన్‌కాలనీకి చెందిన కాంటేవాడ రాధ నాలుగు పతకాలు సాధించింది. ఈనెల 16 నుంచి 19 వరకు హర్యానా రాష్ట్రంలో నిర్వహించిన 35– 50 ఏళ్ల మహిళా గ్రూప్ విభాగంలో 100 మీటర్ల రిలే రన్‌లో బంగారు పతకం, 1,600 మీటర్ల రిలే రన్‌లో రజతం , 400 మీటర్ల రిలే రన్‌లో రజతం, వ్యక్తిగత 200 మీటర్ల రిలే రన్‌లో రజతం మొత్తం నాలుగు పతకాలు సాధించినట్లు తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ద్రోణాచార్య స్టేడియంలో నేషనల్ మాస్టర్స్ అసోసియేసిన్ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్‌కుమార్‌శర్మ, రాంపాల్ చేతుల మీదుగా పతకాలు, సర్టిఫికెట్స్ అందజేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కల్లెం మహేందర్‌రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పతకాలు అందుకుంటున్న రాధ

# సన్నిధి



మంచి మాట

## సంతోషం సమగ్ర బలం

**సంతోషం సగం బలం' అన్నది మనకు బాగా తెలిసిన మాటే. నిజానికి మనిషికి సంతోషం సమగ్రబలం. అంతేకాదు మనిషికి సంతోషం సహజమైన బలం కూడా. ఎంత బలవంతుడికైనా సంతోషం లేనప్పుడు అతడు బలహీనుడిగా అయిపోతాడు. సంతోషం కరువైపోయిన మనుషులు మనో వ్యాధులతో శుష్కించిపోవడమూ, నశించిపోవడమూ మనకు తెలిసిన విషయమే. బావుండాలంటే మనిషికి సంతోషం ఎంతో ముఖ్యం. వర్తమానంలో మనం సంతోషంతో ఉంటే లేదా మనం వర్తమానాన్ని సంతోష భరితంగా చేసుకోగలిగితే మన భవిష్యత్తు సంతోషమయంగా ఉంటుంది.**

‘సంతోషానికి మార్గం లేదు, సంతోషమే మార్గం’ ఇది గౌతమ బుద్ధుడి ఉవాచ. సంతోషం అనేది సంపాదించుకోగలిగేదీ, సాధించుకోగలిగేదీ కాదు. సంతోషం మనలో ప్రవహించే రక్తంలాంటిది. బయటనుంచి వచ్చేది కాదు. మనలోంచి మన కోసం మనమై కలిగేది. ‘మనం మన ఆలోచనల వల్ల నిర్మితం అయ్యాం; మనం మన ఆలోచనలకు అనుగుణంగా రూపొందుతాం; మన మెదడు నిర్మలంగా ఉంటే సంతోషం వీడని నీడలా అనుసరిస్తుంది’ అని చెప్పాడు బుద్ధుడు. మనిషి సంతోషంగా ఉండడం అతడి ఆలోచనావిధానంపై ఆధారపడి ఉంటుంది. ఆలోచన ఆధారంగా కలిగే అనుభూతి సంతోషం. ఒకరికి సంతోషాన్ని ఇచ్చేది మరొకరికి సంతోషాన్ని ఇచ్చేది కాకపోవచ్చు.

‘సూర్యుడి కాంతి మనుషులకు వెలుగును ఇస్తూ ఉంటే గుడ్లగూబలకు చీకటి అవుతోంది. నీటిలో మునిగినప్పుడు మనుషులకు, పశువులకు ఆ నీరు శ్వాసకు ప్రతిబంధకం అవుతోంది. ఆ నీరే చేపల శ్వాసకు ఆటంకం అవడం లేదు. మనుషులు హాయిగా గాలి పీల్చుకునే తీరప్రదేశంలో చేపలు గాలి పీల్చుకోలేవు. అగ్ని అన్నిటినీ దహిస్తుంది. కానీ అత్తిరిపక్షులు అగ్నికణాల్ని తింటాయి. నీళ్లవల్ల నిప్పు నశిస్తుంది. కానీ బడబాగ్ని సముద్రం మధ్యలో జ్వలిస్తూ ఉంటుంది. ఇట్లా జగత్తులో విషయాలన్నీ ద్వైరూప్యంతో ఉన్నాయి అని భారతీయ తత్త్వసాహిత్యంలో అత్యున్నతమైన త్రిపురారహస్యంలో చెప్పబడింది. విషయాలనుబట్టి కాదు మనల్ని బట్టి మనకు తృప్తి కలుగుతూ ఉంటుంది లేదా మన తనివి తీరుతూ ఉంటుంది. కాబట్టి మన సంతోషానికి మనమే మూలంగా ఉన్నాం, ఉంటాం.

‘శరీరాన్ని శుష్కింపజెయ్యడంలో చింత లేదా విచారానికి సమానమైంది లేదు’ అని హితోపదేశం ఎన్నో యేళ్ల క్రితమే మనకు చెప్పింది. ‘చితి, చింత ఈ రెండిటిలో చింత ఎక్కువ దారుణమైంది. చితి నిర్జీవమైన శరీరాన్నే దహిస్తుంది కానీ చింత సజీవంగా ఉన్న శరీరాన్ని దహిస్తూ ఉంటుంది’ అని ఒక సంస్కృత శ్లోకం తెలియజేస్తోంది. నిజానికి చింత అనేది శరీరాన్ని మాత్రమే కాదు ఆలోచనా విధానాన్ని, వ్యక్తిత్వాన్ని, ప్రగతిని, జీవితాన్ని కూడా శుష్కింపజేస్తుంది. కాబట్టి మనకు కలిగిన చింతను వీలైనంత త్వరగా వదిలించుకోవాలి. మనకు కలిగిన చింత నుంచి మనం వీలైనంత త్వరగా విముక్తం అవ్వాలి.

‘మానవజాతిలోని చింత అంతా మనసువల్ల వచ్చిన జబ్బు’ అని తమిళకవి కణ్ణదాసన్ చెప్పారు. ఈ స్థితికి అతీతంగా మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు మనసే కీలకం. మనసువల్ల వచ్చిన చింతను ఆ మనసువల్లే తొలగించుకోవాలి.‘గాలి తనతో తీసుకు వచ్చిన మేఘాలను తానే చెదరగొడుతుంది.’ అని ఒక సంస్కృత శ్లోకం చెబుతోంది. ఆ విధంగా మనసువల్ల వచ్చిన చింతలను మనం మనసువల్లే పోగొట్టుకోవాలి.

సంతోషం మనిషిలోనే నిక్షిప్తం అయి ఉంది. దుఃఖాన్ని తొలగించుకునేందుకు తనను తాను చెక్కుకోవడం నేర్చుకుంటే మనిషి సంతోషశిల్పం అవుతాడు; మనిషి ‘సంతోషంగా’ ఉంటాడు.

– శ్రీకాంత్ జయంతి

## అమృత బిందువులు

- నీకు వెలుగునిస్తున్నానని సూర్యుడు ఎప్పుడూ మనతో చెప్పుకోడు. అలాగే చల్లదనాన్ని ఇస్తున్నానని చంద్రుడు, వర్షాన్ని ఇస్తున్నానని మబ్బు, నీకు ఆహారాన్ని అందిస్తున్నానని భూమి చెప్పుకోదు. మరి మనం కొంచెం సాయం చేసి గొప్పగా చెప్పుకోవలసిన అవసరం లేదు. ఒకవేళ చెప్పినా ఏ బంధం శాశ్వతం కాదు.
- నిన్ను విమర్శించే ప్రతి వ్యక్తికి సంజాయిషీ చెప్తూ పోతే, నీ అడుగులు ముందుకు సాగేదెప్పుడు? కాబట్టి ధైర్యంగా ముందడుగు వేయి.
- జరిగినదాన్ని గురించి ఎప్పుడూ చింతించకు. ఎందుకంటే... మనకు జరిగే మంచి మనకు ఆనందాన్ని ఇస్తే, జరిగిన చెడు అనుభవాన్ని ఇస్తుంది.
- మేఘం నుండి జాలువారిన ప్రతి చినుకు ముత్యం కాకపోయినా... ఏ చిన్ని మొలకకో ప్రాణం పోస్తుంది. ఎండు ఆకు అయినా ఒకరి కడుపు నింపేందుకు విస్తరిగా మారుతుంది.
- ఈ విశాల సృష్టిలో పుట్టిన ప్రతి జీవి బతుక్కి ఒక అర్థం, పరమార్థం ఉంటాయి. అది తెలుసుకున్న వారి జీవితం చరితార్థం అవుతుంది.
- జీవితం అనేది ఒక ప్రశ్న లాంటిది. ఎవరూ సమాధానం చెప్పలేరు.
- చావు అనేది సమాధానం లాంటిది. ప్రశ్నించే ధైర్యం ఎవరికీ ఉండదు.

## ధర్మం శరణం గచ్ఛామి!

దమ్మపదం



అది అందమైన అడవి. చెట్లు చివురులు తొడిగి నవనవలాడుతున్నాయి. నేలమీద పచ్చిక ఒత్తుగా పెరిగి ఉంది. ఎన్నో జింకలు మందగా వచ్చి, మేత మేస్తూ ఉన్నాయి. ఆ జింకల్ని కొట్టడానికి ఒక వేటగాడు ఎన్నోసార్లు ప్రయత్నించాడు. అవి దొరికినట్లే దొరికి చిక్కకుండా పారిపోతూనే ఉన్నాయి.

ఆ పచ్చిక బయలు మధ్యలో ఒక సరస్సు ఉంది. ఆ సరస్సు పక్కన చెట్ల మధ్యగా సన్నని దారి ఉంది. ఆ దారికి ఆ చివర లోతైన కందకం ఉంది. అది పచ్చగడ్డి కప్పి ఉండడం వల్ల సరిగ్గా కనిపించదు. దారి తప్పి అటుకేసి పోతే.. ఆ కందకంలో చిక్కుకోవడం ఖాయం. దాని చుట్టూ పన్నిన వలలోంచి బైటకు రావడం అసంభవం. కాబట్టి వేటగాడు ఉపాయం పన్నాడు. పచ్చిక బయలు చుట్టూ వలపన్నాడు. జింకలు ఆ బయలు లోకి రాగానే వలనెత్తాడు. ఆ వలకు ఒకే ఒక్క వైపున దారి తెరిచాడు. అదీ... ఆ కందకం వైపునే. జింకలు పడక తప్పదు అనుకొని, మరో వేట కోసం వెళ్లిపోయాడు.

పొద్దు ఎక్కేవరకు జింకలు మేస్తూనే ఉన్నాయి. కడుపు నిండిన జింకలు పచ్చికబయలు విడిచి చెట్లకిందకు పోవడానికి ప్రయత్నించాయి. కాని ఎటు వెళ్లినా, వల అడ్డు తగలడంతో తిరిగి వెనక్కు వస్తున్నాయి. నెమ్మదిగా వాటిలో అలజడి మొదలైంది. అది గమనించి అక్కడికి వచ్చాడు దాపులో ఒక కుటీరంలో ఉంటున్న ముని. ఆ పరిసరాలు గమనించిన మునికి విషయం అర్థమయ్యింది. అడవి చెట్ల మధ్య అగాథంలోకి మాత్రమే దారి తెరచి ఉందని గ్రహించాడు. అప్పటికే కొన్ని జింకలు అటుగా వెళ్లాయి. అవి ఇంక ఇటుకేసి రానే రావని గ్రహించాడు. వేటగాడు పాతిన వలను పెళ్లగించి దారికి అడ్డుగా కట్టాడు. ఇక మిగిలిన జింకలు అటుకేసి వెళ్లవు. తన కుటీరం వైపు వలను చించి దారి చేశాడు.

జింకలు మెల్లగా ఆ దారిగుండా బైటకు పోసాగాయి. సాయంత్రానికి అన్నీ సురక్షితంగా తమ నివాసాలకి చేరాయి. వేటగాడు సాయంత్రం వచ్చి నెత్తీనోరూ కొట్టుకున్నాడు.

బుద్ధుడు ఈ కథ చెప్పి–

జింకలకు ప్రమాదాన్ని కలిగించడానికి వల పన్నిన వేటగాడే మారుడు. అంటే మన్మథుడు. కోరికలు, తృష్ణ, దురాశ అల్లిన వలలో మన మనస్సు మీదకు విసిరేవాడు. మనల్ని మోహంలో పడవేసి, దాన్నుండి బైట పడడానికి వీలు లేకుండా బంధించి వేస్తాడు. దానితో మనం చెడు కర్మల వైపుకు వెళ్లి దుఃఖం అనే అఖాతంలో పడతాం. అలాగే... దుఃఖానికి కొనిపోయే దారిని మూసి, సురక్షితమైన మార్గానికి దారి చూపిన వాడు ధర్మం తెలిసిన వాడు. బహుజన సుఖాన్ని, బహుజన హితాన్ని కోరుకునేవాడు– అని చెప్పాడు.

మనం అజ్ఞానం వీడితే, ప్రమాదకర మార్గాన్ని మూసేస్తాం. అలా మనల్ని మనమే రక్షించుకుంటాం. అందుకే.. ధర్మం శరణం గచ్ఛామి!

– డా. బొర్రా గోవర్ధన్

## శ్రమకు నమస్కారం

గురువాణి



నైతిక విలువలు పతనమయిన జీవితాన్ని గడపడం... అంటే చెప్పేది ఒకటి, చేసేది ఒకటి అవుతుంది. దానికి మూడవది కొనసాగింపుగా మనసు కూడా తోడయితే... దానిని దంభం అంటారు. అంటే మనసులో ఒకటి అనుకుంటాడు. పైకి ఒకటి మాట్లాడతాడు, చేసేది మరొకటి అయి ఉంటుంది. అంటే ఈ మూడూ ఒక సరళరేఖలో ఉండవు. అలా లేకుండా ఉండడమే నైతిక భ్రష్టత్వం.

ఏ పని చేయకుండా సంపద కలిగి ఉండడం ప్రమాదం. మనిషి సంపదను పొంది ఉండడంలో తప్పు లేదు. అనువంశికంగా, పిత్రార్జితంగా పెద్దలనుండి వచ్చిన ఆస్తి కలిగి ఉండడం అంతకన్నా దోషం కాదు. కానీ వాళ్ళు ఈ సంపదను సమకూర్చడానికి ఎంత కష్టపడ్డారో, ఎంత చెమట చిందించారో అర్థం అయితే తప్ప ఆ డబ్బు ఖర్చుపెట్టడానికి యోగ్యత పొందలేడు. కారణం.. డబ్బు సంపాదించేటప్పుడు మనిషి పడే కష్టం అనుభవాన్ని ఇస్తుంది. అది డబ్బును విచ్చలవిడిగా ఖర్చు పెట్టనీయదు. చెమటకు ఉన్న శ్వాస ఏమిటో అర్థం అవుతుంది. అప్పుడు వ్యసనాలకు వశులు కారు. కష్టపడి సంపాదించుకున్న ద్రవ్యం క్రమశిక్షణను నేర్పుతుంది.

నీతి శాస్త్రం ఏమంటుందంటే... మనిషి ఎంత సంపాదించాడనే దానికంటే ఏ మార్గంలో సంపాదించాడన్నది ప్రధానం. ఎంత ఖర్చు పెట్టావు అనేదానికన్నా ఏ ప్రయోజనానికి ఖర్చుపెట్టావన్నది అత్యంత ప్రధానం. ప్రతివారికి ద్రవ్యసముపార్జనలోని కష్టం తెలియాలి... అంటుంది



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

రఘువంశం కావ్యంలో... పట్టాభిషిక్తుడైన ప్రతి రాజు కూడా వంశపారంపర్యంగా రాజ్యం అందినా... జీవితంలో ఒకసారి దండయాత్రకు వెడతాడు. రాజులందర్నీ గెలిచి వస్తాడు. ఎందుకు... అంటే తనకు పూర్వం ఉన్న రాజులు దండయాత్రలు చేయడానికి, రాజుల్ని గెలవడానికి, చక్రవర్తిత్వాన్ని నిలుపుకోవడానికి ఎంత కష్టపడ్డారో, ఎలా కోశాగారాన్ని నింపగలిగారో, ఎలా మంచిపనులు చేసి కీర్తిమంతులు కాగలిగారో తెలియాలంటే వారు కూడా కష్టపడాలి.. అందుకే ఆ దండయాత్రలు.

ఒక వ్యక్తి జీవితంలో ఎంతో కష్టపడి సంపాదిస్తే, ఆ ద్రవ్యం ఎంత మంది ఉద్ధరణకో ఉపయోగిస్తాడు తప్ప నిష్కారణంగా దాచుకుందామన్న ఆలోచనను రానీయడు. నీరు, విద్య, ద్రవ్యం నిలబడి ఉండకూడదు. ప్రవహిస్తూ ఉండాలి. అప్పుడే వాటి ప్రయోజనం సిద్ధిస్తుంది. కష్టపడి సంపాదించడంలో గౌరవం ఉంది. అది ఎంతయినా కావచ్చు. అసలు సంపాదించినది ఏదీ లేకపోవచ్చు. అందువల్ల నీతిబద్ధంగా శ్రమించడం ప్రతి వ్యక్తికీ ప్రధానం.

# సినిమా

## టీఎఫ్‌పీసీ అధ్యక్షునిగా దామోదర్ ప్రసాద్

తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్(టీఎఫ్‌పీసీ)నూతన అధ్యక్షునిగా కేఎల్ దామోదర్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన టీఎఫ్‌పీసీ ఎన్నికల్లో ప్రత్యర్థి పి.కిరణ్‌పై 24 ఓట్ల తేడాతో గెలుపొందారు దామోదర్ ప్రసాద్. ‘ప్రోగ్రెసివ్ ప్రొడ్యూసర్స్ ప్యానెల్’ నుంచి పోటీ చేసిన దామోదర్‌కి 339 ఓట్లు రాగా, ‘ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్యానెల్’ నుంచి బరిలో దిగిన కిరణ్‌కి 315 ఓట్లు వచ్చాయి. ‘టీఎఫ్‌పీసీ’ ఉపాధ్యక్షులుగా ‘ప్రోగ్రెసివ్ ప్రొడ్యూసర్స్ ప్యానెల్’కు చెందిన కె.అశోక్ కుమార్, వై.సుప్రియ, ట్రెజరర్‌గా ‘ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్యానెల్’ నుంచి తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే టీఎఫ్‌పీసీ సెక్రటరీలుగా ‘ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్యానెల్’ కు చెందిన టి.ప్రసన్న కుమార్(397 ఓట్లు), వైవీఎస్ చౌదరి (380 ఓట్లు) విజయం సాధించారు. జాయింట్ సెక్రటరీలుగా ‘ప్రోగ్రెసివ్ ప్రొడ్యూసర్స్ ప్యానెల్’కు చెందిన భరత్ చౌదరి (412 ఓట్లు), స్వతంత్ర అభ్యర్థి నట్టి కుమార్ (247ఓట్లు) గెలుపొందారు.



దామోదర్ ప్రసాద్

**ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు..**

‘టీఎఫ్‌పీసీ’ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ‘దిల్’రాజు, డీవీవీ దానయ్య, పీవీ రవి కిశోర్, రవిశంకర్ యలమంచిలి, ఎస్.పద్మిని, బి.వేణుగోపాల్, వై. సురేందర్ రెడ్డి, గోపీనాథ్ ఆచంట, ఠాగూర్ మధు, కేశవరావు పల్లి, శ్రీనివాసరావు వజ్జ, అభిషేక్ అగర్వాల్, కృష్ణ తోట, రామకృష్ణ గౌడ్ ప్రతాని, పూసల కిశోర్ ఎన్నికయ్యారు. కాగా ‘టీఎఫ్‌పీసీ’లో దాదాపు 1200 మంది సభ్యులుండగా 678 ఓట్లు పోలయ్యాయి. ఈ నూతన కార్యవర్గం 2025 వరకు కొనసాగుతుంది.

**● ఇప్పుడు అదే జరిగింది**

అందరూ నన్ను వివాదాస్పద వ్యక్తిగా చూస్తారు.. కానీ ఆదివారం జరిగిన ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో (470 ఓట్లు) ఈసీ మెంబర్‌గా నన్ను గెలిపించారు.. ఈ మెజార్టీని బట్టి నన్ను ఎంత ప్రేమిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. కౌన్సిల్‌లో యాక్టివ్ ప్రొడ్యూసర్స్ ఉండాలని నేను కోరుకున్నాను.. ఇప్పుడు అదే జరిగింది. అయితే మేమంతా కలిసి పని చేస్తాం.

–‘దిల్’ రాజు, నిర్మాత

**● కలిసికట్టుగా పని చేస్తాం**

నిర్మాతల మండలి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఇకపై అందరం కలిసికట్టుగా పని చేస్తాం. ప్రొడ్యూసర్ గిల్డ్‌ని కూడా నిర్మాతల మండలిలో కలపాలి. ఇద్దరు చీడ పురుగుల వల్ల వ్యవస్థ చెడిపోయింది.. దాన్ని అందరూ గుర్తించి వాళ్లని ఓడించారు.

– సి.కల్యాణ్, నిర్మాత

## బిజీ బిజీ



ప్రభాస్

‘సలార్’, ‘ప్రాజెక్ట్ కె’ వంటి భారీ ప్రాజెక్ట్స్‌తో ఎంతో బిజీగా ఉంటున్నప్పటికీ వీలైనప్పుడల్లా ‘రాజా డీలక్స్’ (అధికారిక ప్రకటన రావాల్సి ఉంది) షూటింగ్‌లో పాల్గొంటున్నారు ప్రభాస్. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్స్ అని టాక్. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ ఈ వారంలో హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్, మాళవిక మోహనన్‌లపై కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారట చిత్రయూనిట్. ఈ షెడ్యూల్ పూర్తి కాగానే మళ్లీ ‘సలార్’ సెట్స్‌లో జాయిన్ అవుతారట ప్రభాస్. కాగా ‘సలార్’ చిత్రం ఈ ఏడాది సెప్టెంబరు 28న, ‘ప్రాజెక్ట్ కె’ వచ్చే ఏడాది జనవరి 12న రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. కాగా ప్రభాస్ నటించిన మైథలాజికల్ ఫిల్మ్ ‘ఆదిపురుష్’ ఈ జూన్ 16న రిలీజ్ కానుంది. అదేవిధంగా ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ‘స్పిరిట్’ మూవీ రూపొందనుంది. ఈ సినిమాల వరుస షూటింగ్‌లు, వాటి తాలూకు ప్రమోషన్స్‌తో ప్రభాస్ ఫుల్ బిజీగా ఉండటం ఖాయంగా కనిపిస్తోంది.



‘కళాతపస్వికి కళాంజలి’ లో హీరో చిరంజీవితో నటీమణులు

## విశ్వనాథ్‌గారు ఆ నమ్మకాన్ని ఇచ్చారు – చిరంజీవి

“కె.విశ్వనాథ్‌గారు వృత్తి పరంగా, ప్రవృత్తి పరంగా (నటుడిగా) పరిపూర్ణమైన జీవితం అనుభవించారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకున్నా ఆణిముత్యాల్లాంటి సినిమాల ద్వారా శాశ్వతంగా మన మనసుల్లో ఉంటారు’’ అని హీరో చిరంజీవి అన్నారు. ఫిబ్రవరి 19న(ఆదివారం) కె.విశ్వనాథ్ జయంతి. ఈ సందర్భంగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల ఆధ్వర్యంలో ‘కళాతపస్వికి కళాంజలి’ కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి మాట్లాడుతూ–‘‘కె.విశ్వనాథ్‌గారి జయంతిని మనం ఒక సంబరంలా జరుపుకోవాలి. ఆయన వదిలి వెళ్లిన కీర్తి, తీపి జ్ఞాపకాలు మనకు మిగిలిన గొప్ప అనుభవాలు.. జీవితాంతం మనం గుర్తుకు తెచ్చుకుని సంతోషించే ఆయన గుర్తులు. మూడు సినిమాల్లో నాకు అద్భుతమైన పాత్రలు ఇచ్చి, నాకు అవార్డులు తీసుకొచ్చిన నటనను నా నుంచి రాబట్టిన దర్శకుడాయన. నటనలో మెళకువలు చెబుతూ, హావభావాలు ఎలా పలికించాలో గురువులా నేర్పించారు. షూటింగ్ చేస్తున్నప్పుడు నన్ను ఒక నటుడిలాగా కాకుండా ఓ బిడ్డలాగా ఆయనతో పాటు కూర్చొబెట్టుకునేవారు. కంచిలో ఓ సినిమా షూటింగ్ చేస్తున్నప్పుడు ఆయన పెరుగు అన్నం కలిపించి నాకు పంపించినప్పుడు తినకుండా ఎలా కాదనగలను? ఆ సమయంలో ఓ తండ్రిలాగా అనిపించారాయన. యాక్షన్ హీరోగా నిలదొక్కుకుంటున్న సమయంలో ఆయనతో తొలిసారి ‘శుభలేఖ’ చేసే అవకాశం వచ్చింది. ఆయన చాలా స్ట్రిక్ట్‌గా ఉంటారని తెలియడంతో కొంచె టెన్షన్‌గా ఉండేది. డైలాగులు ఫాస్ట్‌గా కాదు.. అర్థమయ్యేలా కరెక్ట్‌గా పలకాలని చెప్పారాయన. ఆయన ఓ అద్భుతమైన నటుడు.. మన నుంచి ఒరిజినాలిటీని రాబట్టుకుంటారు. నేను కూడా క్లాసికల్ డ్యాన్స్ చేయగలను అనే నమ్మకాన్ని ఇచ్చింది విశ్వనాథ్‌గారు. నేను మాస్ హీరోగా దూసుకెళుతున్న సమయంలో ‘స్వయం కృషి’ లాంటి మంచి సందేశాత్మక చిత్రం చేయించారాయన. ‘ఆపద్బాంధవుడు’ చిత్రంలో ఓ సీన్ కోసం ఆయనవద్దకు వెళ్లి రాత్రి రిహార్సల్స్ చేశాను.. మరుసటి రోజు ఆ సన్నివేశం అద్భుతంగా వచ్చింది. ఎమోషన్స్‌ని అద్భుతంగా తీయగలరు విశ్వనాథ్‌గారు. ఆయన వద్ద నేను నేర్చుకున్న అంశాలను నాతో పనిచేస్తున్న దర్శకులకు చెబుతుంటాను. విశ్వనాథ్‌గారి వద్ద పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం’’ అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ–‘‘యువహీరో తారకరత్న పరమదించడం బాధగా ఉంది’’ అన్నారు. ‘కళాతపస్వికి కళాంజలి’ లో కె.విశ్వనాథ్‌తో పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఆయనతో తమకున్న అనుబంధాలను వారు పంచుకున్నారు.


ఈ కార్యక్రమంలో కె.విశ్వనాథ్ పెద్దబ్బాయి కె.నాగేంద్ర నాథ్, ఆర్.నారాయణ మూర్తి, కె.రాఘవేంద్ర రావు, రమేశ్ ప్రసాద్, కేఎస్ రామారావు, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, మాజీ ఎంపీ ‘కళాబంధు’ టి.సుబ్బరామి రెడ్డి, ‘శంకరాభరణం’ తులసి, మంజు భార్గవి, శివలెంక కృష్ణప్రసాద్, మురళీ మోహన్, సి.అశ్వినీదత్, దామోదర్ ప్రసాద్, సుమలత, రాజశేఖర్, అలీ, భానుచందర్, శేఖర్ కమ్ముల తదితరులు పాల్గొన్నారు.



విజయ్ దేవరకొండ, సమంత

## ఖుషీ ఖుషీగా..

‘ఖుషి’ సినిమా మార్చిలో మళ్లీ షురూ కానుంది. విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వంలో ‘ఖుషి’ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా మయోసైటిస్ వ్యాధి కారణంగా సమంత షూటింగ్స్‌కి కొంచెం విరామం ఇవ్వడంతో ‘ఖుషి’ చిత్రీకరణ ఆలస్యం అవుతోంది. ఈ వ్యాధి నుంచి కోలుకుంటున్న సమంత ఇటీవల ముంబైలో జరిగిన హిందీ వెబ్‌సిరీస్ ‘సిటాడెల్’ షూటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో త్వరలో ‘ఖుషి’ సినిమా షూటింగ్‌ను కూడా షురూ చేయనున్నారామె. మార్చి మొదటి వారంలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ తిరిగి ప్రారంభమవుతుందట. ఈ షెడ్యూల్‌లో విజయ్, సమంతలు పాల్గొంటారని టాక్. ఈ సంగతి ఇలా ఉంచితే ‘ఖుషి’ ని గత ఏడాది డిసెంబరు 23న రిలీజ్ చేయాలనుకున్నారు.. షూటింగ్ ఆలస్యం కావడంతో ఈ ఏడాది రిలీజ్ కానుంది.



హృతిక్ రోషన్

## వార్ సీక్వెల్‌కి రెడీ

హీరో హృతిక్ రోషన్, దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో వచ్చిన ‘బ్యాంగ్ బ్యాంగ్’ (2014), ‘వార్’ (2019) చిత్రాలు సూపర్ హిట్టయ్యాయి. ప్రస్తుతం వీరి కాంబినేషన్‌లోనే ‘ఫైటర్’ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని 2024 జనవరి 25న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. అయితే ‘వార్’ సినిమాకు సీక్వెల్‌గా రానున్న ‘వార్ 2’ ప్రస్తావన బాలీవుడ్‌లో మరోసారి తెరపైకి వచ్చింది. ‘వార్’ చిత్ర నిర్మాత ఆదిత్యా చోప్రా ‘వార్ 2’ ని వీలైనంత త్వరగా సెట్స్‌పైకి తీసుకువెళ్లాలనుకుంటున్నారట. దీంతో ‘ఫైటర్’ తర్వాత హృతిక్ రోషన్ చేయబోయేది ‘వార్ 2’ అని, ఈ ఏడాది చివర్లో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందని టాక్. ఈ సినిమా షూటింగ్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాతే ‘క్రిష్ 4’పై హృతిక్ ఫోకస్ పెడతారని బాలీవుడ్ టాక్. అయితే ‘వార్’ ని తెరకెక్కించిన సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలోనే ‘వార్ 2’ వస్తుందా? రాదా? అనే విషయంపై త్వరలో ఓ స్పష్టత రానుందని బాలీవుడ్‌లో వినికిడి.



కృతీశెట్టి

శర్వానంద్

## కొత్త జోడీ!

హీరో శర్వానంద్‌కి జోడీగా హీరోయిన్ కృతీశెట్టి నటిస్తున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. గత సెప్టెంబరులో విడుదలైన ‘ఒకే ఒక జీవితం’ (తమిళంలో ‘కణం’) సినిమా సక్సెస్ తర్వాత దర్శకుడు కృష్ణచైతన్యతో మూవీ చేయనున్నట్లు ప్రకటించారు శర్వానంద్. అయితే ఆ చిత్రాన్ని ప్రస్తుతం హోల్డ్‌లో ఉంచారట శర్వానంద్. దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య చెప్పిన కథ నచ్చడంతో వెంటనే సినిమాను స్టార్ట్ చేశారట. ఇందులో కృతీశెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారని, ఆల్రెడీ షూటింగ్ కూడా హైదరాబాద్‌లో జరుగుతోందని టాక్. శర్వా–కృతి తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ఈ సినిమాను నిర్మిస్తున్నారని తెలిసింది.

## రెంచ్ రాజుగా కార్తీ?

హీరో కార్తీ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపుదిద్దుకోనుందని టాలీవుడ్ టాక్. ‘ఊపిరి’ (2016) సినిమా తర్వాత తెలుగులో ఓ స్ట్రయిట్ ఫిల్మ్ చేయాలని ఆసక్తిగా ఉన్నారు కార్తీ. ఇందుకోసం కథలు కూడా వింటున్నారు. ఈ ప్రక్రియలో భాగంగానే పరశురామ్ చెప్పిన ఓ కథకు ఇంప్రెస్ అయ్యారట కార్తీ. దీంతో వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ సినిమా రానుందని, కథ పరంగా ఈ మూవీకి ‘రెంచ్ రాజు’ అనే టైటిల్ అనుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. కాగా ‘గీతగోవిందం’ తర్వాత విజయ్ దేవరకొండ తర్వాత మరో సినిమాకు కమిటయ్యారు పరశురామ్. అయితే ఆయన ఏ హీరోతో ముందుగా సినిమా చేస్తారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.



కార్తీ



## భారత షూటర్ వరుణ్‌కు కాంస్యం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్ కాంస్య పతకంతో బోణీ చేసింది. ఈజిప్ట్ రాజధాని కైరోలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో 19 ఏళ్ల వరుణ్ తోమర్ మూడో స్థానంలో నిలిచాడు. ఆదివారం జరిగిన ర్యాంకింగ్ రౌండ్‌లో నిర్ణీత ఐదు సిరీస్‌ల తర్వాత వరుణ్, సరబ్‌జ్యోత్ సింగ్ 250.6 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. 'షూట్ ఆఫ్ షాట్'లో వరుణ్ 10.3 పాయింట్లు స్కోరు చేసి కాంస్యం దక్కించుకోగా... సరబ్‌జ్యోత్ 10.1 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు.

## రన్నరప్ బోపన్న జోడీ

కెరీర్‌లో 23వ డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్నకు నిరాశ ఎదురైంది. ఏబీఎన్ అమ్రో ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ రన్నరప్‌గా నిలిచింది. నెదర్లాండ్స్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-7 (5/7), 6-2, 10-12తో ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా)-ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా) జోడీ చేతిలో ఓడింది. బోపన్న-ఎబ్డెన్‌లకు 67,960 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 56 లక్షల 24 వేలు) లభించింది.



# 'జడ్డూ' తిప్పేశాడు...

మూడో రోజు కూడా స్పిన్ తిరిగింది. అయితే ఆ మలుపు మనదే... గెలుపు మనదే. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ అంతా కంగారు కంగారే! రవీంద్ర జడేజా స్పిన్ మ్యాజిక్‌కు తోడు వారి చెత్త షాట్లు ఆసీస్‌ను నిలువునా కూల్చింది. అనుభవజ్ఞుడైన స్టీవ్ స్మిత్ సహా ఎవరూ క్రీజులో నిలిచే సాహసమే చేయలేకపోవడంతో భారత్ ఈ టెస్టునూ మూడు రోజుల్లోనే ముగించింది. 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'ని పదిలంగా నిలబెట్టుకుంది.

- 7 వికెట్లతో మెరిసిన రవీంద్ర జడేజా
- రెండో టెస్టులోనూ ఆసీస్ చిత్తు
- టీమిండియా 6 వికెట్లతో జయభేరి
- మన వద్దే 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'
- మార్చి 1 నుంచి ఇండోర్‌లో మూడో టెస్టు

**న్యూఢిల్లీ:** భారత్‌కు అచ్చొచ్చిన ఢిల్లీ వికెట్‌పై పర్యాటక జట్టే స్పిన్‌తో అల్లాడిస్తే... ఆతిథ్య జట్టు అంతకుమించే చేయాలి కదా! సరిగ్గా... టీమిండియా కూడా అదే చేసింది. ఒక్క సెషన్ అయినా పూర్తిగా ఆడనివ్వకుండానే ఆస్ట్రేలియాను ఆలౌట్ చేసింది. రవీంద్ర జడేజా (7/42) బిగించిన ఉచ్చులో ఆస్ట్రేలియా క్లీన్‌బౌల్డయింది. 31.1 ఓవర్లలోనే 113 పరుగులకే ఆ జట్టు కుప్పకూలింది. ఇందులో 12 ఓవర్లు, 61 పరుగులు క్రితం రోజువే కాగా... మూడో రోజు ఆసీస్ ఆడింది 19.1 ఓవర్లే! చేసింది కూడా 52 పరుగులే! అంటే సగటున ప్రతి రెండు ఓవర్లకు ఓ వికెట్‌ను సమర్పించుకుంది. అంతలా ప్రపంచ నంబర్‌వన్ టెస్టు జట్టు జడుసుకుంది. 'జడ్డూ' ఏకంగా ఐదుగురు బ్యాటర్లను బౌల్డ్ చేశాడు. అనంతరం 115 పరుగుల సులువైన లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 26.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసి గెలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో రెండు జట్ల బౌలర్లు ఎక్స్‌ట్రాలు ఇవ్వకపోవడం విశేషం. మ్యాచ్ మొత్తం లో పది వికెట్లు తీయడంతోపాటు కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన జడేజాకు వరుసగా రెండోసారి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. నాలుగు టెస్టుల సిరీస్‌లో 2-0తో ఉన్న భారత్ 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'ని తమ వద్దే అట్టిపెటుకుంది. క్రితంసారి కూడా భారతే గెలిచింది. ఇక ఈ సిరీస్‌లో మూడో టెస్టు మార్చి 1 నుంచి ఇండోర్‌లో జరుగుతుంది. ఇండోర్ టెస్టులోనూ భారత్ గెలిస్తే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా అర్హత సాధిస్తుంది.

**ఇలా మొదలై... అలా కూలింది!**

ఓవర్‌నైట్ స్కోరు 61/1తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా పతనం తొలి ఓవర్ నుంచే మొదలైంది. ఓపెనర్ హెడ్ (46 బంతుల్లో 43; 6 ఫోర్లు, 1 సిక్స్) అశ్విన్ బౌలింగ్‌లో ఒక బౌండరీ కొట్టి ఆఖరి బంతికి అవుటయ్యాడు. కాసేపటికే సీనియర్ బ్యాటర్ స్మిత్ (19 బంతుల్లో 9; 1 ఫోర్) కూడా అతని బౌలింగ్‌లోనే వికెట్ల ముందు దొరికాడు. తర్వాత జడేజా మాయాజాలం మొదలవడంతో కొత్తగా ఇంకెవరూ రెండంకెల స్కోరు చేయలేకపోయారు. ఓవర్‌నైట్ బ్యాటర్ లబుషేన్ (50 బంతుల్లో 35; 5 ఫోర్లు) సహా స్వల్ప వ్యవధిలో క్యారీ (7), కమిన్స్ (0), లయన్ (8), కున్‌మన్ (0)లను జడేజా క్లీన్‌బౌల్డ్ చేశాడు. కచ్చితత్వం లేని స్వీప్ షాట్లు, అనవసరమైన రివర్స్ స్వీప్ షాట్లు ఆస్ట్రేలియన్ల కొంపముంచాయి. ప్రపంచంలో ఎక్కడైనా పేస్ బంతులు బ్యాటర్లను బెంబేలెత్తిస్తాయి. కానీ ఇక్కడ స్లో డెలివరీలకే విలవిలలాడారు. దీంతో ఆదివారం ఆటలో 9 వికెట్లు చేతిలో ఉన్న ఆసీస్ కనీసం 20 ఓవర్లయినా ఆడలేకపోయింది. అశ్విన్‌కు 3 వికెట్లు దక్కాయి. స్పిన్ తిరగడంతో భారత ప్రధాన సీమర్ మొహమ్మద్ సిరాజ్‌కు బంతిని అప్పగించాల్సిన అవసరమే రాలేదు. లంచ్ బ్రేక్ అనంతరం సులువైన లక్ష్యఛేదనలో కెప్టెన్ రోహిత్ శర్మ (20 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) ధనాధన్ ఆడాడు. కానీ కేఎల్ రాహుల్ (1) తన వైఫల్యం కొనసాగించాడు. 100వ టెస్టు ఆడుతున్న పుజారా (74 బంతుల్లో 31 నాటౌట్; 4 ఫోర్లు) కుదురుగా ఆడగా, మధ్యలో విరాట్ కోహ్లి (31 బంతుల్లో 20; 3 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (12)ల వికెట్లు కూలాయి. అప్పటికే టీమిండియా విజయతీరానికి దగ్గరవగా మిగతా లాంఛనాన్ని కోన శ్రీకర్ భరత్ (22 బంతుల్లో 23 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి పుజారా పూర్తి చేశాడు. 27వ ఓవర్ వేసిన మర్ఫీ బౌలింగ్‌లో నాలుగో బంతిని పుజారా మిడ్ వికెట్ మీదుగా బౌండరీకి తరలించి భారత్‌ను గెలిపించాడు.



సిరాజ్, కోహ్లి, భరత్, జడేజా, అక్షర్ పటేల్

### స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 263; భారత్ తొలి ఇన్నింగ్స్: 262; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఉస్మాన్ ఖాజా (సి) శ్రేయస్ అయ్యర్ (బి) జడేజా 6; ట్రవిస్ హెడ్ (సి) శ్రీకర్ భరత్ (బి) అశ్విన్ 43; లబుషేన్ (బి) జడేజా 35; స్మిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 9; రెన్‌షా (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 2; హ్యాండ్స్‌కాంబ్ (సి) కోహ్లి (బి) జడేజా 0; క్యారీ (బి) జడేజా 7; కమిన్స్ (బి) జడేజా 0; లయన్ (బి) జడేజా 8; మర్ఫీ (నాటౌట్) 3; కున్‌మన్ (బి) రవీంద్ర జడేజా 0; **మొత్తం (31.1 ఓవర్లలో ఆలౌట్) 113. వికెట్ల పతనం:** 1-23, 2-65, 3-85, 4-95, 5-95, 6-95, 7-95, 8-110, 9-113, 10-113. **బౌలింగ్:** అశ్విన్ 16-3-59-3, మొహమ్మద్ షమీ 2-0-10-0, రవీంద్ర జడేజా 12.1-1-42-7, అక్షర్ పటేల్ 1-0-2-0.

**భారత్ రెండో ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (రనౌట్) 31; కేఎల్ రాహుల్ (సి) అలెక్స్ క్యారీ (బి) లయన్ 1; చతేశ్వర్ పుజారా (నాటౌట్) 31; విరాట్ కోహ్లి (స్టంప్డ్) క్యారీ (బి) మర్ఫీ 20; శ్రేయస్ అయ్యర్ (సి) మర్ఫీ (బి) నాథన్ లయన్ 12; శ్రీకర్ భరత్ (నాటౌట్) 23; **మొత్తం (26.4 ఓవర్లలో 4 వికెట్లకు) 118. వికెట్ల పతనం:** 1-6, 2-39, 3-69, 4-88. **బౌలింగ్:** కున్‌మన్ 7-0-38-0, నాథన్ లయన్ 12-3-49-2, టాడ్ మర్ఫీ 6.4-2-22-1, ట్రవిస్ హెడ్ 1-0-9-0.

**100** అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్‌లలో కలిపి ఆస్ట్రేలియాపై భారత్‌కిది 100వ విజయం. మూడు ఫార్మాట్‌లలో రెండు జట్ల మధ్య 273 మ్యాచ్‌లు జరిగాయి. ఆసీస్‌తో 104 టెస్టులు ఆడిన భారత్ 32 విజయాలు అందుకొని, 43 పరాజయాలు చవిచూసింది. ఒక మ్యాచ్ 'టై'కాగా, 28 'డ్రా'గా ముగిశాయి. 143 వన్డేల్లో టీమిండియా 53 మ్యాచ్‌ల్లో గెలిచి, 80 మ్యాచ్‌ల్లో ఓడింది. 10 మ్యాచ్‌లు రద్దయ్యాయి. 26 టి20 మ్యాచ్‌ల్లో భారత్ 15 విజయాలు సాధించి, 10 మ్యాచ్‌ల్లో ఓడింది. ఒక మ్యాచ్ రద్దయింది.



**25,012** అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్ (టెస్టు, వన్డే, టి20)లలో కలిపి కోహ్లి సాధించిన పరుగులు (492 మ్యాచ్‌లు). సచిన్ (664 మ్యాచ్‌ల్లో 34,357 పరుగులు) తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయ క్రికెటర్ కోహ్లి కాగా... 25 వేల పరుగులు సాధించిన క్రికెటర్ల జాబితా లో కోహ్లి ఆరో స్థానంలో ఉన్నాడు.

**8** సొంతగడ్డపై టెస్టుల్లో జడేజాకిది ఎనిమిదో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు. భారత్ తరఫున అనిల్ కుంబ్లే (9 సార్లు) 'టాప్'లో ఉండగా, సచిన్ (8 సార్లు) సరసన జడేజా నిలిచాడు.

## సౌరాష్ట్ర జట్టుదే రంజీ ట్రోఫీ టైటిల్





**కోల్‌కతా:** ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన సౌరాష్ట్ర జట్టు రెండోసారి రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలిచింది. బెంగాల్‌తో ఆదివారం ముగిసిన ఫైనల్లో జైదేవ్ ఉనాద్కట్ నాయకత్వంలోని సౌరాష్ట్ర తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపొందింది. ఓవర్‌నైట్ స్కోరు 169/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్ 241 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ ఆరు వికెట్లు తీయగా... మరో పేసర్ చేతన్ సకారియా మూడు వికెట్లు పడగొట్టాడు. బెంగాల్ నిర్దేశించిన 12 పరుగుల లక్ష్యాన్ని సౌరాష్ట్ర ఒక వికెట్ నష్టపోయి ఛేదించింది. మ్యాచ్ మొత్తంలో పది వికెట్లు తీసిన ఉనాద్కట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' అవార్డురాగా... టోర్నీ మొత్తంలో 907 పరుగులు సాధించిన అర్పిత్ (సౌరాష్ట్ర) 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు దక్కించుకున్నాడు. 2020లో బెంగాల్ జట్టునే ఓడించి సౌరాష్ట్ర తొలిసారి రంజీ చాంపియన్‌గా నిలిచింది. 1990లో చివరిసారి రంజీ ట్రోఫీ టైటిల్ నెగ్గిన బెంగాల్ ఆ తర్వాత ఐదుసార్లు ఫైనల్ చేరగా... ఐదుసార్లూ ఓడిపోయి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది.

## ఇంగ్లండ్ భారీ విజయం

**మౌంట్ మాంగనుయ్:** పేస్ బౌలర్లు అండర్సన్ (4/18), స్టువర్ట్ బ్రాడ్ (4/49) న్యూజిలాండ్‌ను హడలెత్తించడంతో... తొలి టెస్టులో ఇంగ్లండ్ 267 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. 394 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 45.3 ఓవర్లలో 126 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది.



దాంతో 2008 తర్వాత న్యూజిలాండ్ గడ్డపై ఇంగ్లండ్‌కు టెస్టు విజయం దక్కింది. ఓవర్‌నైట్ స్కోరు 63/5తో ఆదివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ మరో 63 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయింది.

## జైదేవ్ ఉనాద్కట్‌కు పిలుపు

**ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన**



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో వచ్చే నెలలో (17, 19, 22న) జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును ఆదివారం బీసీసీఐ ప్రకటించింది. గత డిసెంబర్‌లో జరిగిన దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో 19 వికెట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచిన సౌరాష్ట్ర జట్టు కెప్టెన్, ఎడంచేతి వాటం పేసర్ జైదేవ్ ఉనాద్కట్‌కు జాతీయ జట్టులోకి పిలుపు వచ్చింది. 31 ఏళ్ల ఉనాద్కట్ 2013లో చివరిసారి భారత్ తరఫున వన్డే ఆడాడు. గత నెలలో స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్ కోసం జట్టులో ఎంపికైన శ్రీకర్ భరత్, రజత్ పాటిదార్, షహబాజ్ అహ్మద్‌లను ఆస్ట్రేలియాతో సిరీస్ కోసం ఎంపిక చేయలేదు. ఈ ముగ్గురి స్థానాల్లో జడేజా, అక్షర్ పటేల్, ఉనాద్కట్ జట్టులోకి వచ్చారు. వ్యక్తిగత కారణాలరీత్యా తొలి వన్డేకు రోహిత్ శర్మ అందుబాటులో ఉండటం లేదని, దాంతో తొలి వన్డేలో రోహిత్ స్థానంలో హార్దిక్ పాండ్యా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

**మార్పుల్లేని టెస్టు జట్టు**

ఆస్ట్రేలియాతో జరిగే తదుపరి రెండు టెస్టుల్లో పాల్గొనే భారత జట్టులో ఎలాంటి మార్పులు చోటు చేసుకోలేదు. తొలి రెండు టెస్టుల్లో బరిలోకి దిగిన జట్టునే కొనసాగించనున్నారు.

**భారత వన్డే జట్టు:** రోహిత్ (కెప్టెన్), హార్దిక్ (వైస్ కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, సూర్యకుమార్, రాహుల్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), జడేజా, కుల్దీప్, సుందర్, చహల్, షమీ, సిరాజ్, ఉమ్రాన్, శార్దుల్, అక్షర్, ఉనాద్కట్.

## నేడు ఐర్లాండ్‌తో భారత్ పోరు

**సా. గం. 6:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో**



**కెబెహ (దక్షిణాఫ్రికా):** మహిళల టి20 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీలో భారత్ తమ గ్రూప్-2 చివరి లీగ్ మ్యాచ్‌లో నేడు ఐర్లాండ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని టీమిండియా గెలిస్తే ఆరు పాయింట్లతో నేరుగా సెమీఫైనల్ చేరుకుంటుంది. ఒకవేళ ఓడిపోతే మాత్రం మంగళవారం పాకిస్తాన్-ఇంగ్లండ్ జట్ల మధ్య మ్యాచ్ ఫలితంపై భారత జట్టు సెమీఫైనల్ అవకాశాలు ఆధారపడి ఉంటాయి. గ్రూప్-2లో ప్రస్తుతం ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న ఇంగ్లండ్‌కు ఇప్పటికే సెమీస్ బెర్త్ ఖరారైంది.



## విద్య, ఉద్యోగ సమాచారం

### గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీప్యాట్)-2023

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించే గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీప్యాట్)-2023 నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో మంచి ర్యాంక్ పొందిన అభ్యర్థులకు దేశంలోని ప్రముఖ ఫార్మసీ కళాశాలల్లో తమకు నచ్చిన స్పెషలైజేషన్‌లో ఫార్మసీ పీజీ చదువుకోవడానికి వీలవుతుంది. దేశంలో దాదాపు 870ఫార్మసీ కళాశాలల్లో ఎంఫార్మసీలో ప్రవేశానికి జీప్యాట్ స్కోరు ఉపయోగపడుతుంది.

- **అర్హత:** ఇంటర్మీడియట్ తర్వాత ఫార్మసీలో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. బీఫార్మసీ పరీక్షా ఫలితాలు వెలువడిన చివరి సంవత్సరం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీటెక్(ఫార్మాస్యూటికల్ అండ్ ఫైన్ కెమికల్ టెక్నాలజీ)/తత్సమాన అభ్యర్థులు దీనికి అర్హులు కాదు. **వయసు:** జీప్యాట్-2023 దరఖాస్తుకు వయసుతో సంబంధం లేదు.
- **పరీక్ష విధానం:** ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలోనే ఉంటుంది. పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ప్రశ్నలు మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో అడుగుతారు. మొత్తం 500 మార్కులకు-125 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు చొప్పున తగ్గిస్తారు. పరీక్ష వ్యవధి 3 గంటలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.03.2023.
- **వెబ్‌సైట్:** gpat.nta.nic.in

### కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (సీమ్యాట్)-2023

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించే కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(సీమ్యాట్) ప్రకటన వెలువడింది. ఇందులో వచ్చిన స్కోరుతో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా వెయ్యి సంస్థల్లో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

- **అర్హత:** ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ప్రస్తుతం ఆఖరు సంవత్సరం కోర్సులు చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. **వయసు:** దరఖాస్తుకు వయసుతో సంబంధం లేదు.
- **పరీక్ష విధానం:** సీమ్యాట్‌లో 400 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు 4మార్కులు ఉంటుంది. ఆన్‌లైన్ పరీక్ష కాల వ్యవధి 3 గంటలు. నెగిటివ్ మార్కులు ఉంటాయి. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి ఒక్కో మార్కు చొప్పున తగ్గిస్తారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.03.2023
- **వెబ్‌సైట్:** cmat.nta.nic.in

# ఒక్క పరీక్షతో.. 44 సెంట్రల్ వర్సిటీల్లో ప్రవేశం!

» సీయూఈటీ-యూజీ-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో యూజీ ప్రవేశాలకు ఉమ్మడి పరీక్ష
» మే 21 నుంచి 31 వరకు ఆన్‌లైన్ విధానంలో ఎంట్రన్స్
» అకడమిక్ నైపుణ్యాలతో మెరుగైన స్కోర్

ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థుల్లో ఎక్కువ మంది ఇంజనీరింగ్, మెడిసిన్ వైపు మొగ్గుచూపుతున్నారు. మరోవైపు నేటికీ లక్షల మంది విద్యార్థులు సంప్రదాయ డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నారు. అయితే ఈ డిగ్రీని ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో పూర్తి చేసుకోవాలని ఆశిస్తున్నారు. అలాంటి వారికి చక్కటి మార్గంగా నిలుస్తోంది.. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ-యూజీ). ఇందులో మెరుగైన స్కోర్ సాధిస్తే.. ప్రసిద్ధ 44 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు ఖరారు చేసుకోవచ్చు. ఇటీవల సీయూఈటీ-యూజీ-2023కి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. సీయూఈటీ-యూజీతో ప్రయోజనాలు, పరీక్ష విధానం, ఈ ఎంట్రెన్స్‌లో బెస్ట్ స్కోర్ సాధించేందుకు మార్గాలు..

సెంట్రల్ యూనివర్సిటీలు..జాతీయ స్థాయిలో పేరు గడించిన విద్యా సంస్థలు. వీటిలో ప్రవేశం కోసం గతంలో విద్యార్థులు ఒక్కో యూనివర్సిటీకి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. ఆయా యూనివర్సిటీ ప్రత్యేకంగా నిర్వహించే ఎంట్రెన్స్‌కు హాజరుకావల్సి వచ్చేది. దీంతో ఆర్థిక భారం, సమయాభావం వంటి సమస్యలు ఎదురయ్యేవి. దీనికి పరిష్కారంగా జాతీయ స్థాయిలో అన్ని సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాల కోసం ఉమ్మడి పరీక్ష నిర్వహించాలనే ఉద్దేశంతో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ యూజీ)కి శ్రీకారం చుట్టారు. ఈ ఒక్క పరీక్షలో మెరిట్ ఆధారంగా.. దేశవ్యాప్తంగా ఉన్న 44 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశం ఖరారు చేసుకోవచ్చు.



సీయూఈటీ-యూజీ 2023

#### పదమూడు భాషల్లో పరీక్ష

సీయూఈటీ-యూజీ పరీక్షను మొత్తం పదమూడు భాషల్లో నిర్వహిస్తున్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మళయాళం, మరాఠి, ఒడియా, పంజాబీ, తమిళం, ఉర్దూల్లో ఈ పరీక్షకు హాజరుకావచ్చు.

#### మూడు సెక్షన్లుగా.. సీయూఈటీ-యూజీ

సీయూఈటీ-యూజీ పరీక్షను మొత్తం మూడు సెక్షన్లుగా పరీక్ష నిర్వహించనున్నారు. ఆ వివరాలు..

| సెక్షన్ | సబ్జెక్ట్ అంశాలు | ప్రశ్నల సంఖ్య |
|---|---|---|
| సెక్షన్-1ఎ (లాంగ్వేజెస్) | 13 లాంగ్వేజెస్ | 50 |
| సెక్షన్-1బి (లాంగ్వేజెస్) | 20 లాంగ్వేజెస్ | 50 |
| సెక్షన్-2 (డొమైన్ సబ్జెక్ట్స్) | 27 డొమైన్ సబ్జెక్ట్‌లు | 45/50 |
| సెక్షన్-3 జనరల్ టెస్ట్ | జీకే, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ | 60 |

- సెక్షన్-1ఎలో అభ్యర్థులు 13 భాషల్లో ఏదో ఒక భాషను ఎంచుకోవచ్చు.
- సెక్షన్-1బిలో అభ్యర్థులు 20 భాషల్లో ఏదో ఒక భాషను ఎంచుకోవచ్చు.
- సెక్షన్-2 డొమైన్ సబ్జెక్ట్స్ విభాగంలో.. మొత్తం 27 డొమైన్ సబ్జెక్ట్స్ అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్ట్‌ను ఎంచుకోవచ్చు. • సెక్షన్-2లో 45 లేదా 50 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో చాయిస్ విధానం మేరకు అభ్యర్థులు 35 లేదా 40 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.
- మొత్తం 3 సెక్షన్లలో అభ్యర్థులు గరిష్టంగా పది సబ్జెక్ట్‌లను ఎంచుకునే అవకాశం కల్పించారు.
- సెక్షన్-1ఎ, సెక్షన్-1బి లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లకు సంబంధించి ఎన్‌టీఏ నిర్దేశిత జాబితాలోని లాంగ్వేజ్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది. -ప్రతి ప్రశ్నకు 5 మార్కులు కేటాయిస్తారు.
- నెగెటివ్ మార్కింగ్ నిబంధన మేరకు ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు. • సెక్షన్-1ఎ లాంగ్వేజెస్ వివరాలు: అస్సామీ, ఇంగ్లిష్, హిందీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మళయాళం, మరాఠి, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ.

#### సెక్షన్-1బి లాంగ్వేజెస్ వివరాలు

అరబిక్, బోడో, చైనీస్, డోగ్రి, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, జపనీస్, కశ్మీరి, కొంకణి, మైథిలి, మణిపురి, నేపాలి, పర్షియన్, రష్యన్, సింధి, స్పానిష్, టిబెటిన్, సంస్కృతం.

#### డొమైన్ సబ్జెక్ట్‌ల వివరాలు

- మొత్తం 27 డొమైన్ సబ్జెక్ట్‌లు అందుబాటులో ఉన్న నేపథ్యంలో వాటి వివరాలు..
- అకౌంటెన్సీ/బుక్ కీపింగ్; అగ్రికల్చర్; ఆంత్రోపాలజీ; బయాలజీ/బయోలాజికల్ స్టడీస్/బయోటెక్/బయో కెమిస్ట్రీ; బిజినెస్ స్టడీస్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్; ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్; ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్; ఫైన్ ఆర్ట్స్/విజువల్ ఆర్ట్స్/కమర్షియల్ ఆర్ట్; జాగ్రఫీ/జియాలజీ; హిస్టరీ; హోమ్‌సైన్స్; నాలెడ్జ్ ట్రెడిషన్ ప్రాక్టీసెస్ ఇండియా; లీగల్ స్టడీస్; మాస్ మీడియా/మాస్ కమ్యూనికేషన్; మ్యాథమెటిక్స్; పెర్ఫార్మింగ్ ఆర్ట్స్; ఫిజికల్ ఎడ్యుకేషన్/ఎన్‌సీసీ/యోగా; ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్; సైకాలజీ; సంస్కృతం; టీచింగ్ ఆప్టిట్యూడ్.
- ఈ సబ్జెక్ట్‌లలో అభ్యర్థులు తమ అర్హతకు సరితూగే సబ్జెక్ట్‌లను ఎంచుకోవచ్చు. డొమైన్ సబ్జెక్ట్స్‌లో గరిష్ఠంగా ఆరింటిని ఎంచుకునే అవకాశం ఉంది.

#### లాంగ్వేజ్, డొమైన్ అంశాల్లో

జాతీయ స్థాయిలో నిర్వహించే సీయూఈటీ-యూజీ పరీక్ష తీరును పరిశీలిస్తే.. అభ్యర్థుల్లోని లాంగ్వేజ్ స్కిల్స్, అదే విధంగా విద్యార్థులు బ్యాచిలర్ డిగ్రీలో చేరాలనుకుంటున్న సబ్జెక్ట్‌పై ఉన్న అవగాహనను పరీక్షించేలా పరీక్ష నిర్వహిస్తారు.

#### మూడు షిఫ్ట్‌లలో పరీక్ష

మే 21 నుంచి మే 31 వరకు పది రోజుల పాటు సీయూఈటీని నిర్వహించనున్నారు. ప్రతి రోజు మూడు షిఫ్ట్‌లలో పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న సబ్జెక్ట్‌ల ఆధారంగా.. ఆయా సబ్జెక్ట్‌లకు నిర్దేశించిన షిఫ్ట్‌లలో పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది. దరఖాస్తు సమయంలోనే తాము హాజరవ్వాలనుకుంటున్న షిఫ్ట్ వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది.

#### స్కోర్ ఆధారంగా ప్రవేశం

సీయూఈటీ-యూజీలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు.. ఆ స్కోర్ ఆధారంగా సెంట్రల్ యూనివర్సిటీలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మలి దశలో ప్రతి సెంట్రల్ యూనివర్సిటీ కూడా ప్రత్యేక ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తుంది. అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించిన తర్వాత.. సెంట్రల్ యూనివర్సిటీలు అందుబాటులో ఉన్న సీట్లు, సీయూఈటీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు ఖరారు చేయనున్నాయి.

#### కనీసం 50 శాతం మార్కులు

సీయూఈటీ స్కోర్ ఆధారంగా సెంట్రల్ యూనివర్సిటీలకు దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు.. ఇంటర్మీడియెట్‌లో కనీసం యాభై శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందేలా చూసుకోవాలి. వాస్తవానికి సీయూఈటీ-యూజీకి ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత సరిపోతుందని ఎన్‌టీఏ వర్గాలు తెలిపాయి. కానీ..సెంట్రల్ యూనివర్సిటీలు మాత్రం మలిదశ ప్రవేశ ప్రక్రియ, దరఖాస్తు సమయంలో ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత తప్పనిసరి అని పేర్కొంటున్నాయి. కాబట్టి విద్యార్థులు ముందుగానే ఆయా వర్సిటీల ప్రవేశ అర్హతల నిబంధనలపై స్పష్టత ఏర్పరచుకోవాలి.

#### తెలుగు రాష్ట్రాల్లో 5 వర్సిటీలు

సీయూఈటీ-యూజీ-2023 స్కోర్ ఆధారంగా జాతీయ స్థాయిలో మొత్తం 44 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశ అవకాశం లభిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని.. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీ; తెలంగాణలోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలు ఈ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

#### ఇతర ఇన్‌స్టిట్యూట్స్ కూడా

- సీయూఈటీ-యూజీ స్కోర్‌తో సెంట్రల్ యూనివర్సిటీలతోపాటు పలు ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌కు కూడా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఎస్‌ఐటీ యూనివర్సిటీ, బీఎంఎల్ ముంజాల్ యూనివర్సిటీ తదితర మరో 50కు పైగా డీమ్డ్, ప్రైవేట్ యూనివర్సిటీలు కూడా సీయూఈటీ-యూజీ స్కోర్ ఆధారంగానే గతేడాది ప్రవేశాలు కల్పించాయి.
- ఈ ఏడాది ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అదే విధంగా మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని కొన్ని స్టేట్ యూనివర్సిటీలు కూడా సీయూఈటీ-యూజీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

#### మంచి స్కోర్‌కు మార్గాలివే

- జాతీయ స్థాయిలో నిర్వహించే సీయూఈటీకి లక్షల సంఖ్యలో పోటీ నెలకొంది. కాబట్టి అభ్యర్థులు మంచి స్కోర్ సాధించే దిశగా అడుగులు వేయాలి.
- పదో తరగతి, ఇంటర్మీడియెట్ అకడమిక్ పుస్తకాలను ఔపోసన పట్టాలి.
- డొమైన్ సబ్జెక్ట్‌ల కోసం ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి పుస్తకాలను అధ్యయనం చేయాలి.
- లాంగ్వేజ్ సబ్జెక్ట్‌ల కోసం సంబంధిత లాంగ్వేజ్‌ల గ్రామర్‌పై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా వాక్య నిర్మాణం, ప్రెసిస్ రైటింగ్, ప్యాసేజ్ రీడింగ్ ప్రాక్టీస్ చేయడమే కాకుండా.. సంబంధిత ప్రశ్నలను సాధన చేయాలి. అదే విధంగా.. రీడింగ్ కాంప్రహెన్షన్, సంబంధిత లాంగ్వేజ్‌లో లిటరరీ ఆప్టిట్యూడ్, వొకాబ్యులరీలలో పట్టు సాధించాలి.
- **జనరల్ టెస్ట్:** ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ నైపుణ్యాలను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు హిస్టరీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ పుస్తకాలను చదవాలి. అదే విధంగా కరెంట్ ఈవెంట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. క్వాంటిటేటివ్ రీజనింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల్లో రాణించడానికి అర్థగణిత అంశాలు, కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, నంబర్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.

#### ముఖ్య సమాచారం

- **అర్హత:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** మార్చి12, 2023
- **పరీక్ష కేంద్రం కేటాయింపు:** ఏప్రిల్ 30, 2023
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** మే రెండో వారంలో
- **సీయూఈటీ-యూజీ పరీక్ష తేదీలు:** మే 21 - మే 31,2023
- **వెబ్‌సైట్:** https://cuet.samarth.ac.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 317 | 92 |
| 61,003 | 17,944 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 11,787 | ▽ | 69 |
| డోజోన్స్ | 33,827 | △ | 130 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,004 | ▽ | 8 |
| డాక్స్ | 15,482 | △ | 52 |
| షాంఘై | 3,224 | ▽ | 25 |
| నికాయ్ | 27,513 | ▽ | 183 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 82.04 | 83.71 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 86.79 | 89.84 |
| € | యూరో | ఎస్‌బీఐ | 97.45 | 100.73 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 60.58 | 62.56 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 55.66 | 58.07 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 60.92 | 62.88 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.09 | 22.77 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.65 | 23.45 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.92 | 12.99 |

# నగదు రహిత వైద్యం.. నిశ్చింతగా..!




- క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌కు ప్రాధాన్యం
- పాలసీదారుపై చెల్లింపుల భారం తప్పుతుంది
- నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఎక్కువ ఉండాలి
- రూమ్‌రెంట్, కోపే షరతుల పట్ల జాగ్రత్త
- ఇవి లేకుండా చూసుకుంటేనే ప్రయోజనం

**హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకోవడం వెనుక ముఖ్య ఉద్దేశం.. అత్యవసర పరిస్థితి ఏర్పడితే హాస్పిటల్‌లో చికిత్సను నగదు రహితంగా పొందొచ్చనే. సొంతంగా సమకూర్చుకునేంత వెసులుబాటు అందరికీ ఉండదు. కనుక హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకునే వారు తప్పకుండా దృష్టి పెట్టాల్సిన అంశాలలో క్యాష్‌లెస్ సదుపాయం కూడా ఒకటి. దాదాపు అన్ని బీమా సంస్థలు నగదు రహిత వైద్య సేవల సదుపాయాన్ని ప్లాన్‌లో భాగంగా ఆఫర్ చేస్తుంటాయి. ఈ క్యాష్‌లెస్ క్లెయిమ్ ప్రక్రియ సాఫీగా సాగిపోవాలి. సంక్లిష్టంగా ఉండకూడదు. కనుక నగదు రహిత క్లెయిమ్‌ల విషయంలో ఇబ్బంది పడకూడదంటే పాలసీదారులు తమవంతుగా కొన్ని చర్యలు తీసుకోవాలి. ఈ అంశాలన్నీ వివరించే కథనం ఇది...**

## నెట్‌వర్క్ హాస్పిటల్స్

హెల్త్‌ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకునే ముందు చూడాల్సిన ముఖ్యమైన అంశాల్లో హాస్పిటల్ నెట్‌వర్క్ జాబితా ఒకటి. సదరు బీమా సంస్థ నెట్ వర్క్ పరిధిలో ఎన్ని హాస్పిటల్స్ ఉంటే అంత అనుకూలమని అర్థం చేసుకోవచ్చు. మీరు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో మొత్తం ఎన్ని హాస్పిటల్స్ నెట్‌వర్క్ పరిధిలో ఉన్నాయనే వివరాలను బీమా సంస్థ వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చు.




ఎక్కువ ఆస్పత్రులు ఉండడం వల్ల సమీపంలోని ఆస్పత్రిలో చేరి నగదు రహిత వైద్య సేవలు పొందే వెసులుబాటు ఉంటుంది. అంతే కాదు నగదు రహిత వైద్య సేవలు పొందే విషయంలో మరి కొన్ని అంశాలను కూడా దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. పాలసీ నియమ, నిబంధనలు, మినహాయింపులు, రూమ్ రెంట్ పరిమితులు గురించి కూడా తెలియాలి.

## డాక్యుమెంట్లు

బీమా సంస్థలు జారీ చేసే హెల్త్ కార్డ్‌ను చికిత్స సమయంలో వెంట తీసుకెళ్లాలి. ఫిజికల్ కార్డు లేకపోయినా పాలసీ సాఫ్ట్ కాపీ తీసుకెళ్లినా చాలు. ఆధార్, పాన్ కూడా వెంట ఉంచుకోవాలి. లేదంటే చిరునామా ధ్రువీకరణ ఉండాలి. ముఖ్యంగా ప్రయాణ సమయాల్లో వెంట హెల్త్ కార్డ్ ఉండేలా చూసుకోవాలి. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినా, ప్రమాదానికి గురైనా వెంట ఉండే వారు ఆ కార్డ్ ఆధారంగా ఆస్పత్రిలో చేర్పించడం సులభతరం అవుతుంది.







## మినహాయింపులు/కోపే

హాస్పిటల్‌లో అయిన అన్ని ఖర్చులనూ బీమా సంస్థ తిరిగి చెల్లిస్తుందని అనుకోవద్దు. డిస్పోజబుల్స్ లేదా కన్స్యూమబుల్స్ (గ్లోవ్‌లు, కాటన్, సిరంజీలు, మాస్కులు, శానిటైజర్లు)కు ఎక్కువ శాతం ప్లాన్‌లు చెల్లింపులు చేయవు. అలాగే, చికిత్సలో భాగంగా రోగి అదనపు సేవలను పొందితే వాటికి అయ్యే వ్యయాలను పాలసీదారు సొంతంగా భరించాల్సి వస్తుంది. ఇంకా రిజిస్ట్రేషన్, అడ్మినిస్ట్రేటివ్ లేదా సర్వీస్ చార్జీలకు కూడా చెల్లింపులు రావు. కేర్, మ్యాక్స్ బూపా, డిజిట్, టాటా ఏఐజీ కన్స్యూమబుల్ రైడర్లను ప్రత్యేకంగా ఆఫర్ చేస్తున్నాయి. హెల్త్ ప్లాన్‌కు అనుబంధంగా ఈ రైడర్ తీసుకుంటే, కన్స్యూమబుల్స్‌కు అయ్యే చార్జీలకు కూడా బీమా సంస్థే చెల్లిస్తుంది. హెల్త్ ప్లాన్‌లో కోపే ఆప్షన్ ఎంపిక చేసుకోకపోవడమే మంచిది. కోపే అంటే క్లెయిమ్ మొత్తంలో నిర్ణీత శాతం (ఉదాహరణకు 10–20 శాతం) పాలసీదారుడే చెల్లించుకోవడం. దీన్ని ఎంపిక చేసుకుంటే పాలసీ ప్రీమియం తగ్గుతుంది. కానీ, ఆస్పత్రిలో చెల్లించే భారం పడుతుంది. కొన్ని ప్లాన్లలో వ్యాధుల వారీ కోపే ఆప్షన్ ఉంటుంది. ఆయా చికిత్సలకు సంబంధించి మాత్రమే కోపే నిబంధన అమలవుతుంది. ఇవి లేకుండా చూసుకోవాలి. ఒకవేళ కోపే ఆప్షన్ ఎంచుకుంటే తనవంతు చెల్లింపులకు వీలుగా అత్యవసర వైద్య నిధి సమకూర్చుకోవడం అవసరం.

## ముందుగా తెలియజేయాలి..

ఏదైనా ప్రమాదం లేదంటే మరో అత్యవసర అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాల్సి వస్తే.. దగ్గర్లోని నెట్‌వర్క్ హాస్పిటల్‌కు వెళ్లడం మంచి నిర్ణయం అవుతుంది. ఒకవేళ నెట్‌వర్క్ హాస్పిటల్ మరీ దూరంలో ఉండి, రోగి పరిస్థితి సీరియస్‌గా ఉంటే సమీపంలోని ఏదో ఒక ఆస్పత్రికి వెళ్లాల్సి రావచ్చు. అలాంటి పరిస్థితుల్లో వేరే మార్గం ఉండకపోవచ్చు. కాకపోతే కొన్ని రకాల చికిత్సలు ముందస్తు ప్రణాళిక మేరకు తీసుకునేవి ఉంటాయి. ఉదాహరణకు మోకాలి శస్త్రచికిత్స, హెర్నియా ఆపరేషన్, క్యాటరాక్ట్ సర్జరీ ఇవన్నీ ముందు అనుకుని తీసుకునే చికిత్సలు. ఇలాంటి వాటికి బీమా సంస్థ లేదంటే థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్ (టీపీఏ/బీమా మధ్యవర్తి) నుంచి ముందుగానే అనుమతి తీసుకోవాలి. హాస్పిటల్‌లో చేరడానికి వారం ముందు అనుమతి కోరొచ్చు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్, ఇతర ఆధారాలను టీపీఏ లేదా బీమా కంపెనీ కస్టమర్ కేర్‌కు మెయిల్ చేయాలి. కాల్‌సెంటర్‌కు కాల్ చేసి ఇందుకు సంబంధించి వివరాలు పొందొచ్చు. వారు అడిగిన అన్ని వివరాలు, పత్రాలు ఇస్తే అనుమతి మంజూరు అవుతుంది. ముందస్తు ప్రణాళిక మేరకు తీసుకునే చికిత్సలకు అనుమతి విషయమై హాస్పిటల్‌లోని ఇన్సూరెన్స్ విభాగం సిబ్బంది సాయాన్ని తీసుకోవచ్చు. బీమా సంస్థ లేదా టీపీఏ నుంచి నగదు రహిత వైద్య సేవల కోసం అనుమతి లేఖను తీసుకోవాలి. చికిత్స కోసం హాస్పిటల్‌కు వెళ్లినప్పుడు అడ్మిషన్ డెస్క్‌కు ఈ లేఖ సమర్పిస్తే సరిపోతుంది. అత్యవసరంగా చేరినట్టయితే బీమా సంస్థ లేదా టీపీఏకి 24 గంటల్లోపు సమాచారం ఇవ్వడం తప్పనిసరి. హాస్పిటల్ ఇన్సూరెన్స్ డెస్క్‌కు హెల్త్ ప్లాన్ వివరాలు ఇస్తే వారే బీమా కంపెనీకి సమాచారం ఇస్తారు.

## దూరం

బీమా సంస్థలకు దేశవ్యాప్తంగా ఆస్పత్రులతో టైఅప్ ఉంటుంది. ఒక ఆస్పత్రిని తన నెట్‌వర్క్ పరిధిలో చేర్చుకునే ముందు బీమా కంపెనీలు ఎన్నో అంశాలను చూస్తుంటాయి. ప్రభుత్వ గుర్తింపు, చికిత్సల చార్జీలు, సేవల నాణ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటాయి. మీ నివాసానికి సమీపంలో ఏఏ ఆసుపత్రి బీమా సంస్థ నెట్‌వర్క్ పరిధిలో ఉందనే వివరాలను సంబంధిత బీమా కంపెనీ పోర్టల్ నుంచి తెలుసుకోవచ్చు. బీమా సంస్థ కస్టమర్‌కేర్‌కు కాల్ చేసి అడిగినా వివరాలు అందిస్తారు. నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఎప్పుడూ స్థిరంగా ఉండవు. ఈ జాబితా మారుతుంటుంది. కొన్ని ఆసుపత్రులు జాబితా నుంచి బయటకు వెళ్లిపోయి, కొత్తవి చేరుతుంటాయి. బీమా సంస్థల పోర్టళ్లలో అప్‌డేటెడ్ వివరాలు అందుబాటులో ఉంటాయి. నెట్‌వర్క్ జాబితాలో ఉన్నాయంటే సదరు ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవలను పొందొచ్చని అర్థం చేసుకోవచ్చు. హెల్త్ ఇన్సూరెన్స్ కార్డ్‌ను హాస్పిటల్‌లో చేరే సమయంలో చూపిస్తే చాలు. హాస్పిటల్ ఇన్సూరెన్స్ డెస్క్ చికిత్స వ్యయాలకు బీమా సంస్థ నుంచి ఆమోదం తీసుకుంటుంది. బీమా కంపెనీ నుంచి ప్రాథమిక ఆమోదం వస్తే చాలు. రోగి నగదు చెల్లించే అవసరం ఏర్పడదు. బీమా సంస్థలే తుది బిల్లును కూడా సెటిల్ చేస్తాయి. పాలసీ నిబంధనల మేరకు కవరేజీ పరిధిలోకి రాని వాటికి మినహాయించి, మిగిలిన బిల్లును పరిష్కరిస్తాయి. అప్పుడు రోగి మిగిలిన మొత్తాన్ని తన వంతుగా చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో బీమా కంపెనీలు హాస్పిటల్ పంపించిన రికార్డుల ఆధారంగా నగదు రహిత సేవలకు అనుమతి ఇవ్వవు. కస్టమర్‌ను రీయింబర్స్‌మెంట్ విధానంలో క్లెయిమ్ చేసుకోవాలంటూ సమాచారం ఇచ్చే సందర్భాలు కూడా ఉంటాయి. నగదు రహిత సేవల నెట్‌వర్క్ హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స తీసుకోవడం వల్ల.. బిల్లులు, రీయింబర్స్‌మెంట్ పత్రాలతో హాస్పిటల్, బీమా కంపెనీల చుట్టూ క్లెయిమ్ కోసం తిరగాల్సిన శ్రమ తప్పుతుంది.

## రూమ్ రెంట్ పరిమితులు

ఆరోగ్య బీమా పాలసీల్లో రూమ్ రెంట్ పరిమితులు ఉండడం సహజం. పాలసీ తీసుకునే సమయంలోనే పరిమితులు లేకుండా 'ఎనీ రూమ్ టైప్' ఆప్షన్ ఎంపిక చేసుకుంటే ఎలాంటి సమస్య ఉండదు. కానీ, దీనికి కొంచెం ప్రీమియం అధికంగా ఉంటుంది. దీనికి బదులు సింగిల్ ప్రైవేటు రూమ్, షేర్డ్ రూమ్ పరిమితులు ఎంపిక చేసుకుంటే, ప్రీమియం కొంత తగ్గుతుంది. పాలసీదారులు కానీ, వారి కుటుంబ సభ్యులు కానీ తమ హెల్త్ ప్లాన్ రూమ్ రెంట్ పరిమితి గురించి తప్పకుండా అవగాహనతో ఉండాలి. అప్పుడే హాస్పిటల్‌లో చేరినప్పుడు పాలసీ అనుమతించిన రూమ్‌లోనే చేరడానికి వీలుంటుంది. ఒకవేళ పాలసీలో చెప్పినదానికి భిన్నమైన రూమ్ సేవలను పొందితే అప్పుడు పాలసీదారుపై చెల్లింపుల భారం పడుతుంది. కొన్ని ప్లాన్లు రూమ్ రెంట్‌ను సమ్ అష్యూరెన్స్‌లో ఒక శాతానికి పరిమితం చేస్తుంటాయి. అంటే రూ.5 లక్షల ప్లాన్‌లో రూ.5,000, రూ.10 లక్షల ప్లాన్‌లో రూ.10,000 చార్జీ (రోజుకు) మించని రూమ్‌లోనే చేరాల్సి ఉంటుంది. ప్రభుత్వరంగ సాధారణ బీమా సంస్థలు అయిన యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీల ప్లాన్లలో ఇలాంటి పరిమితులు ఉంటాయి. ఆస్పత్రుల్లో రూమ్‌ను బట్టి రోగికి అందించే చికిత్సలు, సేవల చార్జీలు మారిపోతుంటాయి. ప్రీమియం రూమ్ సేవలు పొందడం వల్ల బిల్లు భారీగా అవుతుంది. ఈ భారాన్ని తగ్గించుకునేందుకే బీమా సంస్థలు రూమ్ రెంట్ పరిమితి నిబంధనలు పెడుతుంటాయి. ఉదాహరణకు రూ.5,000 రూమ్ రెంట్ పరిమితి ఉన్న ప్లాన్ తీసుకుని.. రోజుకు రూ.10 వేలు చార్జీ చేసే రూమ్‌లో చేరారని అనుకుందాం. అప్పుడు మిగిలిన రూమ్ రెంట్ రూ.5,000ను పాలసీదారుడే భరించాలి. అంతేకాదు, రూమ్‌లో చికిత్సలకు అయిన వ్యయాల్లోనూ సగం పాలసీదారుడే చెల్లించాలి. కనుక రూమ్‌రెంట్ పరిమితి ఉన్న ప్లాన్ తీసుకుంటే, ఆ పరిధిలోని రూమ్‌లోనే చేరడం మర్చిపోవద్దు. లేదంటే రూమ్ రెంట్ పరిమితి లేని ప్లాన్‌కు మారిపోవడం లేదా, రూమ్‌రెంట్ వైవర్ రైడర్ తీసుకోవాలి.




## మెరుగైన రాబడులకు క్వాంటమ్ మల్టీ అసెట్ ఫండ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మెరుగైన రాబడులు అందుకోవడానికి పెట్టుబడుల విషయంలో వైవిధ్యం పాటించాల్సి ఉంటుందని క్వాంటమ్ అసెట్ మేనేజ్‌మెంట్ సీఐవో చిరాగ్ మెహతా తెలిపారు. ఈ దిశగా ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మించి రాబడులు పొందడానికి క్వాంటమ్ మల్టీ అసెట్ ఫండ్ ఆఫ్ ఫండ్ (క్యూఎంఏఎఫ్‌వోఎఫ్) తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. పెట్టుబడుల్లో వైవిధ్యానికి 12:20:80 వ్యూహం చక్కగా పని చేస్తుందని మెహతా చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడేలా కనీసం 12 నెలల ఖర్చులకు సరిపడే మొత్తాన్ని లిక్విడ్ ఫండ్‌లో ఉంచడం శ్రేయస్కరమని వివరించారు. 20 శాతాన్ని బంగారానికి, మిగతా 80 శాతాన్ని ఈక్విటీలకు కేటాయించడం ద్వారా వైవిధ్యం పాటించవచ్చని, ప్రతికూల పరిస్థితుల్లోనూ పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను కాపాడుకోవచ్చని మెహతా వివరించారు.

## ఎన్‌ఎఫ్‌వోలకు దూరంగా ఇన్వెస్టర్లు!

### 38 శాతం తక్కువగా నిధుల సమీకరణ




న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ సంస్థల కొత్త పథకాల (ఎన్‌ఎఫ్‌వోలు) పట్ల ఇన్వెస్టర్లు గతేడాది అప్రమత్తతతో వ్యవహరించారు. ఫలితంగా ఏడాది మొత్తం మీద మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు ఎన్‌ఎఫ్‌వోల రూపంలో రూ.62,000 కోట్లను సమీకరించాయి. 2021లో ఎన్‌ఎఫ్‌వోల రూపంలో వచ్చిన పెట్టుబడులతో పోలిస్తే 38 శాతం తగ్గిపోయింది. కాకపోతే 2021లో 140 కొత్త పథకాలు మార్కెట్లోకి వస్తే, గతేడాది కొత్త పథకాలు 228కి పెరిగిపోవడం గమనార్హం.

| కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో) | |
|---|---|
| **20-2-2023** | |
| విశాఖ | 420-00 |
| చిత్తూరు | 458-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 409-00 |
| విజయవాడ | 409-00 |
| రిటైల్ ధర (డజను) | 66.00 |
| **19-2-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 329-00 |
| వరంగల్ | 394-00 |
| రిటైల్ ధర | 4.50 |

## ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ — ఎమ్‌కే గ్లోబల్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 92 టార్గెట్: రూ. 116

ఎందుకంటే: ఈ ఏడాది మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ హోల్డింగ్స్ అంచనాలకు మించుతూ రూ. 450 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇందుకు ప్రధానంగా వడ్డీ ఆదాయం సహకరించింది. రిటైల్ ప్రాడక్టులవైపు అసెట్స్(రుణాలు) మిక్స్ చేపట్టడంతో వడ్డీ ఆదాయం జోరందుకుంది. దీనికితోడు పండుగల సీజన్ కావడంతో రుణాలకు డిమాండ్ పెరిగింది. వార్షికంగా 33 శాతం, క్యూ2(జులై–సెప్టెంబర్)తో పోలిస్తే 19 శాతం చొప్పున రుణ వృద్ధి నమోదైంది. వ్యవసాయ పరికరాలు, ద్విచక్ర వాహన విభాగంలో కంపెనీ చరిత్రలోనే ఒక క్వార్టర్‌కు అత్యధికంగా క్యూ3లో రుణాల మంజూరీ నమోదైంది. మరోవైపు గృహ రుణాలు, ఆస్తుల హామీ ద్వారా జారీ చేసే రుణ(ఎల్‌ఏపీ) విభాగంలోనూ జోరు చూపింది. అయితే నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) త్రైమాసికవారీగా 1.9 శాతం నీరసించాయి. వార్షికంగా చూస్తే మాత్రం 3.4 శాతం బలపడ్డాయి. ఇందుకు హోల్‌సేల్ ఫైనాన్స్ బిజినెస్‌లో భారీగా ఎగసిన రీపేమెంట్స్, ప్రీపేమెంట్స్(రూ. 4,220 కోట్లు), రుణాల విక్రయం(సెల్‌డౌన్స్– రూ. 2,950 కోట్లు) ప్రభావం చూపాయి. కాగా.. రిటైల్ రంగ రుణ విడుదల వార్షిక ప్రాతిపదికన 52 శాతం జంప్‌చేసింది. దీంతో రిటైల్ ఏయూఎం 34 శాతం ఎగసి రూ. 57,000 కోట్లను తాకింది. వెరసి మొత్తం లోన్‌బుక్‌లో 64 శాతం వాటాకు చేరింది. వచ్చే ఏడాది చివరికల్లా రిటైల్ విభాగం వాటా 90 శాతానికి చేరవచ్చని అంచనా. అయితే హోల్‌సేల్ ఫైనాన్స్ ఏయూఎం 24 శాతం క్షీణించి రూ. 31,000 కోట్లకు పరిమితమైంది.




## ఏంజెల్ వన్ — ఐసీఐసీఐ సెక్యూరిటీస్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,111 టార్గెట్: రూ. 1,980

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం(క్యూ3)లో బ్రోకరేజీ దిగ్గజం ఏంజెల్ వన్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. సగటున 10 లక్షల మంది క్లయింట్లను జత చేసుకోవడం ద్వారా తొలి 9 నెలల(ఏప్రిల్–డిసెంబర్)లోనూ మెరుగైన పనితీరు చూపింది. ఆర్డర్ల సంఖ్యలోనూ సగటున నెలవారీ రన్‌రేట్ 7.4 కోట్లు(9 నెలల్లో) సాధించింది. వ్యయ క్రమబద్ధీకరణ(9 నెలల అమ్మకాలలో మొత్తం నిర్వహణా వ్యయాలు 48 శాతం) లోనూ పటిష్ట పనితీరుతో ఆకట్టుకుంది. ఈ అంశాలన్నీ ప్రస్తుత ఏడాది(2022–23), వచ్చే ఆర్థిక సంవత్సరం(2023–24)లలో షేరువారీ ఆర్జన(ఈపీఎస్) అంచనాల పెంపునకు దోహదం చేశాయి. వెరసి ఈపీఎస్‌లో వృద్ధి అంచనాలను ఈ ఏడాది, వచ్చే ఏడాదిలకు 9.5 శాతం, 11 శాతం చొప్పున పెంచాం. ఎన్‌ఎస్‌ఈ ఈక్విటీ ఆప్షన్స్ విభాగంలో లావాదేవీల పరిమాణం భారీగా దూసుకెళ్లడం సైతం అంచనాల పెంపునకు సహకరించింది. గత రెండేళ్లలో వార్షికంగా 126 శాతం వృద్ధి నమోదైంది. బ్రోకింగ్ సంస్థ ట్రాక్ రికార్డ్(గత రెండేళ్లలో ఆర్డర్ల సంఖ్య మూడు రెట్లు జంప్‌చేయడం), రిటైల్ పరిమాణంలో 21.5 శాతం వాటాతో సాధించిన పటిష్టత వంటి అంశాలు సానుకూల అంచనాలకు దారి చూపుతున్నాయి. అయితే ఏదేని కారణంవల్ల మార్కెట్‌లో లావాదేవీల పరిమాణం పడిపోవడం, లావాదేవీలు పెరిగిపోవడాన్ని నియంత్రించేందుకు(ప్రధానంగా ఈక్విటీ ఆప్షన్స్‌లో) నియంత్రణ సంస్థలు ఆంక్షలు విధించడం వంటి ప్రతికూలతలు ప్రధాన రిస్కులుగా పేర్కొనవచ్చు. 2023–24లో రూ. 940 కోట్ల నికర లాభం(రూ. 110 ఈపీఎస్) అంచనా వేస్తున్నాం.




గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

## అదానీ-హిండెన్‌బర్గ్ వివాద ప్రభావం భారత్‌పై ఉండదు..


### డీఎల్‌ఎఫ్ చైర్మన్ కేపీ సింగ్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: భారత్ వృద్ధి గాథపై అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్, అదానీ గ్రూప్ వివాద ప్రభావమేమీ ఉండబోదని రియల్ ఎస్టేట్ దిగ్గజం డీఎల్‌ఎఫ్ చైర్మన్ కేపీ సింగ్ స్పష్టం చేశారు. ఇది కేవలం ఒక కార్పొరేట్ గ్రూప్‌నకు మాత్రమే పరిమితమైన విషయమే తప్ప, దీనితో అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు భారత్‌పై నమ్మకమేమీ సడలబోదని పేర్కొన్నారు. పైస్థాయి నుంచి వచ్చిన ఒత్తిళ్ల కారణంగానే అదానీ గ్రూప్‌నకు బ్యాంకులు రుణాలు ఇచ్చి ఉంటాయనే అభిప్రాయాలను సింగ్ తోసిపుచ్చారు. అయితే అధిక వృద్ధి బాటలో ముందుకెళ్లాలంటే అదానీ గ్రూప్ రుణభారాన్ని తగ్గించుకుని, పెట్టుబడిని పెంచుకోవాలని సూచించారు. భారీగా షేర్ల విక్రయాల సమయంలో కొందరు బ్లాక్‌మెయిలర్లు నివేదికలతో బైటికొస్తుంటారని చెప్పారు.

## నిఫ్టీ సూచీలలో అదానీ గ్రూప్ షేర్లు

### మార్చి31 నుంచి మార్పులు




నిఫ్టీ ఇండెక్సులలో ఈ ఏడాది మార్చి31 నుంచి సవరణలు చేపడుతున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ తాజాగా వెల్లడించింది. నిఫ్టీ ఇండెక్సులలో ప్రయివేట్ రంగ కంపెనీలు అదానీ విల్మర్, అదానీ పవర్ తోపాటు పలు ఇతర కంపెనీలకు చోటు లభించనుంది. అదానీ విల్మర్ నిఫ్టీ నెక్ట్స్ 50, నిఫ్టీ 100కు ప్రాతినిధ్యం వహించనుంది. ఇక అదానీ పవర్‌కు నిఫ్టీ 500, 200లతోపాటు నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, 150, లార్జ్‌మిడ్ క్యాప్ 250, మిడ్‌స్మాల్ క్యాప్ 400లలో చోటు లభించనుంది. ఇండెక్సుల నిర్వహణ సబ్‌కమిటీ షేర్ల జాబితాలో సవరణలను నిర్ణయించినట్లు ఎన్‌ఎస్‌ఈ తెలియజేసింది. అయితే ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ–50లో ఎలాంటి మార్పులూ చేపట్టడంలేదని ఎన్‌ఎస్‌ఈ స్పష్టం చేసింది. కాగా.. నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్‌లో ఏబీబీ ఇండియా, కెనరా బ్యాంక్, పేజ్ ఇండస్ట్రీస్, వరుణ్ బెవరేజెస్ సైతం ప్రాతినిధ్యం వహించనున్నట్లు వెల్లడించింది. మరోవైపు బంధన్ బ్యాంక్, బయోకాన్, గ్లాండ్ ఫార్మా, ఎంఫసిస్, వన్ 97 కమ్యూనికేషన్స్‌లను నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్‌నుంచి తప్పిస్తున్నట్లు పేర్కొంది.

# ఫండ్ పథకాన్ని ఎప్పుడు మార్చాలి?




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



**మ్యూచువల్ ఫండ్ పథకానికి, న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌వో)కు మధ్య తేడా ఏంటి?**

– డి.తరుణ్

ప్రతీ మ్యూచువల్ ఫండ్ సంస్థ ఎప్పటికప్పుడు కొత్త పెట్టుబడుల నమూనాలతో నూతన పథకాలను (ఎన్‌ఎఫ్‌వో) తీసుకొస్తుంటాయి. ఇలా వచ్చిన పథకం కొంత కాలానికి పాతది అయిపోతుంది. ఆయా పథకం పెట్టుబడుల తీరు, మార్కెట్ కరెక్షన్లలో, మార్కెట్ ర్యాలీల్లో పథకాల పనితీరు ఎలా ఉందో పరిశీలించొచ్చు. ఎన్‌ఎఫ్‌వో అన్నది కొత్తగా మొదలయ్యే పథకం. ఇన్వెస్టర్లు అప్పగించిన పెట్టుబడులను ఆ ఫండ్ మేనేజర్ అప్పటి నుంచి ఇన్వెస్ట్ చేయడం మొదలు పెడతారు. కొత్త పథకం పెట్టుబడి లక్ష్యాలు, ఫండ్ మేనేజర్ గతంలో నిర్వహించిన పథకాల ట్రాక్ రికార్డు గురించి తెలుసుకోవచ్చు. అలాగే, ఎన్‌ఎఫ్‌వో ఆరంభమైన సమయంపై పనితీరు ఆధారపడి ఉంటుంది. మార్కెట్లు దిద్దుబాటుకు గురైన సమయాల్లో పథకాన్ని ప్రారంభించి, అనంతరం మార్కెట్లు పెరిగిపోతే సహజంగానే పథకంలో రాబడులు ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే కొత్త పథకం మార్కెట్లు గరిష్టాల్లో ఉన్నప్పుడా లేక కనిష్టాల్లో ఉన్నప్పుడు ప్రారంభమవుతుందా అన్నది ఇన్వెస్టర్ తప్పకుండా పరిశీలించాలి. ఎన్‌ఎఫ్‌వో రూపంలో మ్యూచువల్ ఫండ్స్ పెద్ద ఎత్తున పెట్టుబడులను సమీకరిస్తుంటాయి. ఇందుకోసం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తాయి. చాలా మంది ఎన్‌ఎఫ్‌వోల్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. ఇప్పటికే ఎన్నో పథకాలు అందుబాటులో ఉండగా ఎన్‌ఎఫ్‌వోల్లో అంత భారీ మొత్తంలో ఎందుకు ఇన్వెస్ట్ చేస్తున్నారనేది మాత్రం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

**మ్యూచువల్ ఫండ్స్ పథకాల మధ్య పెట్టుబడులను ఎటువంటి సందర్భాల్లో మార్చాల్సి వస్తుంది?**

– పవన్ కుమార్

మీరు ఇన్వెస్ట్ చేస్తున్న మ్యూచువల్ ఫండ్స్ పథకాలను రెండు రకాల కారణాల వల్ల మార్చాల్సి రావచ్చు. మొదట మీ లక్ష్యాల్లో మార్పులు చోటు చేసుకున్నప్పుడు పెట్టుబడులను వాటికి అనుగుణంగా సవరించుకోవాల్సి ఉంటుంది. లేదంటే లక్ష్యాలను చేరుకున్నప్పుడు కూడా ఈ అవసరం ఏర్పడుతుంది. ఉదాహరణకు మీరు దీర్ఘకాలం కోసం అంటే రిటైర్మెంట్ లేదా పిల్లల ఉన్నతవిద్య కోసం ఇన్వెస్ట్ చేస్తున్నారనుకుంటే.. కావాల్సిన మొత్తం సమకూరితే పెట్టుబడిని మొత్తం తీసేసుకోవచ్చు. నిర్ణీత కాలవ్యవధికి ముందే మీకు కావాల్సిన మొత్తం సమకూరితే ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. ఇక మీరు ఏదైనా ఒక పథకంలో కొన్ని కారణాలను చూసి ఇన్వెస్ట్ చేశారనుకోండి. ఆ తర్వాత ముందు చూసిన అంశాలు మారిపోయినట్టయితే మీ పెట్టుబడులను విక్రయించుకోవచ్చు. ఫండ్ మేనేజర్ మారిపోవడం పథకం నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకోవడానికి సరైన కారణం కాబోదు. కాకపోతే మీరు అప్రమత్తం అయ్యేందుకు ఒక కారణంగా చూడొచ్చు. గతంలో మంచి రాబడులను ఇచ్చిన పథకం కొత్త ఫండ్ మేనేజర్ నిర్వహణలో అంత మంచి పనితీరు చూపించకపోతే అప్పుడు వేరే పథకానికి మారిపోయే ఆలోచన చేయవచ్చు. అలాగే, నిలకడగా మంచి రాబడులను ఇస్తుందన్న కారణంతో ఒక పథకంలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. మీరు ఆశించిన విధంగా పనితీరు లేకపోయినా దాని నుంచి తప్పుకోవచ్చు.

ఊర్కొండ శివారులో పడిన బెలూన్




## పంట పొలాల్లో కూలిన భారీ బెలూన్

- టీఐఎఫ్ఆర్‌కు చెందిన రీసెర్చ్ బెలూన్‌గా గుర్తింపు
- ఊర్కొండ శివారులో బెలూన్ పడగా.. నాగర్‌కర్నూల్ జిల్లా తర్నికల్ వద్ద పడిపోయిన యంత్రం
- హైదరాబాద్‌కు తరలించిన అధికారులు

సాక్షి, నాగర్‌కర్నూల్/ కల్వకుర్తి రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామ శివారులో ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో ఆకాశం నుంచి ఓ భారీ బెలూన్‌కు సంబంధించిన యంత్రం కూలడం కలకలం సృష్టించింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బెలూన్ యంత్రాన్ని పరిశీలించారు. దానిని హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్)కు చెందిన బెలూన్‌గా గుర్తించారు. బెలూన్ యంత్రం తర్నికల్ సమీపంలోని పొలాల్లో పడిపోగా.. జిల్లాలోని ఊర్కొండ మండలం శివారులోని బండారు బాలయ్యకు చెందిన మామిడితోటలో తెలుపు రంగు భారీ బెలూన్ పడిపోయింది. దీని మొత్తం బరువు సుమారు 1,050 కిలోలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఒక్కసారిగా ఆకాశం నుంచి యంత్రం తమ దగ్గరలో వచ్చి పడిపోవడంతో భయం వేసిందని, కాసేపటి వరకు ఏమీ అర్థం కాలేదని రాజిరెడ్డి అనే రైతు చెప్పారు. టీఐఎఫ్ఆర్‌కు చెందిన హరినాయక్ నేతృత్వంలోని బృందం బెలూన్, యంత్ర పరికరాలను హైదరాబాద్‌కు తరలించింది.

### ఖగోళ, వాతావరణ పరిశోధన కోసమే..

అంతరిక్ష పరిశోధనలతోపాటు భూ ఉపరితలంపై వాతావరణ కాలుష్యం, ఓజోన్ పొర పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు హైదరాబాద్‌లోని తమ బెలూన్ ఫెసిలిటీ సెంటర్ నుంచి ఈ నెల 17న ప్లాస్టిక్ రీసెర్చ్ బెలూన్‌ను ఆకాశంలోకి పంపించామని టీఐఎఫ్ఆర్‌కు చెందిన సైంటిఫిక్ ఆఫీసర్ నాగేందర్‌రెడ్డి తెలిపారు. 176 మీటర్ల పొడవు ఉండే ఈ బెలూన్ పేలిపోయే ప్రమాదం లేదని, జనసమ్మర్దం లేనిచోట నెమ్మదిగా ల్యాండ్ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు.



కల్వకుర్తి మండలం తర్నికల్ వద్ద పడిన బెలూన్‌కు సంబంధించిన యంత్రం

# లక్కీ నంబర్స్!


## ఫ్యాన్సీ నంబర్ల పట్ల వాహనదారుల్లో పెరిగిన క్రేజ్

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తన కాన్వాయ్‌లోని వాహనాలన్నింటికీ వాడుతున్న ఫ్యాన్సీ నంబర్ 6666.. ఈ సంఖ్యకు ప్రస్తుతం రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు పోటీ ఉంది. ఉమ్మడి ఏపీలో రాజకీయరంగ ప్రవేశం అనంతరం దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తన వాహనాలకు వాడిన నంబర్లు 999, 9999... ఇటీవల టీఎస్ 09 ఎఫ్‌జెడ్ 9999 అనే ఫ్యాన్సీ నంబర్ కోసం ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో ఓ సంస్థ వెచ్చించిన మొత్తం రూ. 9,50,999. గతేడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో టీఎస్ 09 ఎఫ్ఎక్స్ 9999 అనే నంబర్‌కు పలికిన ధర ఏకంగా రూ.13.50 లక్షలు. టీఎస్ 09 జీఏ 0001 నంబర్ పొందేందుకు ఒక సంస్థ రూ.7.25 లక్షలు చెల్లించగా టీఎస్ 09 జీఏ 0007 అనే నంబర్ కోసం మరో సంస్థ రూ. 1.35 లక్షలు వెచ్చించింది.

### ఆన్‌లైన్ వేలంలో వాటికి రూ.లక్షలు వెచ్చిస్తున్న వైనం

- జ్యోతిషం, సంఖ్యాశాస్త్రం, అదృష్టం, నమ్మకం పేరుతో కొనుగోళ్లు
- ఆర్టీఏకు ఏటా రూ.కోట్లు కురిపిస్తున్న ఫ్యాన్సీ నంబర్లు

గత నాలుగేళ్లుగా ప్రత్యేక నంబర్లపై రవాణా శాఖకు లభించిన ఆదాయం (రూ. కోట్లలో)




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఫ్యాన్సీ నంబర్లకు రోజురోజుకూ క్రేజ్ పెరుగుతోంది. లగ్జరీ వాహనాలకు నంబర్లు కూడా ప్రత్యేకంగా ఉండాలనే ఆకాంక్ష వాహనదారుల్లో పెరుగుతోంది. సంఖ్యాశాస్త్రం, జ్యోతిషంపై విశ్వాసం వల్లనో లేదా అదృష్టం కలిసి వస్తుందనే నమ్మకంతోనో, సామాజిక హోదాను చాటేందుకో వాహనదారులు ప్రత్యేక నంబర్లపట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సినీనటులు, రాజకీయ నాయకులు, సాఫ్ట్‌వేర్ సంస్థలు ఈ తరహా నంబర్లపట్ల ఎక్కువ ఆదరణ చూపుతున్నాయి.

### ఆర్టీఏకు భారీ ఆదాయం..

రవాణా శాఖ ప్రతి మూడు నెలలకోసారి విడుదల చేసే ప్రత్యేక నంబర్లలో ఆన్‌లైన్ (9999) నంబర్ ఆల్‌టైమ్ రికార్డు సృష్టిస్తోంది. ఈ నంబర్ ప్రతి సిరీస్‌లోనూ దాదాపు రూ. 10 లక్షలు పలుకుతోంది. కోవిడ్ మహమ్మారి వ్యాప్తి అధికంగా ఉన్న 2020–21 ఆర్థిక సంవత్సరం మినహాయించి రవాణాశాఖకు ఏటా ఆదాయం పెరుగుతోంది. నాలుగైదేళ్ల క్రితం వరకు పెద్దగా ఆదరణలేని నంబర్లకు సైతం ఇప్పుడు అనూహ్యమైన డిమాండ్ లభిస్తోంది. ప్రత్యేక నంబర్ల వేలం నిర్వహించిన ప్రతిసారీ ఖైరతాబాద్ కార్యాలయంలోనే సుమారు రూ. 30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఆదాయం లభిస్తోంది.

### ఒక్కో నంబర్‌కు 10 మంది పోటీ..

ఆర్టీఏలో విడుదల చేసే కొత్త సీరిస్ నంబర్లలో 2,500 వరకు ఫ్యాన్సీ నంబర్‌లు ఉంటున్నాయి. ఒక్కో నంబర్‌కు సగటున 5 నుంచి 10 మంది వాహన యజమానులు పోటీకి వస్తుండగా, నచ్చిన నంబర్లు లభించని వాహనదారులు తదుపరి వేలం కోసం 3 నెలల నుంచి 6 నెలల వరకు కూడా ఎదురు చూస్తున్నారు.

### అదృష్టం కోసమే ఎక్కువ మంది..

- జ్యోతిషాన్ని నమ్మేవారే ఎక్కువగా తమ గ్రహస్థితి ప్రకారం అదృష్ట సంఖ్య పేరిట ఫ్యాన్సీ నంబర్లను ఎంపిక చేసుకుంటున్నారు.
- ఒకటో నంబర్‌ను నాయకత్వానికి, రెండో నంబర్‌ను శాంత స్వభావానికి, 3ను తెలివితేటలకు, '5'ను బుధుడికి ప్రతిబింబంగా భావిస్తున్నారు. జీవితంలో విజేతలుగా, తిరుగులేని నాయకులుగా ఎదగాలని కోరుకుంటున్న వాళ్లు, పోరాడేతత్వం ఉన్నవాళ్లు '9'ని కుజగ్రహానికి ప్రతీకగా భావిస్తూ ఈ నంబర్‌ను ఇష్టపడుతున్నారు. వాహనాలకు ఆయా నంబర్ల వాడకం వల్ల తాము వృద్ధిలోకి వస్తామని చాలా మంది నమ్ముతున్నారు.

### “ క్రేజ్ పెరిగింది..

గతంకంటే ఇప్పుడు ఫ్యాన్సీ నంబర్లకు అనూహ్యమైన క్రేజ్ కనిపిస్తోంది.లగ్జరీ వాహనాలు బాగా పెరిగాయి. ఏటా 10 వేలకుపైగా ఖరీదైన కార్లు విదేశాల నుంచి దిగుమతి అవుతున్నాయి. అలాగే రూ. 50 లక్షల విలువైన బైక్‌లు రోడ్లపై పరుగులు తీస్తున్నాయి. ఈ వాహనాల స్థాయికి తగినట్లుగానే వాహనదారులు నంబర్లను ఎంపిక చేసుకుంటున్నారు.

– జి.పాండురంగ నాయక్, జేటీసీ, హైదరాబాద్

### నంబర్లే బహుమతులు..

- ఇటీవల కాలంలో చాలా మంది తమ కుటుంబ సభ్యులకు వాహనాలను బహుమానంగా అందించడంతోపాటు వారి పుట్టినరోజు కలిసొచ్చే విధంగా రిజిస్ట్రేషన్ నంబర్లను ఎంపిక చేసుకుంటున్నారు.
- '1313'నంబర్ అంటే పంజాబీలకు ఎంతో ఇష్టం. దీన్ని వాళ్లు అదృష్ట సంఖ్యగా భావిస్తారు.
- '5121'అనే నంబర్‌ను ఆంగ్ల అక్షరాల్లో 'సిరి'గా భావిస్తారు.'143', '214', '8045' వంటి నంబర్లకు కూడా ఎంతో క్రేజ్ ఉంది.

# దళారులను నమ్మి మోసపోవద్దు

సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీస్ కొలువుల భర్తీ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. కోర్టు ఆదేశాల మేరకు అదనపు మార్కులతో అర్హులైన అభ్యర్థులకు రెండో దశ దేహదారుఢ్య పరీక్షలను తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) అధికారులు నిర్వహిస్తున్నారు. వచ్చే నెలలో తుది రాత పరీక్షకు బోర్డు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. ఈ దశలో పోలీస్ ఉద్యోగార్థులను మభ్యపెట్టి, ఉద్యోగాలు ఇప్పిస్తామని పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసే దళారులు పెరుగుతున్నారు. ఎట్టిపరిస్థితుల్లో దళారులను నమ్మవద్దని టీఎస్ఎల్పీఆర్బీ అధికారులు హెచ్చరిస్తున్నారు. పోలీస్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చేసే వాగ్దానాలు, వారు చూపించే నకిలీ పత్రాలను చూసి మోసపోవద్దని సూచిస్తున్నారు. రిక్రూట్మెంట్ బోర్డు పేరిట వారు పంపే నకిలీ ఈమెయిల్స్, లెటర్లను నమ్మవద్దని చెబుతున్నారు. దళారుల సమాచారం ఉంటే టీఎస్ఎల్పీఆర్బీ అధికారుల దృష్టికి తేవాలని, సమాచారం ఇచ్చే వాళ్ల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

### పోలీస్ ఉద్యోగార్థులకు నియామక మండలి సూచన



### కొనసాగుతున్న రెండో దశ ఫిజికల్ ఈవెంట్స్

ప్రాథమిక రాత పరీక్షల్లో బహుళ సమాధాన ప్రశ్నలకు అదనపు మార్కులు కలవడంతో అర్హత సాధించిన ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు హైకోర్టు ఆదేశాల మేరకు రెండో దశ దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 15 నుంచి హైదరాబాద్, సైబరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ, ఆదిలాబాద్ కేంద్రాల్లో ఈ ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు. శనివారం (ఈనెల 25) వరకు దేహదారుఢ్య పరీక్షలను పూర్తి చేసే ప్రణాళికతో అధికారులు ఉన్నారు.



గ్రే హెడెడ్ ఫిష్ ఈగల్



ఇండియన్ బిల్డ్ డక్

# ముగిసిన పక్షుల పండుగ

జన్నారం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని కవ్వాల్ అభయారణ్యంలో రెండు రోజుల పక్షుల పండుగ ఆదివారం ముగిసింది. సుదూర ప్రాంతాలకు చెందిన పలువురు పక్షి ప్రేమికులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. వారికి అటవీశాఖ అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన పక్షి ప్రేమికులు 70 మంది వరకు దీనికి హాజరయ్యారు. వీరితోపాటు నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చహత్ బాజ్‌పాయ్, ఆదిలాబాద్ ట్రైనీ కలెక్టర్ శ్రీజ కూడా వచ్చారు. వీరంతా ఉత్సాహంగా పక్షులను తమ కెమెరాల్లో బంధించారు. బైనాక్యులర్‌లతో వివిధ పక్షులను పరిశీలించి, వాటి పేర్లను కనుగొన్నారు. శనివారం మైసమ్మకుంట, ఫణిశెట్టికుంట, కల్పకుంటలో, ఆదివారం బైసన్‌కుంట, మల్యాల వాచ్‌టవర్ ప్రాంతాలలో బర్డ్‌వాక్ నిర్వహించారు. అనంతరం టీడీసీలో అటవీశాఖ అధికారులు బర్డ్ వాకర్ల అభిప్రాయాలు తెలుసుకున్నారు. రెండు రోజుల ఈ పర్యటన తమకు కొత్త అనుభూతిని ఇచ్చిందని, చాలా రకాల పక్షులు, వన్యప్రాణులకు ఈ అడవులు నిలయంగా మారాయని పేర్కొన్నారు. ఇదివరకు ఇతర ప్రాంతాలలో కూడా పర్యటించామని, కానీ కవ్వాల్‌లో ఉన్నట్లుగా ఎక్కడా లేవని తెలిపారు.

### హాజరైన ఐఏఎస్ అధికారులు



ఇండియన్ గోల్డెన్ ఓరియల్



ఉలి నెకెడ్ స్టార్క్



దోవ్



ఆకుపచ్చ పావురం

# చిన్న ఐడియా.. 670 కొలువులు!

## పోలీసు నియామకాల్లో స్వల్ప మార్పుతో అభ్యర్థులకు లబ్ధి
## రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు చొరవతో 670 మందికి ప్రయోజనం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'ఒక చిన్న ఐడియా జీవితాన్ని మార్చేస్తుంది..' అన్నది చాలాసార్లు నిరూపితమైనదే. అలాంటి ఓ ఆలోచన పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఇబ్బందులను పోగొట్టింది. ముందు నుంచే ఉన్న ఇబ్బందిపై సరిగా దృష్టిపెట్టకపోవడంతో సమస్యగా మారితే.. ఒక చిన్న మార్పుతో దాన్ని సరిచేసి వందల మంది అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కల్పించగలిగారు తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్ పీఆర్‌బీ) చైర్మన్ వీవీ శ్రీనివాసరావు.

### సమస్య ఏమిటి?

పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ వేసిన ప్రతీ సారి కూడా ఎస్సై, కానిస్టేబుళ్ల నియామకాలు చేపడుతుంది. అభ్యర్థుల్లో తక్కువ మంది మాత్రమే కేవలం ఎస్సై పోస్టులకు దరఖాస్తు చేస్తారు. నూటికి 99% మంది ఎస్సైతోపాటు కానిస్టేబుల్ ఉద్యోగాలకూ పోటీపడుతుంటారు. వారిలో ప్రతిభావంతులు రెండు పరీక్షల్లోనూ పాసవుతారు. అయితే ఉమ్మడి రాష్ట్రం నాటి నుంచీ తొలుత కానిస్టేబుల్ సెలక్షన్స్, తరువాత ఎస్సై సెలక్షన్స్ జరిగేవి. దీని వల్ల మొదట కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికై, శిక్షణకు వెళ్లినవారు కూడా.. తర్వాత ఎస్సై పోస్టుకు ఎంపికైతే కానిస్టేబుల్ పోస్టును వదులుకునేవారు. ఇలా వందలాది పోస్టులు ఖాళీ అయ్యేవి. అప్పటికే కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తయి, ఖాళీ పోస్టులను డీజీపీకి సరెండర్ చేసి ఉండేవారు. పరీక్షల్లో అర్హత సాధించిన వారు ఎందరో ఉన్నా ఈ ఖాళీల్లో భర్తీ చేసే అవకాశం ఉండేది కాదు. ఆ పోస్టులను తర్వాతి రిక్రూట్‌మెంట్‌లోనే భర్తీ చేయాల్సి వచ్చేది. దీని వల్ల చాలా మంది అభ్యర్థులు వయసు పెరగడం, శారీరక ఇబ్బందులతో పోటీపడే అవకాశం కోల్పోయేవారు.

### ఏం మార్పులు చేశారు?

ఈ లోపాన్ని గుర్తించిన టీఎస్ఎల్ పీఆర్‌బీ చైర్మన్ శ్రీనివాసరావు.. విషయాన్ని అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డికి వివరించారు. ఆయన ఆమోదంతో గత రిక్రూట్‌మెంట్ సందర్భంగా ముందుగా ఎస్సై సెలక్షన్స్ చేపట్టారు. ఎస్సై ట్రైనీలతో సమావేశం నిర్వహించి.. వారిలో 670 మంది కానిస్టేబుల్ పోస్టులకు అర్హత సాధించారని గుర్తించారు. ముందే ఎస్సై పోస్టులో చేరుతున్నందున కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరబోమంటూ అండర్ టేకింగ్ (నిరభ్యంతర పత్రం) తీసుకున్నారు. తర్వాత చేపట్టిన కానిస్టేబుల్ సెలక్షన్స్ జాబితా నుంచి ఆ 670 మందిని తొలగించారు. దీంతో ఇదే సంఖ్యలో ఇతర అభ్యర్థులు ఎంపికయ్యారు. ఖాళీలేమీ ఏర్పడలేదు. మరోవైపు ట్రాఫిక్ అఫెన్స్‌లు, తెలిసీ తెలియని చిన్న నేరాలకు సంబంధించిన కేసులు ఉన్న 350 మందికిపైగా అభ్యర్థులపై వేగంగా దర్యాప్తు పూర్తి చేయించి.. ఉద్యోగ అవకాశం లభించేలా చేశారు.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.